శుక్రవారం
9•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 45
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
040-30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచిని
www.shriramcity.in

# భారత్ ఒకటే రాజ్యాంగం

## ఆర్టికల్ 370 రద్దు చారిత్రాత్మక నిర్ణయం

## ఉగ్రవాదం, వేర్పాటువాదం, కుటుంబపాలనకు చరమగీతం

**ఇకపై జమ్ముకశ్మీర్, లడఖ్‌లో అభివృద్ధి పరుగులు .. జాతినుద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోదీ**


గురువారం జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

### కశ్మీర్‌కు కొత్తశకం

- ఈ ప్రాంత ఉద్యోగులకు మిగతా కేంద్రపాలిత ప్రాంత ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు
- విద్యార్థుల కోసం ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకం అమలు
- ఆధ్యాత్మిక, అడ్వెంచర్, ఎకో టూరిజం కేంద్రాలుగా జమ్ముకశ్మీర్, లడఖ్
- భారీగా సౌరశక్తి ఉత్పత్తికి అనుకూలంగా లడఖ్
- ప్రపంచ మార్కెట్‌కు ఇక్కడి కళాకారుల ఉత్పత్తులు, సేంద్రియ ఉత్పత్తులు: మోదీ

**ఆర్టికల్** 370 రద్దుతో జమ్ముకశ్మీర్‌లో నవశకం మొదలైందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఏడు దశాబ్దాల తర్వాత ఒకే భారత్– ఒకటే రాజ్యాంగం కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేశారు. అంబేద్కర్, సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్, శ్యామాప్రసాద్ ముఖర్జీ వంటి గొప్పనేతలతోపాటు కోట్ల మంది ప్రజల ఆకాంక్షను నెరవేర్చామని చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు, జమ్ముకశ్మీర్ విభజన తర్వాత ప్రధాని మోదీ తొలిసారిగా గురువారం జాతినుద్దేశించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, బాలికల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, 370 అధికరణ వల్ల ఇన్నాళ్లూ అవి కశ్మీర్‌లో పనిచేయలేదని పేర్కొన్నారు. దేశంలోని మిగతా రాష్ట్రాల్లో అమలవుతున్న చట్టాలు, ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు, హక్కులు ఇకపై జమ్ముకశ్మీర్ ప్రజలకు కూడా అందుతాయన్నారు. విద్యార్థుల కోసం ఉన్నత విద్యాసంస్థలను నెలకొల్పుతామని చెప్పారు. యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. ఇన్నాళ్లూ ఆర్టికల్ 370ని పాకిస్థాన్ ఓ ఆయుధంగా వాడుకొని కశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టిందని చెప్పారు.

› వివరాలు 9వ పేజీలో


గురువారం రాష్ట్రపతిభవన్‌లో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీకి భారతరత్న పురస్కారాన్ని అందజేస్తున్న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ 9

## ప్రణబ్‌కు భారతరత్న ప్రదానం

**హజారికా తరఫున పురస్కారాన్ని అందుకున్న ఆయన కుమారుడు తేజ్**

**నానాజీ దేశ్‌ముఖ్ తరఫున అవార్డును స్వీకరించిన కుటుంబసభ్యులు**

# సంఝౌతాకు పాక్ బ్రేక్

## రైలు సేవలను ఆపేస్తున్నట్టు ప్రకటన

**వాఘా సరిహద్దు వద్ద నిలిచిపోయిన రైలు ■ ఇరుదేశాల ప్రయాణికుల ఎదురుచూపులు**

**భారత సినిమాలపైనా పాక్‌లో నిషేధం**

**కశ్మీర్‌పై వెనక్కి తగ్గితే దౌత్య సంబంధాల విషయంలో పునరాలోచిస్తామని వెల్లడి**


గురువారం శ్రీనగర్‌లో ఓ వ్యక్తి సంచిని తనిఖీ చేస్తున్న భద్రతా సిబ్బంది


గురువారం వాఘా సరిహద్దులో పాకిస్తాన్ అనుమతించక పోవడంతో అటారీ రైల్వే స్టేషన్‌కు చేరుకున్న సంఝౌతా ఎక్స్‌ప్రెస్


గురువారం శ్రీనగర్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్

### ఆజాద్‌ను అడ్డుకున్న కశ్మీర్ పోలీసులు

**శ్రీనగర్ విమానాశ్రయం నుంచి వెనక్కి పంపివేత!**

**కశ్మీర్‌లో కొనసాగుతున్న ఆంక్షలు.. కార్గిల్‌లో ర్యాలీ.. పలువురు అరెస్ట్**

**తాజా పరిస్థితిపై జమ్ముకశ్మీర్ గవర్నర్ సమీక్ష**

9

**జమ్ము** కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని ఎత్తివేస్తూ రాష్ట్రాన్ని పునర్విభజిస్తూ భారత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పాకిస్థాన్‌కు కంటగింపుగా మారింది. దీంతో ఇరుదేశాల సంబంధాలు దెబ్బతినేలా వరుస నిర్ణయాలు తీసుకుంటున్నది. బుధవారం పాక్‌లో భారత హైకమిషనర్‌ను బహిష్కరించిన సంగతి తెలిసిందే. తాజాగా భారత్–పాక్‌ను కలిపే సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను నిలిపివేసింది. భారత సినిమాలు పాక్‌లో ఆడకుండా నిషేధం విధించింది. మరోవైపు, పాక్ అదుపులో ఉన్న కుల్‌భూషణ్ జాదవ్‌తో మాట్లాడటానికి భారత అధికారులకు అనుమతినివ్వబోమని పేర్కొంది.

# అడవిని అమ్మేశారు!

**దొంగ పాస్‌పుస్తకాలు.. నకిలీ సర్వేనంబర్లతో చందంపేట రెవెన్యూ అధికారుల దందా**

## గ్రామ పరిధిలో ఉన్నవి 1432 ఎకరాలే

## మూడువేల ఎకరాలకు పట్టాలు జారీ!

ప్రభుత్వ భూములను మిఠాయిల్లా పంచిపెట్టిన నల్లగొండ జిల్లా చందంపేట రెవెన్యూ యంత్రాంగం ఖాతాలో మరో 'రికార్డు' నమోదైంది. అలాఇలా కాదు.. ఈసారి ఏకంగా అడవినే అమ్మకానికి పెట్టారు. ఒకటీఅరా కాదు.. 1500 ఎకరాలకు పైగా అటవీభూములతో భూపందేరాన్ని నిర్వహించి రెవె'న్యూ' అక్రమానికి తెరలేపారు. 2014–16 సంవత్సరాల్లో అధికారులు జాతరలా సాగించిన ఈ అక్రమ దందా తాజాగా వెలుగులోకి వచ్చింది. అప్పటి తాసిల్దార్ మొదలు పలువురు శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు, వీఆర్వో పాత్రధారులుగా.. ఇద్దరు స్థానికులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు సూత్రధారులుగా.. చందంపేట మండలం పొగిళ్ల గ్రామ పరిధిలో జరిగిన ఈ భూ రాకెట్‌లో కోట్ల రూపాయల అక్రమాలు జరిగినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఒక ప్రైవేటు సిమెంటు కంపెనీ పెద్దఎత్తున భూముల కొనుగోలుకు ముందుకురావడంతో రంగంలోకి దిగిన అధికారులు, దళారులు.. గ్రామానికి సంబంధంలేని సర్వేనంబర్లతో అటవీభూమికి అడ్డగోలుగా పాస్‌పుస్తకాలు జారీచేసి.. రికార్డుల్లోనూ నమోదు చేసి దర్జాగా అమ్మేశారు!

గుండాల కృష్ణ
హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన పలు గ్రామాలవారికి చందంపేట మండల పరిధిలో పలుచోట్ల పునరావాస గ్రామాల్ని ఏర్పాటుచేశారు. ఇందులో భాగంగానే 1964లో పొగిళ్ల గ్రామాన్ని ఏర్పాటుచేశారు. ఆ సమయంలో 570 ఎకరాల భూములకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది. ప్రస్తుతం గ్రామ జనాభా రెండువేల వరకు ఉండగా.. 855 మంది ఓటర్లు ఉన్నారు. పెరిగిన కుటుంబాలకు అనుగుణంగా కాలక్రమేణా పట్టా భూముల విస్తీర్ణం కూడా పెరిగింది. ప్రస్తుతం గ్రామ పరిధిలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 1411 ఎకరాల పట్టా భూములుండగా.. 12 మందికి ఆర్వోఎఫ్‌ఆర్ కింద 26 ఎకరాల భూములు సహా మొత్తంగా 1437 ఎకరాల పట్టా భూములు ఉన్నాయి. కృష్ణానదికి చెంతన.. నల్లమల అడవుల్లో ఉన్న గ్రామం కావటంతో గ్రామపరిధిలో భారీఎత్తున అటవీప్రాంతం ఉన్నది. పట్టా, అటవీ భూములన్నీ సర్వేనంబర్ 2 కిందనే ఉన్నాయి. అంటే పొగిళ్ల

› మిగతా 5వ పేజీలో

**ధర్మగంట**


నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో రెవెన్యూ అధికారులు ఎసరు పెట్టింది ఈ అటవీ భూములకే

### దళారులతో అధికారులు, ప్రజాప్రతినిధుల కుమ్మక్కు

- మిర్యాలగూడ నుంచి బస్తాల్లో పాత పాస్‌బుక్కుల తరలింపు
- వాటిలో కొత్త ఫొటోలు.. వైట్‌నర్‌తో మార్పులు.. సంతకాలు
- వేరే ప్రాంతాల నుంచి జనాన్ని తరలించి భూపంపిణీ
- అవే భూములు సిమెంటు కంపెనీకి విక్రయం
- అమ్మినోళ్లకు కొంత.. మధ్య దళారులకు మరికొంత
- ఎకరా రూ.1.20- 1.30 లక్షలకు కొన్న ప్రైవేటు కంపెనీ
- రెవెన్యూ యంత్రాంగానికి రూ.10-20 వేలు ఆమ్యామ్యా
- నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో భారీ భూరాకెట్ బట్టబయలు


గురువారం నిండుకుండలా మారిన శ్రీశైలం జలాశయం

# నేడు తెరుచుకోనున్న శ్రీశైలం గేట్లు!

**పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ**

**శ్రీశైలంలో 176 టీఎంసీలకు నీటినిల్వ**

**సాగర్‌కు 71 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో**

**తుంగభద్రకు లక్ష క్యూసెక్కుల వరద**

**ఉజ్జయిని నుంచి లక్ష క్యూసెక్కులు విడుదల**

**ప్రకృతి రమణీయతతో శ్రీశైలం పరిసరాలు**

**గేట్ల ఎత్తివేత చూసేందుకు పోటెత్తనున్న సందర్శకులు**

హైదరాబాద్/మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి,
నమస్తే తెలంగాణ:

శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా మారుతున్నది. ఎగువనుంచి మూడు లక్షల క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో నమోదవుతున్నది. ఇంకా వరద ప్రవాహం పెరుగుతుండటంతో.. శ్రీశైలంనుంచి దిగువకు నీటిని విడిచేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం శ్రీశైలం కుడి, ఎడమ విద్యుత్ ప్లాంట్ల ద్వారా 96 వేల క్యూసెక్కులను నదిలోకి వదులుతున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో నీటినిల్వ గురువారం రాత్రి 10 గంటల వరకు 176.74 టీఎంసీలకు చేరింది. ఇంకా 3.40 లక్షల క్యూసెక్కులు వచ్చి చేరుతున్నాయి. గతేడాది పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి కూడా 182 టీఎంసీల నిల్వ దాటగానే గేట్లు ఎత్తనున్నట్లు అధికారులు చెప్తున్నారు. ఆ మేరకు శుక్రవారం మధ్యాహ్నం శ్రీశైలం గేట్లు తెరుచుకునే అవకాశాలు ఉన్నాయి. శ్రీశైలం నుంచి నీటి విడుదలకు ఏర్పాట్లుచేసినట్లు నీటిపారుదలశాఖ (ఏపీ) డిప్యూటీ ఇంజినీర్ సేనానంద్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. శుక్రవారం ఏపీ నీటిపారుదల శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ శ్రీశైలం వద్ద పరిస్థితిని సమీక్షించనున్నారు. ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్న నేపథ్యంలో దీనిపై ఆధారపడిన అన్ని సాగునీటి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేస్తున్నారు. తెలంగాణ పరిధిలో ఉన్న ఎంజీకేఎల్‌ఐ ద్వారా 1,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఇక ఏపీ పరిధిలోని హంద్రీనీవా సుజల స్రవంతికి 338, ముచ్చుమర్రి కేసీ కెనాల్‌కు 735 క్యూసెక్కుల చొప్పున నీటిని పంపింగ్ చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ ద్వారా 20 వేల క్యూసెక్కుల జలాలను తరలిస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ ఆధారంగా

› మిగతా 2వ పేజీలో

## గోదావరిలో కొనసాగుతున్న వరద

- కాళేశ్వరం వద్ద 2.80 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- గోలివాడలో 4వ మోటర్ వెట్‌రన్ సక్సెస్
- వెట్‌రన్‌కు సిద్ధమవుతున్న మరో రెండు మోటర్లు

4

## ములుగు, కామారెడ్డి జిల్లాల్లో భారీగా వానలు

7

- పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు.. ఉప్పొంగుతున్న వాగులు
- కామారెడ్డి జిల్లాలో గుడిలో తలదాచుకున్న 23 మంది కూలీలు
- ఆసిఫాబాద్ జిల్లాలో జలపాతంలో యువకుడి గల్లంతు

## రైతుబీమా ప్రీమియం సవరణ

- ఒక్కో రైతుకు ప్రీమియంగా రూ.2,930
- 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.3,457
- సవరణ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- రూ.811.79 కోట్లు విడుదలకు అనుమతి

2

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 73.00 | రిటైల్ లైవ్ | 95.00 |
| డ్రెస్డ్ | 138.00 | స్కిన్‌లెస్ | 157.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 328.00 | రంగారెడ్డి | 328.00 |
| మెదక్ | 328.00 | కరీంనగర్ | 331.00 |
| వరంగల్ | 331.00 | చిల్లర ధర | 3.90 |



## ఆకాశమే హద్దుగా పసిడి

**చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న ధర**

**రూ.550 పెరిగి 38,470 పలికిన బంగారం**

**రూ.630 పెరిగిన కిలో వెండి**

**రూ.44,300కు చేరిక**

11

# ఉన్మాదికి ఉరిశిక్ష

## చిన్నారి శ్రీహిత హంతకుడి కేసు..

## ప్రత్యేక కోర్టు 50 రోజుల్లోనే సంచలన తీర్పు


నిందితుడు ప్రవీణ్

**జుగుప్సాకర నేరస్థులకు ఇదో బలమైన హెచ్చరిక**

**పోలీసు సిబ్బందికి అభినందనలు : డీజీపీ మహేందర్‌రెడ్డి**

**తీర్పుపై టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హర్షం**

**మరింత కఠినమైన చట్టాలు రావాలని వ్యాఖ్య**

2

**రెండు వారాల్లోనే ముగిసిన విచారణ.. జరిగిన నేరం హేయాతిహేయమన్న జడ్జి**

**ప్రభుత్వానికి, పోలీసు యంత్రాంగానికి ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ప్రశంసలు**

యావత్‌దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన జుగుప్సాకర నేరంలో ఉన్మాదికి మరణశిక్ష పడింది. వరంగల్‌లో తొమ్మిదినెలల పసికందును అపహరించుకుపోయి లైంగికదాడికి పాల్పడి, హత్యచేసిన కిరాతకుడి కంఠానికి ఉరి బిగుసుకోనున్నది. పోక్సో చట్టంకింద ఏర్పాటైన ప్రత్యేకకోర్టు.. న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందించింది. చిన్నారులను చిదిమేసే రాక్షసులకు చావు తప్పదంటూ బలమైన హెచ్చరిక చేసింది. నేరం జరిగిన 50 రోజులలోపే ముద్దాయి పోలేపాక ప్రవీణ్‌కు ఉరిశిక్ష పడటంతో బాధిత కుటుంబం, ఈ కేసులో నిందితుడికి తీవ్రశిక్ష పడాలని కోరుకున్నవారు కొంత ఊరడిల్లారు.


గురువారం వరంగల్‌లో కోర్టు తీర్పు అనంతరం నిందితుడు ప్రవీణ్‌ను కోర్టు నుంచి జైలుకు తరలిస్తున్న పోలీసులు




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని కిన్నెరసాని ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతున్నది. రిజర్వాయర్ నీటిమట్టం 407 అడుగులు కాగా, గురువారం సాయంత్రం 405 అడుగులకు చేరింది. ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 8 వేల క్యూసెక్కులు ఉండగా.. 401 అడుగుల వరకూ నీటిమట్టం ఉంచుతూ మూడుగేట్లను ఎత్తి 14 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. -పాల్వంచ రూరల్

# రైతుబీమా ప్రీమియం సవరణ

- ఒక్కో రైతుకు ప్రీమియంగా 2,930
- 18 శాతం జీఎస్టీతో కలిపి రూ.3,457
- సవరణ ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతుబీమా ప్రీమియంను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఒక్కో రైతుకు రూ.2,930 ప్రీమియంను నిర్ణయించింది. దానిపై 18 శాతం జీఎస్టీ (రూ.527.40)తో కలిపి ప్రతి రైతుకు రూ.3,457.40 చొప్పున ప్రభుత్వం ఎల్‌ఐసీకి మొత్తం రూ.908.30 కోట్లు చెల్లించనున్నది. రైతుబీమా ప్రీమియంగా రూ.3013.50, జీఎస్టీ కింద రూ.542.44 కలిపి ఒక్కో రైతు తరపున రూ.3,555.44 చొప్పున ఎల్‌ఐసీకి చెల్లించాలని బుధవారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే ఈ ప్రీమియంను తగ్గిస్తూ వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి గురువారం సవరణ ఉత్తర్వులు జారీచేశారు.

### నిధుల విడుదలకు అనుమతి

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20)లో రైతుబీమా పథకాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రైతు (గ్రూప్ ఇన్సూరెన్స్ (రైతుబీమా) ప్రీమియం చెల్లింపు కోసం రూ.811.79 కోట్ల విడుదలకు పాలనాపరమైన అనుమతులు మంజూరుచేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి సీ పార్థసారథి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.





జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలో అత్యధికంగా పార్టీ సభ్యత్వాలు జరిగిన నేపథ్యంలో ఆ నియోజకవర్గ ఇంచార్జి మందుల సామేలును గురువారం అభినందిస్తున్న సీఎం కేసీఆర్

# జోరుగా టీఆర్‌ఎస్ పార్టీ కమిటీల ఎన్నిక

- పార్టీ, అనుబంధ సంఘాలకు ఎన్నికలు
- వీటిలో 50 శాతానికిపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ బూత్, గ్రామ, వార్డు కమిటీల ఎన్నికలు జోరుగా సాగుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మినహా మిగిలిన ప్రాంతాల్లో పార్టీ సభ్యత్వం పూర్తికావడంతో కమిటీల ఎన్నికలో పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, సభ్యత్వ నమోదు ఇంచార్జీలు ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు సభ్యత్వ నమోదు, కమిటీల ఎన్నికలను పర్యవేక్షిస్తూ నాయకులకు సూచనలు, ఆదేశాలను ఇస్తున్నారు. పార్టీలోని పాత, కొత్త నాయకులను కలిపి కమిటీలను వేయాలని పార్టీ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ ఇప్పటికే నాయకులకు సూచించారు.

### కమిటీల్లో సామాజిక సమతూకం

పార్టీకి ఇప్పటివరకు గ్రామ, వార్డుస్థాయిలో కమిటీలు ఉండగా కొత్తగా అనుబంధ సంఘాలను ఎన్నుకోవాలని పార్టీ నిర్ణయించింది. ప్రతి కమిటీలోనూ 15 మందికి తగ్గకుండా 33 మందికి మించకుండా సభ్యులు ఉండాలని స్పష్టంచేసింది. అన్ని కమిటీల్లోనూ సామాజిక సమతూకాన్ని పాటించాలని ఆదేశించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కనీసం 51 శాతం ఉండేలా చూడాలని సూచించింది. కమిటీల్లో అధ్యక్షుడు, ఇద్దరు ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, ఇద్దరు కార్యదర్శులు, మిగిలినవారు కార్యవర్గ సభ్యులు ఉంటారు. బూత్ కమిటీలో కన్వీనర్‌తో పాటు 15 మంది వరకు, సభ్యులు కొనసాగుతారు. మండల కమిటీల్లో అన్ని అనుబంధ సంఘాలకు కమిటీలు వేయనున్నారు. గ్రామ కమిటీతోపాటు యువజన, మహిళా విభాగాలను, ఎస్సీ, బీసీ, ఎస్టీ, మై నార్టీ అనుబంధ సంఘాలను ఎన్నుకోవాలని పార్టీ సూచించింది. పట్టణాలు, కార్పొరేషన్లలో బూత్, బస్తీ కమిటీలు, వార్డు, డివిజన్ కమిటీలను ఏర్పాటుచేయాలని పేర్కొన్నది. పట్టణ కమిటీల్లో కార్మిక విభాగాన్ని తప్పనిసరిగా ఏర్పాటుచేయాలని తెలిపింది. కమిటీల ఎన్నిక తరువాత సభ్యుల వివరాలను కంప్యూటరీకరించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో బోనాల పండుగ నేపథ్యంలో ఈ నెల 10వ తేదీ వరకు సభ్యత్వ నమోదుకు అవకాశాన్ని కల్పించగా, ఈ నెల 10 నుంచి 20 వరకు కమిటీలను ఎన్నుకోనున్నారు.

# గోదావరిలో కొనసాగుతున్న వరద

- కాళేశ్వరం వద్ద 2.80 లక్షల క్యూసెక్కుల ప్రవాహం
- గోలివాడలో 4వ మోటర్ వెట్‌రన్ సక్సెస్
- వెట్‌రన్‌కు సిద్ధమవుతున్న మరో రెండు మోటర్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా అన్నారం బరాజ్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న గోదావరి నీరు


**హైదరాబాద్/ మంథని, నమస్తే తెలంగాణ/అంతర్గాం/రామడుగు:** గోదావరి వరద ఉధృతి కొనసాగుతున్నది. మేడిగడ్డకు లక్షల క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. స్థానికంగా కురుస్తున్న వర్షాలతో మధ్యతరహా ప్రాజెక్టులతోపాటు చెరువులు జలకళ సంతరించుకుంటున్నాయి. కాళేశ్వరం వద్ద గురువారం సాయంత్రం 2.80 లక్షల క్యూసెక్కుల ప్రవాహం నమోదైంది. పేరూరు వద్ద గోదావరి 6.53 లక్షల క్యూసెక్కులుగా ప్రవహిస్తున్నది. అన్నారం బరాజ్‌కు మానేరు నుంచి వరద వస్తుండటంతో 17 గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. బరాజ్‌కు మానేరు నుంచి 25 వేల క్యూసెక్కులు, సుందిల్ల బరాజ్‌లోని 18 గేట్ల నుంచి 40,104 క్యూసెక్కులు, చిన్నచిన్న వాగుల నుంచి వరద వస్తున్నది. మొత్తం కలిపి బరాజ్‌కు 1,03,000 క్యూసెక్కుల నీరు వస్తున్నది. సాయంత్రం సుందిల్ల బరాజ్‌లో అన్ని గేట్లు మూసివేయడంతో ప్రవాహం తగ్గింది. అన్నారం బరాజ్‌లో 7.02 టీఎంసీ నీరు నిల్వ ఉన్నది. ఇటు కన్నెపల్లి పంప్‌హౌస్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు ఒకటో నంబర్ మోటర్‌ను పది నిమషాలపాటు నడిపి నీటిని అన్నారం బరాజ్‌కు ఎత్తిపోశారు. ఒకటో మోటర్ ఆటోమోడ్ పనులతోపాటు ఫోర్‌బేలో నీరు పెరిగినందున ఆన్ చేసినట్లు ఇంజినీర్లు తెలిపారు. మరోవైపు.. కడెంకు 10వేల క్యూసెక్కులకు పైగా వరద వస్తున్నది. 7.60 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం ఉన్న కడెంలో ప్రస్తుతం 6.33 టీఎంసీలను నిల్వను నిర్వహిస్తున్న అధికారులు దిగువకు 13,947 క్యూసెక్కులను వదులుతున్నారు. ఎల్లంపల్లికి కూడా వరద సాగుతూనే ఉన్నది. నిండుకుండలా ఉన్న ఎల్లంపల్లికి ఎగువ నుంచి 38,496 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువకు 41,711 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. దిగువన ధవళేశ్వరం వద్ద ఇన్‌ఫ్లో 9.96 లక్షల క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 9.87 లక్షల క్యూసెక్కులుగా ఉన్నది. భద్రాచలం పట్టణం వద్ద గురువారం రాత్రి 11 గంటలకు 46 అడుగులమేర వరద ప్రవహిస్తున్నది.

### బాహుబలి వెట్‌రన్‌కు సర్వం సిద్ధం

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని ఎనిమిదో ప్యాకేజీలో బాహుబలి మోటర్ల వెట్‌రన్‌కు రంగం సిద్ధమవుతున్నది. ఇప్పటికే నందిమేడారంలోని ఆరో ప్యాకేజీ పంపులను ప్రారంభించి చెరువులోకి నీటిని ఎత్తిపోయగా అక్కడినుంచి గేట్ల ద్వారా ఎనిమిదో ప్యాకేజీ సర్జ్‌పూల్‌లో సముద్రమట్టానికి సుమారు 194 మీటర్ల వరకు నీటిని నింపారు. ఎనిమిదో ప్యాకేజీని గురువారం స్థానిక ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ సందర్శించి ఈఎన్సీ వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఎత్తిపోతల సలహాదారు పెంటారెడ్డితో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే నందిమేడారం చెరువు నుంచి లక్ష్మీపూర్ ఎనిమిదో ప్యాకేజీకి నీటిని తీసుకొచ్చినట్టు ఈఎన్సీ తెలిపారు. శుక్రవారం మరికొంత నీటిని నింపే అవకాశం ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే భూగర్భంలోని సర్వీస్‌బే వద్దకు చేరుకొని పనులను పరిశీలించారు.

### గోలివాడలో 4వ మోటర్ వెట్‌రన్ సక్సెస్

అంతర్గాం మండలం గోలివాడలోని సుందిల్ల పంప్‌హౌస్‌లో 4వ నంబర్ మోటర్ వెట్‌రన్ సక్సెస్‌అయింది. పంప్‌హౌస్‌లోని తొమ్మిది మోటర్లలో ఆరింటిని సిద్ధంచేసే క్రమంలో ఇప్పటికే 1, 2, 3వ నంబర్ మోటర్ల వెట్‌రన్ నిర్వహించారు. తాజాగా గురువారం మధ్యాహ్నం నాలుగో నంబర్ మోటర్‌కు వెట్‌రన్‌ను చేపట్టగా, దిగ్విజయంగా నీటిని ఎత్తిపోసింది. డెలివరీ సిస్టర్న్ నుంచి దుంకిన జలాలు అప్రోచ్‌కెనాల్ ద్వారా డ్రాప్‌పాయింట్ వద్ద ఎల్లంపల్లి జలాశయంలోకి చేరాయి. మరో రెండు మోటర్లకు సైతం వెట్‌రన్ ప్రక్రియ పూర్తిచేసి సిద్ధంగా ఉంచుతున్నారు. ఇదిలా ఉంటే.. ఇక్కడ మొత్తం నాలుగు మోటర్ల సింక్రనైజేషన్ పూర్తయింది. మరో రెండుమూడు రోజుల్లో మరో రెండు మోటర్లకు సింక్రనైజేషన్ పూర్తిచేయనున్నారు.



గోలివాడలో నాలుగో మోటర్ వెట్‌రన్‌తో డెలివరీ సిస్టర్న్ నుంచి దుంకుతున్న జలాలు

**వివిధ ప్రాజెక్టులలో గురువారం నీటి మట్టాల వివరాలు...**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1696.52 | 129.72 | 88.94 | 3,67,318 | 3,90,929 |
| నారాయణపుర | 1615.00 | 1601.97 | 37.64 | 33.31 | 3,90,000 | 4,12,320 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 1,25,000 | 1,05,647 |
| జూరాల | 1045.00 | 1039.57 | 9.66 | 5.48 | 3,55,000 | 3,69,578 |
| తుంగభద్ర | 1633.00 | 1618.35 | 100.86 | 53.87 | 1,31,602 | 4,005 |
| శ్రీశైలం | 885.00 | 877.79 | 215.81 | 176.74 | 3,64,389 | 94,572 |
| నాగార్జునసాగర్ | 590.00 | 514.60 | 312.05 | 139.61 | 71,899 | 18,163 |
| సింగూరు | 1717.93 | 1670.52 | 29.91 | 0.47 | 20 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.34 | 17.80 | 0.14 | 25 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1056.90 | 90.31 | 10.39 | 12,213 | 282 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.80 | 24.07 | 3.50 | 771 | 204 |
| కడెం | 700.00 | 694.88 | 7.60 | 6.33 | 10,506 | 13,947 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.58 | 20.18 | 19.34 | 38,496 | 40,837 |
| మూసీ | 645 | 627 | 4.46 | 1.03 | 1300 | -- |

# ఉన్మాదికి ఉరిశిక్ష

- శ్రీహిత హత్యకేసులో సత్వర తీర్పు
- నేరం జరిగిన 50 రోజుల్లోనే శిక్ష
- రెండువారాల్లోనే విచారణ ముగింపు

**వరంగల్ లీగల్:** వరంగల్‌లోని హన్మకొండలో తొమ్మిదినెలల పసికందుపై లైంగికదాడి, హత్య కేసులో ముద్దాయి పోలేపాక ప్రవీణ్‌కు వరంగల్ మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కే విజయకుమార్ మరణశిక్ష విధించారు. జూలై 24న ఈ కేసు విచారణను ప్రారంభించిన జడ్జి.. రెండువారాల వ్యవధిలోనే విచారణ ప్రక్రియను ముగించి.. గురువారం తీర్పు వెలువరించారు. 15 రోజుల్లోనే సాక్ష్యాధారాలు సేకరించి, విచారణ పూర్తిచేసి, సకాలంలో సాక్షులందరినీ కోర్టుముందు ప్రవేశపెట్టిన పోలీస్ యంత్రాంగాన్ని, రాష్ట్ర ప్రభుత్వాన్ని జడ్జి అభినందించారు. ఈ చర్యవల్ల న్యాయవ్యవస్థపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందన్నారు. నేరం రుజువుపర్చడానికి సీసీ కెమెరాల ఫుటేజ్ కీలకంగా పనిచేసిందన్నారు. పట్టణాల్లోనూ, పెద్దపెద్ద గ్రామాల్లోనూ ప్రభుత్వం మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటుచేస్తే శాంతి భద్రతల పరిరక్షణ మరింత మెరుగవుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కోర్టు తీర్పుపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. ఇలాంటి కిరాతకులకు ఈ తీర్పుతో వణుకు పుడుతుందన్నారు. చిన్నారి ఆత్మకు శాంతి లభిస్తుందని పేర్కొన్నారు.

### నిద్రలో ఉండగా ఎత్తుకుపోయాడు..

జిల్లా పోలీసులు సవాలుగా స్వీకరించిన ఈ కేసు వివరాలను ప్రాసిక్యూషన్ తరపున వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ మొకిల సత్యనారాయణగౌడ్ మీడియాకు వివరించారు. శ్రీహిత తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో ఉంటున్నారు. పాప మేనమామ జంపాల భరత్‌కుమార్ హన్మకొండలోని కుమార్‌పల్లి నివాసి. చుట్టంచూపు కోసం 2019 జూన్ 17న పాపతో సహా తల్లిదండ్రులు భరత్‌కుమార్ ఇంటికి వచ్చారు. జూన్ 18 రాత్రి మేడపై నిద్రకుపక్రమించారు. ఆ ఇంట్లో చోరీకి వచ్చిన శాయంపేట మండలం వసంతాపూర్‌కు చెందిన పోలేపాక ప్రవీణ్.. రెండు సెల్‌ఫోన్లు తస్కరించడమేకాకుండా.. కామంతో కండ్లు మూసుకుపోయి, చిన్నారని అపహరించి, నిర్జన ప్రదేశానికి తీసుకుపోయి లైంగికదాడి చేశాడు. గుక్కపట్టి ఏడుస్తున్న పాప ముక్కు, నోరు మూయడంతో పాప మరణించింది. అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో పాప తన పక్కన లేదని గ్రహించిన తల్లి.. అందరినీ నిద్రలేపింది. పాపకోసం వెతుకుతున్న సమయంలో ప్రవీణ్ ఆ చిన్నారిని తువ్వాలులో చుట్టుకుని వెళుతూ కనిపించాడు. అటకాయించగా.. పాపను కింద పడేసి పారిపోబోయాడు. అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నెత్తుటిగాయాలతో ఉన్న చిన్నారిని ఓ దవాఖానకు తరలించగా.. అప్పటికే మరణించిందని వైద్యులు తెలిపారు. నిందితునిపై లైంగికదాడి, హత్య, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు.. సాక్ష్యాధారాలను సేకరించి, 31 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడు హేయాతి హేయమైన చర్యకు పాల్పడ్డాడని నిర్ధారించుకొన్న కోర్టు.. అతడికి ఉరిశిక్షతోపాటు.. లైంగికదాడి కేసులో యావజ్జీవ ఖైదు విధించింది. హైకోర్టు తదుపరి అనుమతితో ఉరిశిక్ష అమలు కాగలదని పేర్కొన్నది. ఈ కేసును హన్మకొండ ఏసీపీ సీహెచ్ శ్రీధర్ దర్యాప్తుచేశారు. లైజన్ ఆఫీసర్ దేవరకొండ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కోర్టు డ్యూటీ ఆఫీసర్లు ఎన్ శోభారాణి, ఏ ప్రవీణ్‌కుమార్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు.

### ఇది సంచలన తీర్పు: సీపీ రవీందర్

చిన్నారి హత్యకేసులో ప్రత్యేకకోర్టు చారిత్రాత్మక తీర్పునిచ్చిందని వరంగల్ పోలీసు కమిషనర్ డాక్టర్ రవీందర్ అన్నారు. తీర్పుతో సమాజానికి భరోసానిచ్చినట్లు అయిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నిందితుడిని కఠినంగా శిక్షించేందుకు దర్యాప్తును వేగవంతంచేసి, 21 రోజుల్లోనే కోర్టులో ఆధారాలతో చార్జిషీట్ సమర్పించామని చెప్పారు. ఆధారాలకోసం సీసీటీవీ ఫుటేజ్, డీఎన్‌ఏ నమూనాలు, పోస్ట్‌మార్టం రిపోర్ట్, బ్లడ్‌గ్రూప్ సహా శాస్త్రీయ ఆధారాలను సేకరించామని తెలిపారు. సాక్షులను కోర్టులో హాజరుపర్చి, కేసును త్వరగా విచారించాలని జుడీషియల్ అధికారులను కోరామన్నారు.

### ప్రవీణ్‌కు ఉరిశిక్ష బలమైన హెచ్చరిక: డీజీపీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో ముద్దాయి ప్రవీణ్‌కు ఉరిశిక్ష విధిస్తూ ప్రత్యేకకోర్టు తీర్పునిచ్చి, బాధిత కుటుంబానికి న్యాయంచేసిందని డీజీపీ మహేందర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి జుగుప్సాకర నేరాలు జరుగకుండా ఉరిశిక్ష తీర్పు ఒక బలమైన హెచ్చరిక అన్నారు. ఈ కేసును వరంగల్ పోలీసులు సవాలుగా తీసుకుని నేరం జరిగిన 21 రోజుల్లోనే కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారని, పోలీసు అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు, వైద్య అధికారుల బృందం రాత్రిపగలు శ్రమించి, అన్ని ఆధారాలను శాస్త్రీయంగా సేకరించారని తెలిపారు. సాక్ష్యాధారాలను సమర్థంగా కోర్టుకు అందజేయడంతో ముద్దాయికి మరణశిక్ష పడిందన్నారు. కేసు దర్యాప్తును విజయవంతంగా పూర్తిచేసిన హన్మకొండ ఏసీపీ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ సంపత్‌రావు, సుబేదారి ఇన్‌స్పెక్టర్ సదయ్య, వారి సిబ్బందిని డీజీపీ అభినందించారు. కేసు దర్యాప్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షించిన వరంగల్ పోలీస్ కమిషనర్ రవీందర్‌కు, బాధితులకు న్యాయం జరుగాలని వారి తరపున వాదించిన లాయర్లు, బార్‌కౌన్సిల్ సభ్యులకు, దర్యాప్తులో సహకరించిన సాక్షులకు, పౌర సమాజానికి డీజీపీ మహేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### త్వరగా ఉరితీయాలి

**కోర్టు** తీర్పు అమల్లోకి వస్తే మా బిడ్డ ఆత్మకు శాంతి. ఇన్ని రోజులు దుఃఖాన్ని దిగమింగుకొని ఉన్నాం. ఇప్పుడు నిందితుడికి ఉరిశిక్ష పడింది. చాలా సంతోషం. కానీ నిందితుడిని త్వరగా ఉరితీయాలి. చట్టంపై నమ్మకంతో ఇన్ని రోజులు ధైర్యంగా ఉన్నాం. మాకు జరిగిన అన్యాయం ఎవరికీ జరుగొద్దు. జిల్లా పోలీసులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, వివిధ సంఘాల నాయకులు, స్థానికులు మానవతాదృక్పథంతో సహకరించారు. ఇది మా విజయం కాదు.. మీకోసం మీరు తెచ్చుకున్న విజయం. కోర్టు తీర్పు దేశ ప్రజలకు సంతోషాన్నిచ్చింది. ఇలాంటి ఘటనలు జరుగకుండా తగిన న్యాయం చేసింది. ఇలాంటి చర్యలకు పాల్పడేవారికిభయం పుట్టేలా కోర్టు తీర్పు ఇచ్చింది.

- రచన, జగన్, శ్రీహిత తల్లిదండ్రులు

### ఎమ్మెల్సీ పోచంపల్లి హర్షం

**పసిపాప** హత్యకేసులో వెలువడిన తీర్పుపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం పనితీరును జడ్జి అభినందించడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. గతంలో జరిగిన విచారణ పద్ధతికి భిన్నంగా, సత్వరమే స్పందించి, శాస్త్రీయ ఆధారాలు సేకరించి నిందితుడికి శిక్షపడేలా వ్యవహరించిన ప్రాసిక్యూషన్‌ను అభినందించారు. ఈ కేసులో సత్వరమే ప్రత్యేకకోర్టును ఏర్పాటుచేసి, త్వరితగతిన తీర్పు వెలువడేలా చర్యలు తీసుకోవాలంటూ గవర్నర్‌కు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఎమ్మెల్సీ విజ్ఞప్తిచేసిన విషయం తెలిసిందే.

### కేటీఆర్ హర్షం.. న్యాయవాదులకు అభినందనలు

**తొమ్మిది** నెలల చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో ముద్దాయికి ఉరిశిక్ష విధించడంపట్ల టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు హర్షం వ్యక్తంచేశారు. కోర్టు తీర్పును స్వాగతిస్తూ కేటీఆర్ ట్వీట్‌చేశారు. ఇలాంటి భయానక కేసుల విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు అవసరమన్నారు. కేసుల విచారణకు మరింత కఠిన చట్టాల అవసరం ఉందన్నారు. చిన్నారి కేసులో న్యాయంకోసం వాదించిన లాయర్లకు కేటీఆర్ అభినందనలు తెలిపారు.





నిండుకుండలా శ్రీశైలం జలాశయం.. 876 అడుగులకు చేరిన నీటిమట్టం

# నేడు తెరుచుకోనున్న శ్రీశైలం గేట్లు

▶ మొదటిపేజీ తరువాయి...

ఉన్న అన్ని ప్రాజెక్టులకంటే పోతిరెడ్డిపాడు ద్వారానే పెద్ద ఎత్తున నీరు తరలుతున్నది.

### శ్రీశైలం వద్ద సుందరదృశ్యం

శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 885 అడుగులు కాగా గురువారం 877 అడుగులకు చేరుకున్నది. ప్రాజెక్టు నిండుకుండలా మారి అద్భుతంగా కనిపిస్తున్నది. దానికితోడు సమీప ప్రాంతాలు ప్రకృతి అందాలతో రమణీయంగా మారాయి. గేట్లు కూడా ఎత్తనుండటంతో అపురూపమైన దృశ్యాలను వీక్షించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో సందర్శకులు శ్రీశైలానికి పోటెత్తనున్నారు.

### నాగార్జునసాగర్‌కు భరోసా

నాగార్జునసాగర్ నిండే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఎగువ నుంచి లక్షల క్యూసెక్కులతో వరద కొనసాగుతుండటంతో.. శ్రీశైలం నుంచి సాగర్‌కు వరద భారీగా వెళ్లనున్నది. గురువారం రాత్రి పది గంటల వరకు సాగర్‌కు 72 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. శుక్రవారం శ్రీశైలం గేట్లు ఎత్తి నీటిని విడుదల చేయనుండటంతో రెండ్రోజుల్లో సాగర్‌కు భారీగా ఇన్‌ఫ్లో నమోదుకానున్నది.

### ఎగువన కొనసాగుతున్న వరద

కృష్ణానదికి ఎగువ నుంచి వరద పెరుగుతూనే ఉన్నది. గురువారం సాయంత్రం వరకు ఆల్మట్టికి 3,70,580 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉం డగా.. దిగువకు 3,90,929 క్యూసెక్కులను వదులుతున్నారు. స్పిల్‌వే నుంచి 3,51,938, పవర్‌హౌస్ నుంచి 38,000 క్యూసెక్కులు నదిలోకి వెళ్తున్నాయి. నారాయణపురకు వర ద దాదాపు నాలుగు లక్షల క్యూసెక్కులకు చేరింది. ఈ రెండు ప్రాజెక్టుల్లోనూ వచ్చిన వరదను వచ్చినట్టే దిగువకు విడుదలచేస్తున్నారు. మహారాష్ట్రలోని పుణె డివిజన్ పరిధిలో కొల్హాపూర్, సాంగ్లి, సతారా, పుణె జిల్లా ల్లో భారీ వరద కారణంగా చాలాప్రాంతాల్లో ఇండ్లు నీటమునిగాయి. ఈ నేపథ్యంలో ఆల్మట్టి ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉంచాలని, ఆల్మట్టిని పూర్తి సామర్థ్యంలో ఉంచడంవల్ల మహారాష్ట్రలోని కొన్ని గ్రామాల్లో ఇబ్బందులు ఉన్నాయని సీఎం దేవేంద్రఫడ్నవీస్ చేసిన విజ్ఞప్తి మేరకు కర్ణాటక అధికారులు స్పందించారు. ఆల్మట్టి పూర్తి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా.. కేవలం 88.94 టీఎంసీల సామర్థ్యంలో ఉంచి పైనుంచి వచ్చిన వరదను కిందకు పంపిస్తున్నారు. నారాయణపురలోనూ అదే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ రెండు ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటికి ఉజ్జయిని నుంచి విడుదలవుతున్న నీరుకూడా తోడైంది. ఉజ్జయిని ప్రాజెక్టునుంచి లక్ష క్యూసెక్కులు కృష్ణానదిలోకి వస్తున్నాయి. నారాయణపుర రిజర్వాయర్‌కు గురువారం సాయంత్రం 7 గంటల వరకు 3.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 4.11 లక్షల క్యూసెక్కుల ఔట్ ఫ్లో నమోదైంది. గురువారం రాత్రి 7 గంటల వరకు జూరాలకు ఇన్‌ఫ్లో 3.55 లక్షల క్యూసెక్కులు ఉండగా, అవుట్‌ఫ్లో క్రమంగా పెంచుతున్నారు. సాయంత్రం ఏడుగంటలకు జూరాల నుంచి అవుట్‌ఫ్లో 3.69 లక్షల క్యూసెక్కులు ఉన్నది.

### ఉజ్జయిని నుంచి లక్ష క్యూసెక్కులు

ఎగువన భీమా నదిపై ఉన్న ఉజ్జయిని రిజర్వాయర్ కూడా నిండుకుండలా మారింది. 117.24 టీఎంసీల పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం ఉన్న ఉజ్జయినిలో నిల్వ 117.24 టీఎంసీలకు చేరుకోవడం, ఎగువ నుంచి 1.25 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తుండటంతో అధికారులు దిగువకు 1.05 లక్షల క్యూసెక్కుల నీటి విడుదలను మొదలుపెట్టారు. దీంతో భీమా నుంచి కూడా వరద జూరాలకు తోడుకానున్నది. శుక్రవారం తెల్లవారుజామువరకు జూరాల ఇన్‌ఫ్లో ఐదు లక్షలు దాటుతుందని భావిస్తున్నారు. మరోవైపు గురువారం తుంగభద్రకు కూడా వరద పెరిగింది. జలాశయానికి 1.02 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వస్తున్నది. టీబీ డ్యాంలో ప్రస్తుతం 48.80 టీఎంసీల నిల్వ ఉన్నది.

### కృష్ణమ్మకు పోలీసుల జలహారతి

**నందికొండ:** నాగార్జునసాగర్‌కు తరలివస్తున్న కృష్ణాజలాలకు గురువారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పోలీసులు జలహారతి ఇచ్చారు. 'ప్రజల కోసమే పోలీసులు' అనే నినాదంతో.. సాగర్ నిండి పంటలు సమృద్ధిగా పం డి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ మిర్యాలగూడ డీఎస్పీ పద్మనాథుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజ నిర్వహించారు. ఉదయం పైలాన్‌కాలనీలోని శివాలయంలో, అనంతరం టన్నెల్ వద్ద అర్చకులు సుధాకర్‌శాస్త్రి, త్రిమేధిశాస్త్రిల ఆధ్వర్యంలో పోలీసులు పూజలుచేసి, కృష్ణమ్మకు చీరె, గాజులతో వాయినం సమర్పించి, జలహారతి ఇచ్చారు. పోలీసులు కూడా ప్రజల్లో భాగమేనని, శాంతిభద్రతలతోపాటు వారి సంక్షేమానికి ఇలాంటి కార్యక్రమం చేపడుతున్నామని డీఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు వాయినంగా చీరెలు అం దించారు. కార్యక్రమంలో సీఐలు ధనుంజయ్, వేణుగోపాల్, ఎస్పీఎఫ్ ఆర్‌ఐ కోటేశ్వరరావు, ఎస్‌ఐలు శీనయ్య, మోహన్, యాదయ్య, ఆర్పీఎఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణమ్మకు వాయినం ఇస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

### ముహూర్తం

సూర్యోదయం: 6.01 గంటలకు

సూర్యాస్తమయం: 6.42 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం నవమి ఉదయం 10.02 వరకు, తదుపరి దశమి, నక్షత్రం: అనురాధ రాత్రి 9.59 వరకు, తదుపరి జ్యేష్ఠ, అమృతఘడియలు: ఉదయం 11.22 నుంచి 12.58 వరకు, రాహుకాలం: ఉదయం 10.46 నుంచి మధ్యాహ్నం 12.22 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.33 నుంచి 9.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 12.47 నుంచి 1.38 వరకు, వర్జ్యం: లేదు.

### లోకం పోకడ




'హారం' అంటే బంగారం దుకాణానికి తీసుకుపోతున్నారని అనుకున్నా.. ఇక్కడికి తీసుకొస్తారని అనుకోలేదు!

# రష్యాలో రాకెట్ పేలి.. ఇద్దరి మృతి

**మాస్కో, ఆగస్టు 8:** ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్న సమయంలో ఒక రాకెట్ పేలి ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరో నలుగురికి గాయాలయ్యాయని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. వాయవ్య ఆర్క్యాంగెల్స్క్ ప్రాంతంలోని న్యోనోక్షాలోని మిలిటరీ షూటింగ్ రేంజ్‌లో ఈ ప్రమాదం సంభవించిందని పేర్కొన్నది. రాకెట్‌లోని ఇంజిన్ పేలిపోవడంతో అగ్ని ప్రమాదం సంభవించిందని తెలిపింది. దీంతో ఆరుగురు గాయపడ్డారని తెలిపింది. గాయపడిన వారిలో ఇద్దరు మృతి చెందినట్లు పేర్కొంది. రాకెట్ పేలడం వల్ల రేడియో ధార్మికతగానీ, విషపూరిత పదార్థాలు గానీ విడుదల కాలేదని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది.

# జర్నలిస్టులకు 'విక్రం సారాభాయ్' అవార్డులు

## వచ్చే ఏడాది ఆగస్టు ఒకటో తేదీన ప్రకటిస్తామన్న ఇస్రో

**న్యూఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధన కార్యక్రమం పితామహుడు డాక్టర్ విక్రం సారాభాయ్ శత జయంతి సందర్భంగా అంతరిక్ష విజ్ఞానం, పరిశోధన రంగాల్లో జర్నలిస్టులకు అవార్డులు ప్రదానం చేయనున్నట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రకటించింది. అంతరిక్షం, అప్లికేషన్లు-పరిశోధనలపై వ్యాసాలు రాసిన జర్నలిస్టులకు ఈ అవార్డులను అందజేస్తారు. 2019-2020 మధ్య ప్రచురితమైన వ్యాసాలను ఈ అవార్డులకు పరిగణనలోకి తీసుకుంటామని ఇస్రో పేర్కొంది. అవార్డులను రెండు క్యాటగిరీలుగా విభజించింది. మొదటి క్యాటగిరీలో రూ.5 లక్షల నగదుతోపాటు అవార్డు ప్రదానం చేస్తారు. రెండో క్యాటగిరీ అవార్డు కింద రూ.3 లక్షలు, రూ. 2 లక్షలు, రూ. లక్ష చొప్పున మూడు నగదు బహుమతులు అందజేస్తారు. హిందీ, ఇంగ్లిష్, ప్రాంతీయ భాషల్లో రాసిన వ్యాసాలు, కథనాల ఆధారంగా నామినేటెడ్ సభ్యుల కమిటీ విజేతలను ఖరారుచేస్తుంది. పురస్కారాలను 2020 ఆగస్టు ఒకటో తేదీన ప్రకటిస్తారు.

# జన్మస్థలాన్ని కక్షిదారుగా ఎలా పరిగణిస్తాం?


## అయోధ్య కేసులో ప్రశ్నించిన సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, ఆగస్టు 9:** అయోధ్యలో రామజన్మభూమి-బాబ్రీ మసీదు భూ వివాదం కేసులో దేవుడి జన్మస్థలాన్ని ఒక కక్షిదారుగా ఎలా పరిగణిస్తారని 'రామ్‌లల్లా విరాజ్మాన్' తరఫు న్యాయవాది పరాశరన్‌ను సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అయోధ్య కేసుపై వరుసగా మూడోరోజు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయి, జస్టిస్‌లు ఎస్ఏ బాబ్డే, డీవై చంద్రచూడ్, అశోక్‌భూషణ్, ఎస్ఏ నజీర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. ఆలయాలకు సంబంధించిన ఆస్తుల కేసుల్లో దేవతావిగ్రహాలను కక్షిదారులుగా పరిగణిస్తున్నామని, కానీ ఒక స్థలాన్ని కక్షిదారుగా ఎలా గుర్తించాలని ప్రశ్నించింది. దీనిపై పరాశరన్ వాదిస్తూ 'హిందూ మతంలో ఒక పవిత్ర ప్రదేశంలోనే విగ్రహాలను ఏర్పాటు చేయాలని ఏమీ లేదు. నదులు, సూర్యుడు కూడా పవిత్రమైనవే. రాముడి జన్మస్థలాన్ని ఒక చట్టబద్ధమైన వ్యక్తిగా పరిగణించాలి' అని అన్నారు. ఒక కేసులో నదులను కూడా కక్షిదారుగా చేర్చవచ్చునని ఉత్తరాఖండ్ హైకోర్టు తీర్పు చెప్పిన సంగతిని గుర్తు చేశారు.

### హవాలా కేసులో

# నవాజ్ షరీఫ్ కుమార్తె మర్యమ్ అరెస్ట్



**లాహోర్:** పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కుమార్తె మర్యమ్ నవాజ్‌ను హవాలా కేసులో అరెస్ట్ చేశామని ఆ దేశానికి చెందిన నేషనల్ ఎకౌంటబిలిటీ బ్యూరో (ఎన్ఏబీ) అధికారి ఒకరు చెప్పారు. లాహోర్‌లోని కోట్ లఖ్‌పత్ జైలులో తన తండ్రి నవాజ్ షరీఫ్‌ను కలిసి వస్తుండగా జైలు బయట మర్యమ్ నవాజ్‌ను అరెస్ట్ చేశామన్నారు. పనామా పత్రాల లీక్‌తోపాటు మూడు అవినీతి కేసుల్లో షరీఫ్‌కు ఎన్ఏబీ కోర్టు ఏడేండ్ల జైలుశిక్ష విధించింది. దీంతో 2018 డిసెంబర్ 28 నుంచి ఆయన కోట్ లఖ్‌పత్ జైలులో శిక్ష అనుభవిస్తున్నారు. చౌదరీ షుగర్ మిల్స్ (సీఎస్ఎం) కేసులో మర్యమ్, ఆమె కుటుంబ సభ్యులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఆమెను అరెస్ట్ చేసినట్లు అధికారులు చెప్పారు. ఈ కేసులో మర్యమ్‌తోపాటు ఆమె బంధువు యూసుఫ్ అబ్బాస్‌ను లాహోర్‌లోని ఎన్ఏబీ కోర్టులో ప్రవేశపెడతామని తెలిపారు.



# మరింత హరితం



ఆదిలాబాద్‌లో స్టేడియం వద్ద కనువిందు చేస్తున్న పచ్చదనం

- ఆదిలాబాద్ జిల్లాలో సత్ఫలితాలిస్తున్న హరితహారం
- మూడు, నాలుగోవిడుతలో 2 కోట్ల మొక్కల పెంపకం
- ఐదోవిడుతలో 1.36 కోట్లు నాటేందుకు ప్రణాళిక

హరిత చైతన్యం

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమం అడవుల జిల్లా ఆదిలాబాద్‌కు మరిన్ని అందాలను తీసుకొచ్చింది. జిల్లావ్యాప్తంగా మూడు, నాలుగో విడుత హరితహారం కార్యక్రమాల్లో 2 కోట్ల మొక్కలు నాటిన అధికార యంత్రాంగం.. వాటి సంరక్షణకు పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఫలితంగా ఆ మొక్కలు ఏపుగా పెరిగి జిల్లా హరితమయంగా మారింది. ఐదోవిడుత హరితహారంలోనూ జిల్లా యంత్రాంగం 1.36 కోట్ల మొక్కలను పెంచాలని ప్రణాళికలు రూపొందించింది. తెలంగాణ కశ్మీర్‌గా పేరు గాంచిన ఆదిలాబాద్ జిల్లాలో గతంలో దట్టమైన అడవులు ఉండేవి. కలప అక్రమ రవాణా కారణంగా అడవులు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. హరితహారం కార్యక్రమంతో అడవులు పూర్వవైభవాన్ని సంతరించుకుంటున్నాయి. పలు చబడిన అటవీ ప్రాంతాల్లో బ్లాక్ ప్లాంటేషన్‌లో బాగా పెరిగే వృక్షాల మొక్కలను నాటేందుకు అధికారులు ప్రాధాన్యమిచ్చారు. గ్రామాల్లోనూ ప్రతి ఇంట్లో ఆరు మొక్కలు నాటేలా చర్యలు చేపడుతున్నారు.

**ఈ ఏడాది లక్ష్యం.. 1.36 కోట్ల మొక్కలు**

ఆదిలాబాద్ జిల్లాలో ఐదోవిడుత హరితహారంలో 1.36 కోట్ల మొక్కల పెంపకాన్ని చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఏటా అటవీశాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖల ఆధ్వర్యంలో నర్సరీలను ఏర్పాటుచేసి అవసరమైన మొక్కలను పెంచుతున్నారు. ప్రజలకు అవసరమైన పండ్ల మొక్కలను ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో 20 లక్షలు, డీఆర్డీవో, ఐటీడీఏ, జిల్లా పంచాయతీశాఖల ఆధ్వర్యంలో 99.81 లక్షలు, విద్యాశాఖ 2 లక్షలు, వ్యవసాయశాఖ 5 లక్షలు, పురపాలకశాఖ 2 లక్షలు, పోలీసుశాఖ 1.25 లక్షలు, ఎస్సీ కార్పొరేషన్ లక్ష, ఇరిగేషన్‌శాఖ లక్ష, ఎక్సైజ్‌శాఖ లక్ష, ఆర్ అండ్‌బీ 56 వేలు, రైల్వే, పశుసంవర్ధకశాఖ 50 వేల చొప్పున, ఆర్టీసీ 25 వేల మొక్కలు నాటేందుకు సిద్ధంకాగా, ఇతర శాఖలు సైతం వేలాది మొక్కలు నాటనున్నాయి.

**మొక్కల చుట్టూ కందకాలు**

హరితహారంలో భాగంగా నాటిన మొక్కల సంరక్షణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. వివిధ ప్రాంతాల్లో నాటిన మొక్కలకు చుట్టూ కందకాలను తవ్వి కంచెను ఏర్పాటు చేస్తున్నారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా మొక్కలకు ఎండాకాలంలో ట్రాక్టర్ల ద్వారా నీటి సరఫరా చేపడుతున్నారు. ప్రతి వెయ్యి మొక్కలకు ఒక సంరక్షుడిని నియమిస్తుండగా, రెండేండ్లపాటు మొక్కలను పెంచాల్సిన బాధ్యత వారిపైనే ఉంటుంది. హరితహారంలో నాటిన మొక్కలకు జియోట్యాగింగ్ చేసి వాటి సంరక్షణను పర్యవేక్షిస్తున్నారు. ఐదో విడుత హరితహారంలో నాటేందుకు 40 శాతం టేకు మొక్కలతోపాటు 10 శాతం ఇండ్లలో పెంచే మొక్కలను అందుబాటులో ఉంచారు. వీటితోపాటు 25 రకాల పండ్ల మొక్కలైన సీతాఫలం, ఉసిరి, జీడి, జామ, చింత, మామిడి, రేగి, ఇతర మొక్కల పెంపకాన్ని చేపడుతారు. 25 శాతం నీడను ఇచ్చే కానుగ, సీమ చింత తదితర మొక్కలతోపాటు మందారం, మల్లె, కాగడ వంటి మొక్కలను అధికారులు పంపిణీ చేస్తున్నారు.



2015 జూలై 6వ తేదీన కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్క నాటుతున్న సీఎం కేసీఆర్



కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 2015 జూలై 6వ తేదీన సీఎం కేసీఆర్ నాటిన మొక్క ప్రస్తుతం ఏపుగా ఇలా..

## సీఎం కేసీఆర్ నాటిన మొక్కకు నాలుగేండ్లు

**కామారెడ్డి, నమస్తే తెలంగాణ:** కామారెడ్డి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా 2015 జూలై 6వ తేదీన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కొండమల్లె మొక్కను నాటారు. నాలుగేండ్లపాటు దాన్ని సంరక్షించడంతో ప్రస్తుతం సీఎం నాటిన మొక్క ఏపుగా పెరిగి ఆకట్టుకుంటున్నది.



విజయపాల ఉత్పత్తుల విక్రయానికి వినియోగించే ఎలక్ట్రిక్ వాహనాన్ని గురువారం సచివాలయంలో పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

# ఆదాయం పన్నుశాఖ కియోస్క్‌లు ప్రారంభం

- రిటర్నుల ఈ-ఫైలింగ్ సులభతరానికి హెల్ప్‌డెస్క్‌లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆదాయం పన్ను రిటర్నులను ఎలక్ట్రానిక్ పద్ధతిలో దాఖలు చేయడాన్ని (ఈ-ఫైలింగ్) సులభతరం చేయడానికి గురువారం హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్‌లో ఉన్న ఇన్‌కంటాక్స్ టవర్స్‌లో, బషీర్‌బాగ్‌లోని ఆయకార్‌భవన్‌లో, కొండాపూర్‌లోని సిగ్నేచర్‌టవర్స్‌లో ఇన్ఫర్మేషన్ కియోస్క్‌లను, హెల్ప్‌డెస్కులను ప్రారంభించినట్టు భారత ప్రభుత్వ సమాచారశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి 2019-2020 ఆదాయంపన్ను రిటర్నులను.. సీనియర్ సిటిజన్లకు సంబంధించి కొన్ని సందర్భాల్లో మినహా తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ పద్ధతిలో మాత్రమే దాఖలుచేయాలని ప్రకటనలో స్పష్టంచేసింది. ఆదాయంపన్నుశాఖ ప్రారంభించిన కియోస్క్‌ల వద్ద రిటర్నులు దాఖలుచేయడానికి ప్రజలకు సహాయసహకారాలు అందిస్తారని తెలిపింది.

# జీవాల అక్రమ రవాణాను అడ్డుకోవాలి

- పోలీసులకు హైకోర్టు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** జీవాల అక్రమరవాణాను అడ్డుకోవడంతోపాటు జంతు సంక్షేమబోర్డు జారీచేసిన నియమ నిబంధనలు, ఇదే అంశంపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు గురువారం పోలీసులను ఆదేశించింది. జంతువుల అక్రమరవాణా, అక్రమ వధశాలలపై కేసులు నమోదుచేసేలా పోలీసులను ఆదేశించాలంటూ గోజ్ఞాన్ ఫౌండేషన్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం.. రెండువారాల్లో కౌంటర్ దాఖలుచేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. జంతువుల అక్రమరవాణాను అడ్డుకునేందుకు ఇప్పటికే చెక్‌పోస్టులను ఏర్పాటుచేశామని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారు.

# సచివాలయ తరలింపు ప్రారంభం

- నేడు బూర్గులభవన్‌లోని తన చాంబర్‌లో పూజ చేయనున్న సీఎస్
- ఎర్రమంజిల్‌కు తరలివెళ్లిన రోడ్లు, భవనాలశాఖ కార్యాలయం



సచివాలయం నుంచి ఎర్రమంజిల్‌లోని ఆర్అండ్‌బీ బిల్డింగ్‌లోకి తరలించిన తన చాంబర్‌లో ఆశాఖ కార్యదర్శి సునీల్‌శర్మ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సచివాలయ తరలింపు ప్రక్రియ మొదలైంది. గురువారం రోడ్లు, భవనాలశాఖ కార్యాలయాన్ని ఎర్రమంజిల్‌లోని ఈఎన్సీ కార్యాలయానికి తరలించారు. మిగతా శాఖల కార్యాలయాల తరలింపును ముమ్మరం చేశారు. శ్రావణ శుక్రవారం.. నవమి, దశమి తిథులు కలిసిన మంచిరోజు కావడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి కూడా బూర్గుల రామకృష్ణారావుభవన్‌లో తనకు కేటాయించిన చాంబర్‌కువెళ్లి పూజచేసి, లాంఛనంగా తరలివెళ్లనున్నట్టు సమాచారం. సీఎస్‌వో కూడా తరలివెళ్లింది. జీఏడీ, రెవెన్యూ, ప్లానింగ్, ఫైనాన్స్‌శాఖలు బూర్గులభవన్‌కు తరలివెళ్లడానికి సిద్ధమైనట్టు తెలిసింది. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి చాంబర్‌ను కూడా బూర్గులభవన్‌లోనే కేటాయించినట్టు సమాచారం. దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బొగ్గులకుంటలోని దేవాదాయ కమిషనర్ కార్యాలయానికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రంగారెడ్డి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయానికి తమ చాంబర్లను తరలించాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఎర్రబెల్లి బూర్గులభవన్‌లో కూడా తన చాంబర్‌ను ఉం చుకోవాలని అనుకున్నట్టు సమాచారం. కాగా సీఎం కార్యాలయాన్ని రసూల్‌పురలోని మెట్రోరైల్ కార్యాలయానికి తరలించాలని నిర్ణయించినట్టు తెలిసింది. నాలుగో అంతస్తులో సీఎం కార్యాలయం, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్‌శర్మ చాంబర్లు, మూడో అంతస్తులో సీఎంవో అధికారుల చాంబర్లు ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. ఈ అధికారుల పేషీలు, సీఎమ్మార్ఎఫ్, సీఎం ఫిర్యాదుల సెం టర్లను కూడా ఆదర్శనగర్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కేటాయించినట్టు తెలిసింది. ఈ మేరకు ఆర్అండ్ అధికారులు ఏర్పాట్లుచేస్తున్నారు.

# మొక్కలు నాటి.. స్ఫూర్తి చాటి



హరితహారంలో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం రాయపోల్ సమీపంలోని అటవీప్రాంతంలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

- హరితహారంలో ఒకేరోజు ఆరు లక్షల మొక్కలు
- ఇబ్రహీంపట్నంలో రికార్డు

**ఇబ్రహీంపట్నం, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో గురువారం ఒకేరోజు ఆరులక్షలకుపైగా మొక్కలు నాటి రికార్డు సృష్టించారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డితోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, యువకులు, మహిళలు, పలు ప్రభుత్వశాఖల ఉద్యోగులు, విద్యార్థులు హరితహారంలో ఉత్సాహంగా పాల్గొని పోటీపడి మొక్కలు నాటి హరితస్ఫూర్తిని చాటారు.

# అగ్రవర్ణ పేదలకు న్యాయంచేయాలి

- సీఎం కేసీఆర్ ఆదేశాలను అమలుచేయాలి
- మంత్రి ఎర్రబెల్లి, సీఎస్‌కు బ్రాహ్మణ సేవాసమితి విన్నపం



హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లికి వినతి పత్రం అందజేస్తున్న బ్రాహ్మణ సేవాసమితి గౌరవ అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణులతోపాటు అగ్రవర్ణాల్లోని పేదలకు పదిశాతం రిజర్వేషన్లను అమలుచేసి, న్యాయంచేయాలని బ్రాహ్మణ సేవాసమితి నేతలు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో రిజర్వేషన్ల అమలుకు సీఎం కేసీఆర్ ఇచ్చిన ఆదేశాలను అమలుచేయాలని విన్నవించారు. బ్రాహ్మణ సేవాసమితి గౌరవాధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, జాతీయ ఫ్రంట్ కన్వీనర్ వల్లూరి పవన్ కుమార్ గురువారం ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు జారీచేస్తున్నా కొన్ని కులసంఘాలు రిజర్వేషన్లను అడ్డుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణుల్లో ఆర్థికంగా వెనకబడినవారు చాలామంది ఉన్నారని, పేద విద్యార్థులకు నీట్, ఎయిమ్స్, ఎంసెట్, ఆయుష్ వంటి పోటీపరీక్షల్లో అన్యాయం జరుగుతున్నదని వివరించారు. కార్యక్రమంలో సేవాసమితి ఉపాధ్యక్షుడు రామశర్మ, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు శ్రీనివాసాచార్యులు, ఉపాధ్యక్షుడు టీ రాజేశ్వరశర్మ, హైదరాబాద్ సిటీ కన్వీనర్ శేషం రఘుకిరణాచార్యులు ఉన్నారు. అనంతరం మంత్రి దయాకర్‌రావుకు వేయిస్తంభాల దేవాలయం నుంచి తీసుకొచ్చిన తీర్థప్రసాదాలను అందజేశారు.



గురువారం ఇందిరాపార్క్ వద్ద జరిగిన జూనియర్ డాక్టర్ల మహాధర్నాలో పాల్గొన్న మద్దతు తెలుపుతున్న సినీ నటులు రాజశేఖర్, జీవిత దంపతులు, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్

# జూనియర్ డాక్టర్ల మహాధర్నా

**ముషీరాబాద్, నమస్తే తెలంగాణ:** నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లును వ్యతిరేకిస్తూ వైద్య మహాఘటన పేరుతో జూనియర్ డాక్టర్లు గురువారం ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా చేపట్టారు. ఎన్ఎంసీ బిల్లు వల్ల వైద్య విద్య రాష్ట్ర పరిధినుంచి కేంద్రం చేతుల్లోకి వెళ్లిపోతుందని, కాలేజీ ఏర్పాటు నుంచి సిలబస్ వరకు అంతా కేంద్ర పరిధిలోనే ఉంటుందని జూనియర్ వైద్యులు అన్నారు. బిల్లులో కొన్ని క్లాజులను సవరించాలని, క్లాజ్‌నంబర్ 32 తొలిగించాలని డిమాండ్‌చేశారు. మహాధర్నాకు సినీనటుడు రాజశేఖర్, జీవిత దంపతులు, మాజీఎమ్మెల్సీ నాగేశ్వర్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తదితరులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం వైద్యుల అభిప్రాయాలను పరిగణనలోకి ఎన్ఎంసీ బిల్లులో మార్పులు తీసుకురావాలని కోరారు. ధర్నాలో తెలంగాణ జూనియర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వీరేందర్, మహేశ్, నరేశ్, జాహంగీర్, నాగార్జున్, ఫన్నీ తదితరులు పాల్గొన్నారు.

# అహ్మదాబాద్‌కు ఉగ్రవాది అస్ఘర్‌అలీ

- హరేన్‌పాండ్యా హత్యకేసులో జీవితఖైదు
- కోర్టులో అప్పగించిన నల్లగొండ పోలీసులు
- మిర్యాలగూడ ప్రణయ్ హత్యలోనూ నిందితుడు



అస్ఘర్‌అలీని అహ్మదాబాద్ కోర్టులో హాజరుపరుస్తున్న పోలీసులు

**నల్లగొండక్రైం:** రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మిర్యాలగూడ ప్రణయ్ హత్యకేసులో నిందితుడు, ఐఎస్ఐ ఉగ్రవాది అస్ఘర్‌అలీని పటిష్ఠ భద్రత నడుమ నల్లగొండ జిల్లా పోలీసులు గుజరాత్‌కు తరలించారు. జిల్లా ఇంచార్జి ఎస్పీ రావిరాల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఆ రాష్ట్రానికి మంగళవారం నిందితుడితో బయలుదేరిన పోలీసులు.. గురువారం అహ్మదాబాద్ కోర్టులో హాజరుపరిచారు. గుజరాత్ హోంమంత్రి హరేన్‌పాండ్యా హత్యకేసులో నిందితుడైన అస్ఘర్‌అలీకి ఇటీవల అహ్మదాబాద్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అతడిని కోర్టులో హాజరుపరచాలని ఆదేశాలిచ్చింది. ఈ మేరకు జిల్లా పోలీసులు అస్ఘర్‌అలీని అహ్మదాబాద్ తీసుకెళ్లారు. ప్రణయ్ హత్యకేసులో పీడీ యాక్టు కింద వరంగల్ జైలులో శిక్ష అనుభవించిన అస్ఘర్‌అలీ రెండునెలల క్రితం బెయిల్‌పై విడుదలయ్యాడు. ప్రణయ్ హత్య కేసులో తనతోపాటు నిందితులైన అబ్దుల్ బారి, మారుతిరావును నల్లగొండలో భూమి సెటిల్‌మెంట్ విషయంలో డబ్బు డిమాండ్ చేసే అవకాశం ఉన్నదని గుర్తించిన పోలీసులు అస్ఘర్‌అలీ కదలికలపై నిఘాపెట్టారు. అస్ఘర్ అలీ గంజాయితో చిక్కాడు. బెయిల్‌పై వచ్చాక నేరప్రవృత్తి మార్చుకోకపోగా.. బెదిరింపులు, డబ్బు వసూలు వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నాడని విచారణలో తేలింది. అస్ఘర్‌అలీని విచారిస్తున్న నేపథ్యంలోనే గుజరాత్ కోర్టు హరేన్‌పాండ్యా కేసులో అతడికి జీవిత ఖైదు విధించడంతో పటిష్ఠ బందోబస్తు మధ్య అహ్మదాబాద్ కోర్టులో హాజరుపరిచినట్టు ఇంచార్జి ఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు.



భద్రాచలంలోని స్నానఘట్టం వద్దకు గోదావరి ప్రవాహం

# భద్రాద్రిలో ఉగ్ర గోదావరి

- రాత్రి 11 గంటలకు 46 అడుగులకు చేరిన ప్రవాహం

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీలో గోదావరి ప్రవాహం ఉధృతమవుతున్నది. భద్రాచలం పట్టణం వద్ద గురువారం ఉదయం 6 గంటలకు 42.7 అడుగులు ఉన్న గోదావరి, మధ్యాహ్నం 3 గంటలకు 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. ఆ తర్వాత ఇది మరింత పెరుగుతూ రాత్రి 7 గంటలకు 44.6 అడుగులకు, రాత్రి 11 గంటలకు 46 అడుగులకు చేరుకొని ఉగ్రరూపం దాల్చింది. ప్రవాహం ఇంకా పెరిగే అవకాశం ఉన్నదని సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. దుమ్ముగూడెం హెడ్‌లాక్‌ల వద్ద గోదావరి నీటిమట్టం 21 అడుగులకు చేరింది.



నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద నిండుగా పారుతున్న గోదావరి నది

# కందకుర్తి.. గోదావరి ఉధృతి

**రెంజల్ /బోధన్ రూరల్:** నిజామాబాద్ జిల్లా కందకుర్తి వద్ద గోదావరి నది గురువారం ఉదయం నుంచి నిండుగా ప్రవహిస్తున్నది. మహారాష్ట్రలో రెండ్రోజులుగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు నిండి గోదావరిలో వరద చేరుతున్నది. హరిద్రా, మంజీర నదుల వరద గోదావరిలో చేరుతుండటంతో కందకుర్తి వద్ద పురాతన శివాలయం చుట్టూ నీరు చేరి దిగువకు పరవళ్లు తొక్కుతున్నది. మహారాష్ట్రలోని పలు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేయడంతో శుక్రవారం గోదావరిలో వరద మరింత పెరిగే అవకాశం ఉన్నది. మరోవైపు సాలూర వద్ద మంజీర నది ఉధృతంగా పారుతున్నది.



కేఎల్‌సీసీ కన్వెన్షన్‌లో కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి

## కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డికి ఘన నివాళి

**శంషాబాద్:** కేంద్ర మాజీమంత్రి జైపాల్‌రెడ్డికి గురువారం పలువురు ఘనంగా నివాళి అర్పించారు. శంషాబాద్ సమీప కేఎల్‌సీసీ కన్వెన్షన్‌లో నిర్వహించిన శ్రద్ధాంజలి కార్యక్రమానికి మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంపీ కే కేశవరావు, మాజీమంత్రి గీతారెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, నాయకులు వినోద్, షబ్బీర్‌అలీ, మల్లు రవి, తీగల కృష్ణారెడ్డి, వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు హాజరై ఆయన సేవలను గుర్తుచేశారు. జైపాల్‌రెడ్డి భౌతికంగా లేకపోయినా మనందరి మదిలో పదిలంగా ఉంటారని అన్నారు. ఎందరికో మార్గదర్శకుడని, సెక్యులర్‌వాదని కొనియాడారు.

## నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ సక్సెస్



**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జాతీయ నులి పురుగుల నివారణ దినం సందర్భంగా చేపట్టిన మాత్రల పంపిణీ కార్యక్రమం హైదరాబాద్ జిల్లాలో విజయవంతమయింది. ముషీరాబాద్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జిల్లా సంయుక్త కలెక్టర్ గుగులోత్ రవి మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాఠశాలలోని పలువురు బాలికలకు మాత్రలు వేశారు. 1-19 ఏండ్లలోపు విద్యార్థులంతా నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవాలని సూచించారు. కొన్ని జిల్లాల్లో మాత్రల నాణ్యతాలోపం తలెత్తగా.. వాటిని పరీక్షించేందుకు డ్రగ్ కంట్రోల్ ల్యాబ్‌కు పంపించారు. హైదరాబాద్ జిల్లాలో ఎలాంటి లోపాలు తలెత్తకపోవడంతో మాత్రల పంపిణీ సజావుగా జరిగిందని అధికారులు ప్రకటించారు. మొత్తంగా జిల్లాలో 10,47,735 మందికి అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాల్సి ఉండగా, 8,50,436 మందికి పంపిణీ చేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ టీ వెంకటి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నాగార్జున తెలిపారు. మిగతావారికి ఈ నెల 16న మాత్రలు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు.



లక్నవరానికి జలకళ



లక్నవరం వంతెన మీదుగా ప్రవహిస్తున్న సరస్సు

ములుగు జిల్లాలోని గోవిందరావుపేట మండలం లక్నవరం సరస్సులోకి భారీగా వరద నీరు చేరింది. 33.6 అడుగుల సామర్థ్యం గల లక్నవరం సరస్సు బుధవారం అదనంగా రెండు అడుగుల ఎత్తుతో మత్తడి పడింది. గురువారం ఉదయం సైతం భారీ వర్షం పడటంతో ఉధృతంగా మత్తడి పోసింది. సరస్సుపై ఉన్న రెండు వేలాడే వంతెనల పైనుంచి వరద నీరు ప్రవహించడంతో పస్రా ఎస్సై మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు చల్వాయి వద్ద లక్నవరానికి వెళ్లే దారిని మూసేశారు. పర్యాటకులకు అనుమతిని నిషేధిస్తూ భారీ గేట్లను ఏర్పాటుచేశారు.

- ములుగురూరల్ (గోవిందరావుపేట)

# ఘనంగా మేడారం జాతర

- రూ.10 కోట్లతో గద్దెల పరిసరాల్లో శాశ్వత నిర్మాణాలకు భూ సేకరణ
- జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్రాన్ని కోరుదాం
- ఏర్పాట్లపై మీక్షలో మంత్రులు అల్లోల, ఎర్రబెల్లి, కొప్పుల



మేడారం జాతర నిర్వహణపై గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రులు కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్‌రెడ్డి, దయాకర్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ పోచంపల్లి కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా మేడారం జాతరను ఘనంగా నిర్వహిద్దామని మంత్రులు అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్ చెప్పారు. జాతరకు దాదాపు కోటిన్నర వరకు భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని, దానికనుగుణంగా ఏర్పాట్లుచేద్దామని అన్నారు. మేడారం జాతర నిర్వహణపై అధికారులతో గురువారం సచివాలయంలో మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి మరోసారి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. 2020 ఫిబ్రవరి ఐదు నుంచి ఎనిమిది వరకు జరిగే మేడారం జాతరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. జాతరకు కేంద్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రితో పాటు అన్ని రాష్ట్రాల గిరిజన సంక్షేమశాఖల మంత్రులను ఆహ్వానించనున్నట్టు పేర్కొన్నారు. దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ గిరిజన సంఘాల ప్రతినిధులను ఆహ్వానిస్తామని చెప్పారు.

**రూ.10 కోట్లతో గద్దెల పరిసరాల్లో భూసేకరణ**

మేడారం గద్దెలు, జాతర పరిసరాల్లో జాతర నిర్వహణకు అవసరమైన శాశ్వత నిర్మాణాల కోసం రూ.10 కోట్లతో భూ సేకరణ జరుపాలని మంత్రులు చెప్పారు. భక్తుల వసతులకు, ఆర్టీసీ సేవలకు, పోలీసు సిబ్బందికి అవసరమైన దశలవారీగా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలన్నారు. మేడారం జాతర పూర్తిగా గిరిజన ఉత్సవమని, మేడారం పూజారులు, ఆదివాసీల మనోభావాలు, సంప్రదాయాల ప్రకారం నిర్వహించాలని సూచించారు. జాతర ఏర్పాట్లలోవారి అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. మేడారం పూజారులు, గిరిజన సంఘాల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపే బాధ్యతలను ములుగు జిల్లా కలెక్టర్‌కు, ఏటూరునాగారం ఐటీడీఏ పీవోకు అప్పగించినట్టు పేర్కొన్నారు. మేడారం జాతర కమిటీని వెంటనే ఏర్పాటుచేసేలా ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఆదేశించారు. సీఎం కేసీఆర్‌కు మేడారం ఎంతో ఇష్టమైన జాతర అని, తెలంగాణ రాష్ట్రంలో రెండు జాతరలను విజయవంతంగా నిర్వహించామని అన్నారు. ప్రతిసారి కొత్త పనులు కాకుండా శాశ్వత నిర్మాణాలు ఉండాలని, గత జాతరలో సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు.

**భక్తుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు**

జాతరకు 1.40 కోట్ల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని, అన్నిశాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని మంత్రులు చెప్పారు. జాతరలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా కీలకమని, దీనికోసం ఇప్పటినుంచే ఏర్పాట్లు జరుగాలని సూచించారు. గత జాతరలో విధులు నిర్వహించిన అధికారుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. మేడారం వన జాతర అని, అటవీ సంపదకు నష్టం వాటిల్లకుండా, కాలుష్య నియంత్రణపై కఠినంగా వ్యవహరించాలని, ప్లాస్టిక్‌రహిత జాతర కోసం ప్రజలకు, భక్తులకు అవగాహన కల్పించాలన్నారు. మేడారం జాతరకు అనుబంధంగా జరిగే జాతరల నిర్వహణకు ప్రభుత్వ ఏర్పాట్లు చేయాలన్నారు.

### డిజిటల్ స్క్రీన్ల ద్వారా జాతర గొప్పదనం తెలుపాలి

మేడారం జాతర గొప్పదనం అందరికీ తెలిసేలా హైదరాబాద్, వరంగల్ నగరాల్లో డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటుచేయాలని మంత్రులు సూచించారు. వచ్చేనెలలో మరోసారి సమీక్ష సమావేశం ఉంటుందని, ఆలోపు పూర్తిస్థాయి ప్రణాళికను వెంటనే సిద్ధంచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సీఎం కేసీఆర్‌కు నివేదిక సమర్పిద్దామని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి, గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి మహేశ్‌దత్ ఎక్కా, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్, ములుగు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, పంచాయతీరాజ్‌శాఖ ఈఎన్సీ సత్యనారాయణరెడ్డి, ఐటీడీఏ పీవో చక్రధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## వారంలో ఇల్లు ఖాళీ చేయించండి

- తల్లిదండ్రులను గెంటేసిన కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ
- సీనియర్ సిటిజన్స్‌యాక్ట్ ప్రకారం కేసు నమోదుకు ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులను వారు సొంతంగా సంపాదించుకొన్న ఇంట్లోనుంచి రోడ్డుపైకి గెంటేసిన ఓ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. వారంరోజుల్లో కుమారుడిని ఆ ఇంటినుంచి ఖాళీచేయించి, దానిని వృద్ధ తల్లిదండ్రులకు అప్పగించాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది. దీంతోపాటు గతంలో పిటిషనర్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించి సాదాసీదాగా కాకుండా సీనియర్ సిటిజన్స్‌యాక్ట్ ప్రకారం కేసు నమోదుచేయాలని స్పష్టంచేసింది. గతంలో ఇదేతరహా కేసులో చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్‌చౌహాన్, జస్టిస్ అమర్‌నాథ్‌గౌడ్ నేతృత్వంలోని హైకోర్టు డివిజన్‌బెంచ్ ఇచ్చిన తీర్పును అనుసరించాలని స్పష్టంచేసింది.

## వైద్య సంస్కరణలకు సహకరించండి

- ఖమ్మం, కరీంనగర్‌లో మెడికల్ కాలేజీలకు అనుమతించండి
- కేంద్రానికి రాష్ట్ర మంత్రి ఈటల రాజేందర్ విజ్ఞప్తి



ఢిల్లీలో గురువారం కేంద్రమంత్రి హర్షవర్ధన్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఎంపీలు, బండా ప్రకాశ్, లింగయ్య యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ప్రభుత్వ వైద్యరంగంలో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని, దీనికి సహకరించి సాయమందించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి ఈటల రాజేందర్ తెలిపారు. గురువారం ఆయన టీఆర్‌ఎస్ ఎంపీలు బండ ప్రకాశ్, బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి ఢిల్లీలోని నిర్మాణ్‌భవన్‌లో కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్, సహాయమంత్రి అశ్వనీకుమార్ చౌబేతో భేటీ అయ్యారు. అనంతరం మంత్రి ఈటల మీడియాతో మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు వినూత్న విధానాలను అవలంబిస్తున్నట్లు కేంద్ర మంత్రులకు తెలియజేయడంతోపాటు ప్రభుత్వ వైద్య విభాగాలను అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని కోరామన్నారు. తెలంగాణ వైద్య రంగంలో కొత్త సంస్కరణలకు అండగా నిలుస్తామని, 9 జిల్లాల్లో దవాఖానాల అప్‌గ్రేడ్‌కు సహకరిస్తామని ఆయన హామీ ఇచ్చి నట్టు వెల్లడించారు. తెలంగాణలో డయాలసిస్ కేంద్రాల సంఖ్యను పెంచేందుకు సహకరించడంతోపాటు ఐసీయూ సెంటర్లను కేటాయించాలని కోరినట్టు మంత్రి ఈటల తెలిపారు.

### గనులశాఖపై సమగ్ర సమాచార బ్రోచర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ గనులశాఖపై రూపొందించిన సమగ్ర సమాచార బ్రోచర్‌ను రాష్ట్ర పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ ఆవిష్కరించారు. సచివాలయంలో గురువారం ఆయన గనుల శాఖ డైరెక్టర్ బీఆర్వీ సుశీల్‌కుమార్‌తో కలిసి ఈ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రాష్ట్రంలోని ఏయే జిల్లాల్లో ఎలాంటి గనులు ఎంత పరిమాణంలో ఉన్నాయి? తదితర వివరాలతోపాటు గనులశాఖ చరిత్ర, కార్యక్రమాలు, పరిశ్రమల వివరాలను బ్రోచర్‌లో పొందుపర్చారు. 15 ఏండ్లలో గనులశాఖ ఆదాయ వివరాలు, ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న ఆదాయం, తెలంగాణలో జిల్లాలవారీగా వస్తున్న ఆదాయం, గనులశాఖలో తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలు, ఐటీ వినియోగం తదితర వివరాలు కూడా ఈ బ్రోచర్‌లో ఉన్నాయి. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు గల అవకాశాలు, పారిశ్రామికవేత్తలకు కావాల్సిన సమగ్ర సమాచారాన్ని అందించడంతోపాటు పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో ఈ బ్రోచర్‌ను రూపొందించినట్టు గనులశాఖ డైరెక్టర్ బీఆర్వీ సుశీల్‌కుమార్ తెలిపారు. గనుల సంయుక్త సంచాలకుడు రఫీ, ఉప సంచాలకుడు భాస్కర్‌రెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 16న చేపపిల్లల పంపిణీ

- నాలుగో విడుతకు కాళేశ్వరంలో శ్రీకారం
- 80 కోట్ల చేపపిల్లల విడుదలకు ప్రణాళికలు
- 5 కోట్ల రొయ్య పిల్లల విడుదలకు టెండర్లు పిలవాలి
- మంత్రి తలసాని ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి తలసాని. చిత్రంలో పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, మత్స్యశాఖ కమిషనర్ సువర్ణ కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో నాలుగో విడుత చేపపిల్లల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారుచేసింది. ఈ నెల 16వ తేదీన భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టులో చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ లాంఛనంగా ప్రారంభిస్తారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలోని 24 వేల నీటివనరులలో 80 కోట్ల చేపపిల్లలను విడుదలచేయాలని మత్స్యశాఖ నిర్ణయించింది. నాలుగో విడుత చేపపిల్లల పంపిణీ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో అమలుచేస్తున్న వివిధ కార్యక్రమాలపై మంత్రి తలసాని గురువారం సచివాలయం నుంచి ఆ శాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ సువర్ణతోకలిసి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జిల్లాల్లో చేపపిల్లల సరఫరా కోసం టెండర్ల ప్రక్రియను ఈ నెల 16వ తేదీలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. చేపపిల్లల విడుదల కార్యక్రమంలో తప్పనిసరిగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు, మత్స్యకారులను భాగస్వాములను చేయాలని స్పష్టంచేశారు.

**తప్పనిసరిగా వీడియో తీయాలి**

నిబంధనల మేరకు నాణ్యతతో ఉన్న చేపపిల్లలను మాత్రమే నీటి వనరులలో విడుదలచేయాలని, తప్పనిసరిగా వీడియో తీయాలని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ అధికారులకు సూచించారు. ఉదయం 11 గంటలలోపే చేపపిల్లల విడుదలను పూర్తిచేయాలని ఆదేశించారు. గత రెండేండ్లలో ప్రయోగాత్మకంగా చేపట్టిన రొయ్యపిల్లల పెంపకం సత్ఫలితాలు ఇవ్వడంతో ఈ ఏడాది ఐదుకోట్ల రొయ్య పిల్లలను నీటివనరులలో విడుదలచేయాలని.. అందుకు టెండర్లు పిలవాలని సూచించారు.

### ప్రజలకు మరింత చేరువగా విజయ పాల ఉత్పత్తులు

- వాహనాలను పరిశీలించిన మంత్రి తలసాని

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రజాదరణ పొందిన విజయ పాలు, పాల ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అనేక చర్యలు తీసుకుంటున్నట్టు పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. గురువారం సచివాలయంలో విజయ ఉత్పత్తుల విక్రయానికి వినియోగించే ఎలక్ట్రిక్ వాహనాన్ని పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, విజయ డెయిరీ ఎండీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు.

### పీజీఈసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంటెక్, ఎంఫార్మసీ కళాశాలల్లో సీట్ల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ ఈ నెల 13 వరకు కొనసాగనున్నది. గేట్/ జీప్యాట్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన బుధవారం ప్రత్యేకంగా చేపట్టారు. వారంతా గురువారం వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. పీజీఈసెట్‌లో ర్యాంకులు సాధించినవారికి శుక్రవారం (ఈ నెల 9) నుంచి 14 వరకు ధ్రువపత్రాల పరిశీలనతోపాటు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతుందని అడ్మిషన్ కమిటీ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు తెలిపారు. ర్యాంకులు, తేదీలవారీగా కౌన్సెలింగ్‌కు హాజరు కావడానికి, ఇతర వివరాలకు http://pgecetadm.tsche.ac.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

### ఐఏఎస్ అధికారి మురళికి పదోన్నతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీనియర్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళికి రాష్ట్ర ప్రభుత్వం సెలక్షన్ గ్రేడ్ లెవల్ 13 పదోన్నతి కల్పించింది. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఉత్తర్వులు జారీచేశారు. ఆర్థికశాఖలో పనిచేస్తున్న తెలంగాణ సెక్రటేరియట్ సర్వీస్‌కు చెందిన నాన్‌క్యాడర్ అధికారులైన ఆర్ రవి, కే ధర్మయ్యలకు అడిషనల్ సెక్రటరీలుగా పదోన్నతులు కల్పిస్తూ ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీచేశారు.


### గడువు పొడిగింపు

స్టేట్ కోఆపరేటివ్ కార్పొరేషన్ యూనియన్‌పై ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ గడువును ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. ఈ యూనియన్ పదవీ కాలం ఈ నెల 11తో ముగియనుంది. దీంతో యూనియన్ చైర్మన్ టీ రాజేశ్వర్‌రావు (కరీంనగర్), సభ్యులు ఆర్ సాంబరెడ్డి (వరంగల్), సీహెచ్ దేవేందర్‌రెడ్డి (మెదక్), ఎస్ సుబ్రహ్మణ్యం (హైదరాబాద్) పదవీకాలాన్ని మరో ఏడాదిపాటు పొడిగిస్తూ కోఆపరేటివ్ శాఖ ముఖ్య కార్యదర్శి సీ పార్థసారథి గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

### జాతీయ ఎస్సీ కమిషన్ కార్యాలయం మార్పు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్ కవాడిగూడలోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో ఉన్న షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ కార్యాలయాన్ని 9వ అంతస్తులోని రూం నంబర్ 906కి మార్చినట్టు ఆ కార్యాలయం గురువారం ఓ ప్రకటనలో తెలిపింది. అంతకుముందు ఈ కార్యాలయం గ్రౌండ్‌ఫ్లోర్‌లోని రూం నంబర్ 5లో ఉండేది.



సెంచూరియన్ వర్సిటీకి చెక్కును అందజేస్తున్న వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం

### ముస్లిం యువత నైపుణ్యాభివృద్ధికి కృషి

వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ముస్లిం యువత నైపుణ్యాభివృద్ధికి వక్ఫ్‌బోర్డు కృషిచేస్తున్నదని వక్ఫ్‌బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీలో పేద ముస్లింలకు శిక్షణ ఇప్పించామని తెలిపారు. శిక్షణ కార్యక్రమానికి వక్ఫ్‌బోర్డు ఇచ్చిన రూ.10 లక్షల చెక్కును గురువారం ఆయన యూనివర్సిటీ బాధ్యులకు అందజేశారు.

### ఇంజినీరింగ్ సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో మొదటి, రెండు విడుతల ఎంసెట్ కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లను స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేసే ప్రక్రియ ప్రారంభమైంది. సంబంధిత నోటిఫికేషన్‌ను గురువారం జారీచేశారు.

# అత్యున్నత స్థాయికి ఎదగాలి

- ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నింపనున్న స్టడీ సర్కిళ్లు
- సివిల్ సర్వీసెస్ కోచింగ్‌ను ప్రారంభించిన మంత్రి కొప్పుల
- స్టడీ సర్కిళ్లలో శిక్షణపొంది ఎస్సైగా ఎంపికైన అభ్యర్థులకు సన్మానం



ఎస్సై ఉద్యోగాలకు ఎంపికైన ఎస్సీ స్టడీ సర్కిల్ విద్యార్థులను సన్మానిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీను, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ మిశ్రా తదితరులు

**హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తెలంగాణ బిడ్డలు ఉన్నత చదువులు చదివి, అత్యున్నత స్థాయికి ఎదుగాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆకాంక్షించారు. చదువుపట్ల తగు శ్రద్ధచూపి, నిర్దేశించుకున్న లక్ష్యం మేరకు సివిల్ సర్వీస్ సాధించాలని ఉద్బోధించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ స్టడీ సర్కిళ్లు సత్ఫలితాలు ఇస్తున్నాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేద కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువత జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని చెప్పారు. బీసీ సర్కిళ్లలో శిక్షణ పొంది ఎస్సై ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను గురువారం మధ్యాహ్నం సచివాలయంలో ఆయన సన్మానించారు. సాయంత్రం బంజారాహిల్స్‌లోని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్లో సివిల్ సర్వీసెస్ కోచింగ్ బ్యాచ్ శిక్షణను ఆయన ప్రారంభించారు. ఎస్సై ఉద్యోగాలకు ఎంపికైన 20 మంది విద్యార్థులను శాలువాతో సన్మానించారు. అనంతరం స్టడీ సర్కిల్ ఆవరణలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. పేద విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన శిక్షణ, సహకారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్టడీ సర్కిళ్లు నిరుద్యోగులకు వరంగా మారాయని పేర్కొన్నారు. 250 మందితో బ్యాచ్ ప్రారంభం కాగా, వీరందరికి స్టడీ సర్కిళ్లోనే ఉచిత వసతి, నాణ్యమైన భోజనాన్ని కల్పిస్తున్నామన్నారు. అభ్యర్థులకు మే నెల 31న జరిగే ప్రిలిమినరీ పరీక్ష వరకు సివిల్స్‌పై ప్రఖ్యాతిగాంచిన అధ్యాపకులతో తర్ఫీదునిస్తామని చెప్పారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఎస్సై ఉద్యోగాల కోసం 135 మందికి మెయిన్స్ పరీక్షల్లో శిక్షణ ఇవ్వగా 18 మంది, ఎస్సీ స్టడీ సర్కిళ్లలో 150 మందికి మెయిన్స్ పరీక్షల్లో శిక్షణ ఇవ్వగా 39 మంది ఉద్యోగాలు సాధించడం హర్షణీయమని మంత్రి పేర్కొన్నారు. ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన ఐదుగురు అభ్యర్థులు సివిల్ సర్వీసెస్‌కు ఎంపిక కావడం గొప్ప విషయమని చెప్పారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎస్సీ స్టడీ సర్కిల్ నుంచి ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్, వివిధ ప్రభుత్వ శాఖల్లో, బ్యాంకింగ్ సర్వీసుల్లో 780 మంది అభ్యర్థులు ఎంపిక కావడం ఆనందం కలిగించిందన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా, బీసీ సంక్షేమశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ కరుణాకర్, బీసీ సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి సైదా, బీసీ గురుకుల సొసైటీ కార్యదర్శి మల్లయ్యభట్టు, ఎస్సీ, బీసీ స్టడీ సర్కిళ్ల డైరెక్టర్లు శ్రీధర్, బాలాచారి తదితరులు పాల్గొన్నారు.

## 509 జూనియర్ కాలేజీలకు అఫిలియేషన్లు

- యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ జారీ
- మిగిలిన కాలేజీలకు త్వరలో


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను రాష్ట్రంలో ఇప్పటివరకు 509 ప్రైవేటు జూనియర్ కాలేజీలకు అఫిలియేషన్లు మంజూరుచేసినట్టు ఇంటర్ బోర్డు అధికారులు చెప్పారు. ఆయా కళాశాలల్లో అడ్మిషన్ల కోసం యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ జారీ చేస్తున్నట్టు తెలిపారు. మిగిలిన 700 కాలేజీల అఫిలియేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నదని అన్నారు. ఈ ఏడాది అఫిలియేషన్ కోసం మొత్తం 1,699 కాలేజీలు దరఖాస్తుచేసుకోగా గురువారంవరకు 509 కాలేజీలకు అఫిలియేషన్లు ఇచ్చామని, 490 కాలేజీలను అఫిలియేషన్ తిరస్కరణ జాబితాలో చేర్చామని అధికారులు వివరించారు.

**జూనియర్‌లో కాలేజీల్లో 16 వరకు అడ్మిషన్లు**

రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులకు ఈ నెల 16 వరకు అవకాశం కల్పించారు. ఈ మేరకు రెండోదశ ప్రవేశాలకు గడువు పొడిగించినట్టు ఇంటర్ బోర్డు సెక్రటరీ ఏ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్షేమశాఖలోని జూనియర్ కాలేజీలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీ పరిధిలోని జూనియర్ కాలేజీల్లో కూడా అడ్మిషన్లు పొందడానికి ఈ అవకాశాన్ని కల్పించామన్నారు.

## టీఆర్‌ఐ భవనానికి నేడు శంకుస్థాపన

**అహ్మద్‌నగర్/హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ గిరిజన సంస్కృతిని చాటిచెప్పేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్నది. అలనాటి గిరిజన సంస్కృతిని నేటితరాలకు అందించేందుకు విశేష కృషిచేస్తున్నది. ఇందులోభాగంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని ట్రైబల్ మ్యూజియం ప్రాంగణంలో ట్రైబల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టీఆర్‌ఐ) నూతన భవనానికి సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. దీంతోపాటు రూ.50 లక్షలతో ఆధునీకరించిన ట్రైబల్ మ్యూజియాన్ని ఆయన ప్రారంభించనున్నారు.



మాసబ్‌ట్యాంక్‌లోని ట్రైబల్ మ్యూజియం

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE



రైతుకు కొత్త పాస్‌బుక్ ప్రతిని అందజేస్తున్న నిజామాబాద్ ఆర్డీవో వెంకటేశ్వర్లు

## పాల్దాలో భూసమస్య పరిష్కారం


'పైసలిస్తేనే పనైతది' కథనానికి ఇందూరు అధికారుల స్పందన

13 మందికి కొత్త పాస్‌పుస్తకాల ప్రతులు అందజేసిన ఆర్డీవో

**నిజామాబాద్ రూరల్:** నిజామాబాద్ రూరల్ మండలం పాల్దా గ్రామానికి చెందిన రైతులు ఎదుర్కొంటున్న భూసమస్యలపై జూలై 5న 'నమస్తే తెలంగాణ'లో 'పైసలిస్తేనే పనైతది' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. నిజామాబాద్ జేసీ, ఆర్డీవో ఆదేశాల మేరకు నిజామాబాద్ రూరల్ తాసిల్దార్ జ్వాలగిరి రావు పాల్దాలోని రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసమస్యల దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆర్‌ఐ సంతోష్‌కుమార్, వీఆర్వోలు ప్రవీణ్‌కుమార్, ఆశన్న, అర్చన స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 13 మంది రైతుల సమస్యలను పరిష్కరించారు. గురువారం నిజామాబాద్ ఆర్డీవో వెంకటేశ్వర్లు, తాసిల్దార్ బాధిత రైతులకు కొత్త పాస్‌పుస్తకాల ప్రతులను అందజేశారు. సుంకరి గంగాధర్ ఎకరం భూమిని రికార్డులో ఎక్కించాలని అధికారుల చుట్టూ తిరుగగా, ఆ భూమిని సరిచేసి రికార్డులో ఎక్కించారు. వృద్ధ రైతు బూరుగు మాణిక్యంకు చెందిన ఆరు గుంటల భూమిని, మహిళా రైతు గంగుబాయికి చెందిన పదకొండున్నర గుంటల భూమిని, సంగెం భోజన్న భూమి పదిన్నర గుంటలను రికార్డులో ఎక్కించారు. తండ్రి పేరిట ఉన్న పది గుంటలను తాడూరి గంగామణి పేరిట పట్టా మార్పిడిచేశారు. తాడూరి లక్ష్మీనారాయణ భూమి 21 గుంటలను, కంకల్ల గంగుబాయి భూమి 1.16 ఎకరాలను రికార్డుల్లో సరిచేశారు. ఈ విధంగా రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 13 మంది రైతుల భూసమస్యలను పరిష్కరించడంతో పాల్దా గ్రామ రైతులు హర్షం వ్యక్తంచేశారు. ఈ బాధిత రైతులకు కొత్త పాస్‌పుస్తకాల ప్రతులను నిజామాబాద్ ఆర్డీవో అందజేశారు.

# తొమ్మిదెకరాలు తీసేశారు

- రికార్డుల ప్రక్షాళనతో రెవెన్యూ అధికారుల పొరపాటు
- అరవై ఏండ్లుగా కాస్తులో ఉన్న భూమికి ఎసరు
- సూర్యాపేట జిల్లా మోతె మండలంలో రైతు కుటుంబం ఆవేదన



5.29 ఎకరాలు నమోదైన బాధిత రైతు మహేందర్ పాత పాస్‌పుస్తకం.. 2.25 ఎకరాలే నమోదైన కొత్త పాస్‌పుస్తకం


**మోతె:** సూర్యాపేట జిల్లా మోతె మండలం కూడలి గ్రామ రెవెన్యూ శివారులో సర్వే నంబర్లు 30, 31, 34/2, 35/2, 44, 54/1, 55/1లో 17.35 ఎకరాల భూమి భూక్యా టీక్యా పేరిట పట్టా అయి ఉన్నది. టీక్యాకు ఆ భూమి తాతల నుంచి వారసత్వంగా సంక్రమించింది. 2006 లో తన ముగ్గురు కుమారులైన మహేందర్, జయరాజు, శివలాల్‌కు భాగ పంపిణీచేశారు. 17.35 ఎకరాల భూమిలో మహేందర్, జయరాజ్‌లకు 5.29 ఎకరాల చొప్పున.. శివలాల్‌కు 5.30 ఎకరాలు పట్టాచేశారు. మిగిలిన 27 గుంటల భూమి టీక్యా పేరిటే ఉన్నది. ఇంతవరకు బాగానే ఉన్నది. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన కొత్త పాస్‌పుస్తకాల్లో మహేందర్‌కు 2.25 ఎకరాలు, జయరాజ్‌కు 2.26 ఎకరాలు, శివలాల్‌కు 2.26 ఎకరాలు, టీక్యాకు 27 గుంటల భూమి మొత్తం 8.22 ఎకరాలు మాత్రమే నమోదయ్యాయి. సర్వే నంబర్లు 30లో 6.12 ఎకరాలు, 31, 34/2, 44లలో 3.01 ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు పార్టు (బీ)లో పెట్టారు. దీంతో ముగ్గురు అన్నదమ్ములు రెవెన్యూ అధికారులను ఆశ్రయించగా నెలరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కానీ.. రెండేండ్లయినా సమస్య పరిష్కారం కాలేదని బాధితులు వాపోయారు. తమ సర్వే నంబర్‌లో తక్కువ భూములు ఉన్న ఇతర రైతులకు ఎక్కువ భూమి రికార్డుల్లో నమోదైందని.. ఆ పట్టాలను తీసుకెళ్లి అధికారులకు చూపించి వివరించినా.. పట్టించుకోవడం లేదన్నారు. తమ భూమిని తొలగించడానికి ప్రధాన కారణం స్థానిక వీఆర్వోనేనని ఆరోపిస్తున్నారు. జూన్ 26న జిల్లా రెవెన్యూ అధికారికి ఫిర్యాదుచేసినా సమస్య పరిష్కారం కావడంలేదన్నారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ప్రభుత్వం అందించే రైతుబంధును కోల్పోతున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని.. పార్ట్ బీలోకి వెళ్లిన తమ భూమిని తిరిగి రికార్డుల్లోకి ఎక్కించాలని వేడుకొన్నారు.

### సమస్యను పరిష్కరిస్తాం

ఆ సర్వే నంబర్లలో ఉన్న భూమి కంటే ఎక్కువ రావడంతో సర్వే చేయించాం. దానికి సంబంధించిన రిపోర్టు ఇప్పటివరకు రాలేదు. అందువల్లే సమస్య పరిష్కారం కాలేదు. తాసిల్దార్ ఆ సర్వే నంబర్లలో ఉన్న రైతులకు అందరికీ కొంత కొంత భూమి తగ్గించి ముందుగా రికార్డుల్లో నమోదుచేయాలని చెప్పారు. అందుకే అలా చేశాం. ఈ సమస్యను వెంటనే పరిష్కరిస్తాం.


– ఉపేందర్, వీఆర్వో

### రేపు మాపు అంటూ తిప్పకుంటుర్రు



మా తాత నుంచి వారసత్వంగా వచ్చిన భూమిని వీఆర్వో పార్టు (బీ) లో పెట్టి మా అన్నదమ్ములను నానా ఇబ్బందులు పెడుతున్నడు. మా తండ్రికి ఉన్న 17.35 ఎకరాల భూమిలో 8.22 ఎకరాలకు మాత్రమే పాస్‌పుస్తకాలు వచ్చాయి. మిగతా భూమి పాస్‌పుస్తకాల్లో ఎక్కించాలని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాను. సర్వే చేయిస్తామని చెప్పారు.. దానికి కూడా రేపు మాపు అంటూ తిప్పుకొంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కానీ సమస్యను మాత్రం పరిష్కరించడం లేదు.

– భూక్యా మంహేందర్, బాధిత రైతు



నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పాగిళ్ల గ్రామం



నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పాగిళ్ల గ్రామాన్ని ఆనుకొని ఉన్న అటవీ భూమి

# అడవిని అమ్మేశారు!

మొదటిపేజీ తరువాయి...

గ్రామపరిధిలోని సర్వే నంబర్ 2లో 1,411 ఎకరాల పట్టా భూములు, వేల ఎకరాల అటవీ భూములు ఉన్నాయి. కానీ 2014-15 ప్రాంతంలో రెవెన్యూ రికార్డుల్లో నకిలీ సర్వే నంబర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. 1-177 వరకు బై నంబర్లతో ఏకంగా 1,500 వరకు ఖాతాలు తెరిచారు. సుమారు మూడు వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలోని భూములకు పాస్‌పుస్తకాలు జారీచేశారు. అటవీప్రాంతానికే ఎసరుపెట్టారు.

**ప్రైవేటు కంపెనీ రాకతో బీజం..**

పాత నల్లగొండ, ప్రస్తుత సూర్యాపేట మండల పరిధిలోని మేళ్లచెరువు, మఠంపల్లి, దామరచర్ల తదితర ప్రాంతాల్లో సిమెంటు కంపెనీలు ఉన్నాయి. నల్లమల అడవుల్లో సిమెంటు గనులు ఉన్నందున కేంద్ర ప్రభుత్వ అనుమతితో అక్కడ సిమెంటు తయారుచేస్తుంటారు. అటవీ భూములు కేటాయించినందుకు చట్టం ప్రకారం అంతే విస్తీర్ణంలో ఇతర ప్రాంతాల్లో అటవీ అభివృద్ధికి సదరు కంపెనీ కాంపెన్సేషన్ కింద అటవీశాఖకు భూములు ఇవ్వాల్సి ఉంటుంది. ఇందుకు సిమెంటు కంపెనీలు తక్కువ ధర ఉన్న చోట భూముల్ని భారీఎత్తున కొనుగోలుచేసి, వాటిని అటవీశాఖకు ఇస్తుంటాయి. ఇదేరీతిన ఒక సిమెంటు కంపెనీ భవిష్యత్తులో కాంపెన్సేషన్ కింద భూముల్ని సమీకరించేందుకు 2014లో చందంపేట మండలంలో భారీఎత్తున భూముల కొనుగోలుకు ముందుకొచ్చింది. దీంతో భూ రాకెట్‌కు తెరలేచింది. దళారులు రంగప్రవేశం చేయడం.. అధికారులు వారితో మిలాఖత్ కావడంతో పాగిళ్ల గ్రామ రెవెన్యూ రికార్డులకు రెక్కలొచ్చాయి.

**పాత పుస్తకాలతో భూ మాయ**

పాగిళ్ల గ్రామ పరిధిలో కేవలం సర్వే నంబర్ 2 మాత్రమే ఉండగా.. రెవెన్యూ అధికారులు 1-177 వరకు బై నంబర్లతో సహా వందల నకిలీ సర్వే నంబర్లను సృష్టించి అడ్డగోలుగా పాస్‌పుస్తకాలు జారీచేశారు. ఈ తతంగం 2014 నుంచి 2016 వరకు పెద్దఎత్తున జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి. ఇందుకుగాను దళారులు చందంపేట మండల పరిధిలోని వారితో పాటు ఇతర ప్రాంతాలవారిని ఇక్కడికి తీసుకొచ్చి వారిపేరిట పాస్‌పుస్తకాలను జారీచేయించారని సమాచారం. మిర్యాలగూడ ఆర్డీవో కార్యాలయంలో నిరుపయోగంగా పడిఉన్న పాత పాస్‌పుస్తకాలను వాడుకున్న దళారులు.. వాటిని చందంపేటకు తరలించి, పాత ఫొటోలు తీసేసి, కొత్త ఫొటోలు అతికించడంతోపాటు.. వైట్‌నర్ సహాయంతో కొత్త వివరాలు నమోదుచేసి.. వాటిపై తాసిల్దార్‌తో సంతకాలు చేయించారని తెలుస్తున్నది. దీంతోపాటు రికార్డుల్లోనూ ఆ వివరాలు ఎక్కించడంతో ఆన్‌లైన్‌లో 1-బీ పహాణీ కూడా కనిపించేది. అడ్డదారిలో పాస్‌పుస్తకాలు పొందిన అనేకమంది సదరు సిమెంటు కంపెనీకి ఆ భూముల్ని రిజిస్టర్ చేశారు. మరికొందరు బ్యాంకుల్లో పంట రుణాలు కూడా తీసుకున్నట్టు తెలిసింది. సిమెంటు కంపెనీకి రిజిస్ట్రేషన్ చేసినవారిలో పాగిళ్లలో వాస్తవంగా భూములుండి అమ్మినవారు కొంతమందే ఉండగా.. అడ్డదారిన, వాస్తవంగా భూమిలేకుండా పాస్‌పుస్తకాలు పొందినవారే అత్యధికులు ఉన్నట్టు తెలుస్తున్నది.

**కోట్లల్లో లావాదేవీలు!**

నకిలీ సర్వే నంబర్లతో పాస్‌పుస్తకాలు జారీచేసినందుకు రెవెన్యూ అధికారులు ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు వసూలుచేసినట్టు సమాచారం. ఇందులో అప్పటి తాసిల్దార్, ఇతర అధికారులకు వాటాలు ఉండగా.. పాగిళ్ల వీఆర్వో, అవుట్‌సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ ఈ తతంగంలో కీలకపాత్ర పోషించినట్టు తెలిసింది. 2014-16 వరకు చందంపేట మండలంలోని అనేక గ్రామాలవారితో దేవరకొండ మండలం తాటికోల్, డిండి మండలం నెమలిపూర్, పెద్ద అడిశర్లపల్లి మండలంలోని పలు గ్రామాలతోపాటు హైదరాబాద్ నుంచి కూడా అనేకమందిని దళారులు ఇక్కడికి తరలించి పాస్‌పుస్తకాలు జారీచేయించినట్టు చెప్తున్నారు. ఆధార్‌కార్డు ఉంటే చాలు.. పాస్‌పుస్తకాలు జారీచేశారని ఈ తతంగాన్ని కండ్లారా చూసిన వ్యక్తి ఒకరు చెప్పారు. ప్రైవేటు సిమెంటు కంపెనీ ఎకరాకు రూ.1.20 లక్షలు చెల్లించగా.. పాస్‌పుస్తకం పొందిన వ్యక్తికి రూ.40-50 వేలు పోను, మిగిలినదంతా దళారులు దండుకున్నట్టు చెప్తున్నారు. ఇలా కోట్లల్లో లావాదేవీలు సాగాయి. పాగిళ్ల పరిధిలో 1,437 ఎకరాల పట్టా భూమి మాత్రమే ఉండగా.. రెవెన్యూ అధికారులు నకిలీ సర్వే నంబర్లతో అక్రమంగా జారీచేసిన పాస్‌పుస్తకాలతో ప్రస్తుతం పట్టాభూముల విస్తీర్ణం మూడు వేల ఎకరాలకు పైగా పెరిగింది. దీంతో మిగిలినవి మొత్తం అటవీ భూములే కావడంతో వాటికీ అధికారులు ఎసరు పెట్టినట్టు తెలుస్తున్నది. పాగిళ్ల గ్రామ పరిధిలోనే కాకుండా నల్లచెలముల, చిత్రియాల, పెద్దమూల తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి భూబాగోతాలు చోటుచేసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు సమగ్ర విచారణ నిర్వహిస్తే 10-15 వేల ఎకరాల విస్తీర్ణంలో అక్రమ పాస్‌పుస్తకాలు జారీ అయినట్టు తేలిందని సమాచారం.

### ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం

**పాగిళ్లలో** సర్వే నంబర్ 2 మాత్రమే ఉన్నది. దీని పరిధిలో 1,437 ఎకరాల పట్టా భూములే ఉన్నాయి. ఇతర సర్వే నంబర్లు ఉన్నా.. విస్తీర్ణం ఇంతకంటే ఎక్కువ ఉన్నా అంతా బోగస్‌కిందనే లెక్క. రెవెన్యూ అధికారులు భారీగా పాస్‌పుస్తకాలు జారీచేశారనే సమాచారం మాకూ ఉన్నది. వివరాలన్నీ సేకరించి.. అటవీశాఖ ఉన్నతాధికారులకు నివేదిక పంపాం. మా ప్రాథమిక విచారణలో దాదాపు 600 ఎకరాలకు పైగా రెవెన్యూ అధికారులు అక్రమంగా పాస్‌పుస్తకాలు జారీచేసినట్టు తెలిసింది. అటవీ భూముల్ని కాపాడటంలో భాగంగా మేం చర్యలు చేపట్టాం.

– రాజేంద్ర, నాగార్జునసాగర్ అటవీశాఖ అధికారి

### సమగ్ర విచారణ చేస్తున్నాం

**పాగిళ్ల** వ్యవహారం మా దృష్టికి వచ్చింది. సమగ్ర విచారణ చేస్తున్నాం. రికార్డుల ప్రక్షాళన సమయంలోనే ఈ గ్రామపరిధిలో ఏకంగా 1,700 ఎకరాల విస్తీర్ణంలో తేడా వచ్చింది. ఈ నేపథ్యంలో అసలు గ్రామంలోని పట్టాభూములు ఎవరెవరికి ఉన్నాయి? బోగస్ ఎన్ని ఉన్నాయి? అనే వివరాలు కూడా సేకరిస్తున్నాం. అక్రమ పాస్‌పుస్తకాలను గుర్తించి వాటిని తొలగిస్తాం. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు సంయుక్తంగా సర్వేచేసి, అటవీ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకొంటున్నాం. సిమెంటు కంపెనీ భూముల వివరాలను కూడా పరిశీలిస్తాం.

– లింగ్యానాయక్, దేవరకొండ ఆర్డీవో

### రికార్డుల్లో పొరపాటు కొనసాగుతున్నది: వీఆర్వో పెద్దయ్య

**గ్రామపరిధిలో** సర్వే నంబర్ 2 మాత్రమే ఉందన్నది వాస్తవమేనని పాగిళ్ల వీఆర్వో పెద్దయ్య 'నమస్తే తెలంగాణ'కు ఫోన్‌లో చెప్పారు. రికార్డుల్లో 1-177, వాటి బైనంబర్లు ఎందుకున్నాయని ప్రశ్నించగా.. గతంనుంచి రికార్డుల్లో ఇదేరీతిన తప్పులు కొనసాగుతున్నాయన్నారు. సిమెంటు కంపెనీవాళ్లు ఇతర సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకొంటే మీ హయాంలో ఎందుకు నమోదు చేశారని అడగ్గా.. కంపెనీవాళ్లు తెలియక చేయించుకొన్నారని, అందుకే అప్పటి తాసిల్దార్ చెప్తే కంపెనీ పేరిట భూముల్ని రికార్డుల్లో పొందుపరిచానని సమాధానమిచ్చారు.

### మా భూములు చూపించాలని అధికారులను కోరాం

సిమెంటు కంపెనీ ప్రతినిధులు

**మేము** కొనుగోలుచేసిన భూములను చూపించాల్సిందిగా రెవెన్యూ, అటవీ శాఖ అధికారులను కోరాం. పాస్‌పుస్తకాలు, ఆన్‌లైన్‌లో 1-బీ చూపించినందున భూములను కొనుగోలుచేశాం.

## మా మాట!


### అన్నివర్గాలకు న్యాయం..



**ముఖ్యమంత్రి** కేసీఆర్ రైతులకు తగిన న్యాయంచేస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్, మున్సిపల్‌శాఖల్లోనే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సామాన్య ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించేలా అధికారులను సంస్కరించాలి. ఇప్పటికే వందల మంది పేద రైతుల బాధలు తీర్చారు. రెవెన్యూశాఖ ప్రక్షాళన చాలా మంచి నిర్ణయం.

– నాగరాజు, జీ తిరుమలగిరి, చివ్వెంల మండలం, సూర్యాపేట జిల్లా

### ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం



**రైతుల** సంక్షేమానికి టీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషిచేస్తున్నది. రైతుల భూసమస్యలను పరిష్కరించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రెవెన్యూశాఖలో సమూల మార్పులకు పూనుకోవడం సంతోషకరం. 'నమస్తే తెలంగాణ' చేపట్టిన 'ధర్మగంట' రైతులకు అండగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నది.


– కారింగుల సైదులు, లింగంపల్లి గ్రామం, నూతనకల్ మండలం, సూర్యాపేట జిల్లా

## ఆ భూమిని ఆక్రమించలేదు

వికారాబాద్ జిల్లా బిల్కల్ గ్రామంలోని భూమిని కొన్నాను

ధర్మగంట కథనంపై న్యాయవాది ద్వారా గుడిపాటి అవీణ వివరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వికారాబాద్ జిల్లా బిల్కల్ గ్రామంలోని సర్వే నంబర్ 88లోని పలు సబ్‌డివిజన్లలో తాను భూమిని కొనుగోలు చేశానని గుడిపాటి అవీణ తన న్యాయవాది ఎస్ మారుతిరావు ద్వారా వివరణ ఇచ్చారు. ఈ ఏడాది మే నెల 19వ తేదీన 'నమస్తే తెలంగాణ' ధర్మగంటలో 'గుంజుకున్న గుడివాడ రౌడీ' శీర్షికన ప్రచురితమైన కథనంపై స్పందించారు. దళిత కుటుంబానికి చెందిన ఆశయ్య.. తన 2.20 ఎకరాల భూమి కబ్జాచేశారని, కోర్టు ఇంజక్షన్ ఉత్తర్వులు ఇచ్చిన తరువాత కూడా.. ఎంతమంది అధికారులను ఆశ్రయించినప్పటికీ తనకు న్యాయం జరుగలేదని 'ధర్మగంట'ను ఆశ్రయించారు. దీంతో వారి వద్ద ఉన్న కాగితాలను పరిశీలించి జరిగిన అన్యాయంపై కథనాన్ని ప్రచురించాం. ఈ అంశంపై గుడిపాటి అవీణ సుదీర్ఘ వివరణ ఇస్తూ దళితుల భూమిని తాను ఆక్రమించలేదన్నారు. సర్వే నంబర్ 88లోని వివిధ సబ్‌డివిజన్లలో తాను భూమిని కొనుగోలు చేశానన్నారు. తనకున్న భూమిని మాత్రమే తాను అనుభవిస్తున్నానని ఈ వివరణలో పేర్కొన్నారు. తమకు అన్యాయం జరిగిందని పేర్కొన్న ఆశయ్యకు తమకు మధ్య కోర్టుబయట ఒప్పందం జరిగిందన్నారు. ఈ మేరకు దళిత కుటుంబం కేసును ఉపసంహరించుకున్నదని వివరించారు. ఆ తరువాత భూమి సర్వే జరిగిందని, ఆ సర్వే మేరకే తాము కంచె వేశామన్నారు. తర్వాత దళితులే తమ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నంచేశారని గుడిపాటి అవీణ పేర్కొన్నారు. అంతేకాకుండా తాను 17 గుంటల భూమిని ఇతరులకు బదిలీ చేశానని, ఆ వ్యక్తిని కూడా పార్టీచేస్తూ ఈ దళిత కుటుంబం మరోమారు సివిల్ కోర్టును ఆశ్రయించిందని తెలిపారు.



కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు

# భూపాలపల్లిలో భూ పరిష్కార వేదిక

- రెండో విడుత 19 నుంచి ప్రారంభం
- తొలి విడుతలో 2,700 సమస్యలు పరిష్కారం
- జిల్లా కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు వెల్లడి

**జయశంకర్ జిల్లా ప్రతినిధి-నమస్తే తెలంగాణ:** జయశంకర్ భూపాలపల్లిని భూ సంబంధ సమస్యలు లేనిజిల్లాగా మార్చడమే లక్ష్యంగా మరోసారి 'భూపరిష్కార వేదిక' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు గురువారం వెల్లడించారు. ఈ నెల 19 నుంచి 24 వరకు రెండో విడుత కార్యక్రమాన్ని జరుపుతామని, ఆరు రోజులపాటు జిల్లాలోని పదకొండు మండలాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఒక్కో మండలంలో ఒక గ్రామం చొప్పున మొత్తం 66 గ్రామాల్లో ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన షెడ్యూలును నిర్ణయించామని తెలిపారు. భూసంబంధ సమస్యలు అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి ఆ ప్రకారంగా షెడ్యూల్‌ను రూపొందించామని తెలిపారు. ఆయా మండలాల తాసిల్దార్, డిప్యూటీ తాసిల్దార్, ఆర్‌ఐలు, వీఆర్వోలతోపాటు ధరణి ఆపరేటర్లు సాంకేతిక పరికరాలతో ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. జిల్లాలో భూసంబంధ సమస్యలను తరిమేందుకు కలెక్టర్ వాసం వెంకటేశ్వర్లు గత జూలై 22 నుంచి 27వ తేదీ వరకు తొలి విడుత భూపరిష్కార వేదికను నిర్వహిచారు. జిల్లాలోని పదకొండు మండలాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి అధికారులు రైతుల నుంచి భూసమస్యలను స్వీకరించారు. వీటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించారు. సుమారు 2,700 పరిష్కరించినట్టు కలెక్టర్ వెల్లడించారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూసమస్యలు సైతం ఈ కార్యక్రమంతో పరిష్కారం కావడం పట్ల రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోని అధికారులు, సిబ్బంది స్వయంగా తమ గ్రామాలకే వచ్చి భూసమస్యలను పరిష్కరించడంతో ఆనందం వెలిబుచ్చారు. ప్రధానంగా 'భూపరిష్కార వేదిక-రైతుల చెంతకే రెవెన్యూ సిబ్బంది' కార్యక్రమం ద్వారా రెవెన్యూ అధికారులు, సిబ్బందిలో జవాబుదారితనం ఏర్పడింది. ఈ కార్యక్రమంలో తమ దృష్టికి రైతులు తెచ్చిన భూసమస్యలను తప్పనిసరిగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది పరిష్కరించాల్సి వస్తున్నది.

**CVR COLLEGE OF ENGINEERING**
Mangalpalli (V), Ibrahimpatan (M), RR Dist - 501 510

**AN AUTONOMOUS INSTITUTION**

The College invites applications for **Category- B seats in M.Tech.** Programme for the academic year 2019-20 in the following courses.

1. Artificial Intelligence - 05
2. Data Sciences - 05
3. Electrical Power Engineering - 05
4. Embedded Systems - 05
5. Structural Engineering - 09
6. VLSI System Design - 05

Please contact city office on or before 20th August 2019
Phone: 42204001/2 or 9989823424.

TUITION FEE RS. 65,500/- PER YEAR - Hon. Secretary



ప్రధాని మోదీ ఎర్రకోట మీది నుంచి కశ్మీర్ సమస్యను బుల్లెట్లతో పరిష్కరించలేమని చెప్పారు. ఇప్పుడు ఆ మాటలు మర్చిపోయారు. ఇవ్వాళ కశ్మీర్ ఒక కాన్సంట్రేషన్ క్యాంపుగా మారిపోయింది. మొబైల్, ఇంటర్నెట్ సేవలు నిలిపేశారు.

**అధిర్ రంజన్ చౌదరి, లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత**

కశ్మీర్‌ను రెండు రాష్ట్రాలుగా విభజించటం ఆహ్వానించదగినది. 370 ఆర్టికల్‌లో కొన్ని అవసరమైన మంచి అంశాలు కూడా ఉన్నాయి. విభజనను వ్యతిరేకించినంత మాత్రాన కశ్మీర్‌లోని ప్రధాన పార్టీలు పీడీపీ, ఎన్‌సీలను టెర్రరిస్టు పార్టీలుగా జమ కట్టవద్దు.

**డాక్టర్ కరణ్‌సింగ్, సీనియర్ కాంగ్రెస్ నేత**



**చరిత్రలో నేడు**



**1173**

ఇటలీలో 'పీసా' టవర్ నిర్మాణం ప్రారంభం. రెండు వందల ఏండ్లకు పూర్తి.

**1898**

'డీజిల్'తో నడిచే ఇంజిన్‌ను కనుగొన్న జర్మనీ ఇంజినీర్ రూడాల్ఫ్ డీజిల్.





**1910**

ఎలక్ట్రిక్ వాషింగ్ మెషిన్‌ను కనుగొన్న అల్వా ఫిషర్.

చైనాతో వాణిజ్యయుద్ధం మొదలుపెట్టినప్పుడు, అది త్వరగా సమసిపోతుందని, ఎటువంటి ఇబ్బందులుండవని ట్రంప్ అన్నారు. దీని ద్వారా అమెరికా ఆర్థికవ్యవస్థకు స్పష్టమైన లాభం జరుగుతుందని నమ్మబలికారు. 'ట్రేడ్ వార్స్ ఆర్ గుడ్, ఈజీ టు విన్' అని ట్విటర్‌లో చెప్పుకొచ్చారు. చైనాపై ఆంక్షలు మొదలై రెండేండ్లు కావస్తున్నది. కానీ ట్రంప్‌కు స్పష్టమైన వ్యూహం లేదని, సాధించిన లక్ష్యాలు ఏవీ కనుచూపు మేర లేవని తెలిసిపోయింది. ఇప్పుడు కొత్తగా చైనాపై మరిన్ని చర్యలు తీసుకుంటామని ట్రంప్ చెప్పడంతో మార్కెట్ వర్గాల్లో ఆందోళన కలుగుతున్నది..

**ది న్యూయార్క్ టైమ్స్**

బ్రిటన్ దశాబ్దాల పాటు అమెరికాకు, యూరప్ ఖండానికి మధ్య వారధిగా ఉండటమే తమ విదేశాంగ విధానంగా భావించింది. బ్రిటన్ మధ్యవర్తిత్వం పట్ల ఈయూలో, అమెరికాలో గౌరవం ఉండేది. కానీ బ్రెగ్జిట్ మూలంగా ఈ ఔన్నత్యాన్ని కోల్పోయింది. ఈ వాస్తవాన్ని ప్రధాని జాన్సన్ గుర్తించారో లేదో తెలువదు కానీ, రెండు వైపులా స్తంభాలలో ఒకటి కూలిపోతున్నది. ప్రపంచవ్యాప్తంగా బ్రిటన్ ప్రాబల్యానికి దౌత్యమే కీలకం. కానీ జాన్సన్ మాత్రం దౌత్య నీతిని ప్రదర్శించలేక పోతున్నారు.

**ది గార్డియన్**



# జాతి విద్వేషాలు

అందరి నాయకుడిగా వ్యవహరించవలసిన దేశాధినేత ఒక వర్గానికి ప్రతినిధిగా గుర్తింపు పొందడం అతిపెద్ద విషాదం. అమెరికాలో మళ్ళా కాల్పులు జరిగి 31 మంది అమాయకులు బలయ్యారు. అనేకమంది గాయపడ్డారు. ఈ కాల్పులకు జాతి విద్వేషమే కారణమని తెలుస్తున్నది. ఈ విద్వేష దాడి బాధితులను పరామర్శించడానికి గురువారం అధ్యక్షుడు ట్రంప్ వెళ్ళినప్పుడు నిరసన ప్రదర్శనలు చోటుచేసుకున్నాయి. దేశాధ్యక్షుడిని 'జాత్యహంకారి, ఇంటికి పో, నిన్ను ఆహ్వానించడం లేదు, ట్రంప్ విద్వేషం జాతి వివక్ష మాకొద్దు' అంటూ ప్రదర్శనలు జరిపారు. స్థానిక రాజకీయ నాయకులతో కూడా విభేదాలు పొడసూపాయి. కొందరు ట్రంప్‌ను మర్యాదపూర్వకంగా కూడా కలువకుండా మొహం చాటేశారు. విద్వేష దాడులకు ప్రత్యక్షంగా కారకులు కానప్పటికీ, ఆ భావజాలాన్ని నాయకులు ప్రచారం చేసినప్పుడు ఫలితాలు ఇదేవిధంగా ఉంటాయి. ఇటీవల ఎల్‌పాసోలో జరిగిన కాల్పుల్లో 21 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 24 మంది గాయపడ్డారు. కొన్ని గంటలలోనే డేటన్‌లో జరిగిన కాల్పులకు మరో తొమ్మిది మంది బలయ్యారు. శ్వేత జాత్యహంకార భావజాలంతో, కాందిశీకుల పట్ల ఆగ్రహంతో ఈ దాడులు జరిగినట్టు తెలుస్తున్నది. మెక్సికో సరిహద్దుకు సమీపంలో ఉండే ఎల్‌పాసోలో లాటిన్ అమెరికా నుంచి వచ్చే వలస ప్రజలు ఎక్కువగా ఉంటారు. మెక్సికో సరిహద్దు మీదుగా వలసరావడాన్ని ట్రంప్ 'దాడి'గా పేర్కొంటూ ఉంటారు. కాల్పులకు పాల్పడిన వ్యక్తి కూడా ఇదేపదాన్ని వాడటం గమనార్హం. మెక్సికో సరిహద్దులో గోడ కడుతామని ట్రంప్ పట్టుదలగా ఉండటం కూడా పరోక్షంగా వలస వచ్చిన ప్రజలు ప్రమాదకరమనే సందేశాన్ని ఇస్తున్నది.

**ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వలస వెళ్ళడం ఎక్కువైంది. పారిశ్రామికరంగం కూడా నిపుణులే కాకుండా సాధారణ శ్రామికులు కావాలని కోరుకుంటున్నది. వలస ప్రజలు సమాజాన్ని సంపద్వంతం చేస్తారనేది అనేక సందర్భాలలో వెల్లడైంది. అయినా వివిధ దేశాలలోని మెజారిటీ మతస్తుల్లో ఆందోళన పెరిగిపోయి దాడులు సాగుతున్నాయి. అమెరికాలోనే కాదు, యూరప్ దేశాలలో కూడా ఈ పోకడ కనిపిస్తున్నది. ప్రజల సమస్యలను పరిష్కరింపలేని పాలకులు అల్ప సంఖ్యావర్గాలు, కాందిశీకుల వల్లనే తమ అవకాశాలు దెబ్బతింటున్నాయనే భావనను ప్రచారంలో పెడుతారు.**

ట్రంప్ అధికారానికి వచ్చిన తరువాత విద్వేష దాడులు ఏటేటా పెరిగిపోతున్నాయి. అమెరికా వ్యాప్తంగా 2016లో 6,121 దాడులు జరిగితే ఆ మరుసటి ఏడాది 7,175 దాడులు జరిగాయి. ట్రంప్ ఇటీవల ఒక ప్రసంగంలో ఈ విద్వేష దాడులను మాట మాత్రంగా ఖండించినప్పటికీ, ఆయన పలు సందర్భాలలో వ్యక్తం చేస్తున్న భావజాలం శ్వేత జాతీయులను రెచ్చగొట్టే విధంగా ఉంటున్నది. అమెరికాలో కాల్పుల ఘటనలన్నిటికీ విద్వేషమే కారణం కాకపోవచ్చు. కానీ విద్వేషదాడులు పెరిగిపోవడం సమాజంలోని విభేదాలకు సూచిక. సామాజిక సామరస్యం దెబ్బతినడం మరింత ప్రమాదకరం. అమెరికాలో కాల్పులకు సామాజిక-ఆర్థిక మూలాలున్నాయి. వాటిని అరికట్టడానికి పరిష్కారాలను అన్వేషించవలసి ఉన్నది. కానీ సమస్యను పరిష్కరించకుండా మతిస్థిమితం లేనివారు జరిపే దాడులుగా ముద్రవేయడం పరిపాటిగా మారింది. ట్రంప్ దాడులు జరిపిన వారిని మతిస్థిమితం లేనివారిగా పేర్కొనడం పట్ల మానసిక వైద్యులు అభ్యంతరం చెబుతున్నారు. మతిస్థిమితం కోల్పోయిన వారు దాడులు జరుపరని, వారిని బదనాం చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు. కాల్పుల ఘటనలకు ట్రంప్ చూపిస్తున్న పరిష్కారాలు కూడా విడ్డూరంగా ఉంటున్నాయి. బడి పిల్లలపై జరిగే కాల్పులను అరికట్టడానికి ఉపాధ్యాయులు తుపాకులు వాడటం నేర్చుకోవాలని సూచించారు. ట్రంప్ మాటల నేపథ్యంలో తల్లిదండ్రులకు ప్రభుత్వంపై నమ్మకం మరింత సన్నగిల్లింది. తమ పిల్లల భద్రత విషయమై వారిలో ఆందోళన పెరిగిపోయింది. ఇటీవల తమ పిల్లలకు బుల్లెట్ ప్రూఫ్ స్కూల్ బ్యాగ్‌లు కొనివ్వడం పెరిగిపోయింది.

ప్రపంచవ్యాప్తంగా ప్రజలు వలస వెళ్ళడం ఎక్కువైంది. పారిశ్రామికరంగం కూడా నిపుణులే కాకుండా సాధారణ శ్రామికులు కావాలని కోరుకుంటున్నది. వలస ప్రజలు సమాజాన్ని సంపద్వంతం చేస్తారనేది అనేక సందర్భాలలో వెల్లడైంది. అయినా వివిధ దేశాలలోని మెజారిటీ మతస్తుల్లో ఆందోళన పెరిగిపోయి దాడులు సాగుతున్నాయి. అమెరికాలోనే కాదు, యూరప్ దేశాలలో కూడా ఈ పోకడ కనిపిస్తున్నది. ప్రజల సమస్యలను పరిష్కరింపలేని పాలకులు అల్ప సంఖ్యావర్గాలు, కాందిశీకుల వల్లనే తమ అవకాశాలు దెబ్బతింటున్నాయనే భావనను ప్రచారంలో పెడుతారు. సామాజిక ఆర్థిక సమస్యలకు పరిష్కారాలు చూపడం, ప్రజలను మెప్పించేలా పరిపాలించడం కష్టమైన పని. కానీ విద్వేషాలు రెచ్చగొట్టి అధికారంలోకి రావడం తేలిక. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి విద్వేషాలను రెచ్చగొట్టడం ప్రపంచవ్యాప్తంగా ఉన్నదే. ఒకప్పుడు ఒక వర్గం ప్రజలపైకి మరో వర్గాన్ని రెచ్చగొట్టి జాత్యహంకార విధానాలను అవలంబించడం ఎక్కువగా జరిగేది. ఇతర దేశాల మీద యుద్ధాలకు దిగినప్పుడు ప్రజల మద్దతు సులభంగా లభిస్తుందని పాలకులు భావిస్తారు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థలు ఏర్పడిన తరువాత ఇటువంటి ఉన్మాద పోకడలు తగ్గాయి. సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజల మెప్పు పొందడం సాగేది. కానీ ఇటీవల ఆర్థిక విధానాలలో మార్పులు వచ్చి ప్రజానుకూల విధానాలు తగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలోనే మళ్ళా రాజకీయనాయకులు విద్వేష దాడులను రెచ్చగొట్టడం ఎక్కువైంది. విద్వేషదాడుల ద్వారా పరిష్కారాలు లభించవని, విధాన మార్పులు రావాలని ప్రజలు కోరుకోవాలె.

# అనితర సాధ్యం ఆ మార్గం



**మన్మథ రెడ్డి**

**వృత్తిరీత్యా, ప్రవృత్తిరీత్యా జైపాల్‌రెడ్డి ఉదార లౌకిక ప్రజాస్వామ్యవాది. మత విషయాల్లో నిరీశ్వరవాది. తాత్త్విక దృక్పథంలో అజ్ఞేయవాది. ఆర్థిక విషయాల్లో మొదట సామ్యవాదిగా ఉన్నా మారిన ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఆయన సంక్షేమ ఆర్థిక వేత్తలైన అమర్త్యసేన్ వైపు మొగ్గుచూపాడు. రాజకీయాల్లో ఎంత తీరికలేకుండా ఉన్నా ఆయన అధ్యయనాన్ని ఎన్నడూ మానుకోలేదు. సమకాలీన రాజకీయవేత్తల్లో అంత అధ్యయనశీలత కలిగినవారు చాలా తక్కువ.**

నేనొక దుర్గం నాదొక స్వర్గం అనర్గళం అనితర సాధ్యం నా మార్గం అని శ్రీశ్రీ అంటాడు. ప్రస్తుత పరిస్థితుల్లో జైపాల్ రెడ్డి రాజకీయ ప్రస్థానం కూడా అలాంటిదే. ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో తాను నమ్మిన సిద్ధాంతాలకు, విలువలకు రాజీపడకుండా పోరాటం చేసిన ధీశాలి. 1996లో రాజకీయ పరిణామాలు ప్రతికూలంగా మారినప్పుడు మహబూబ్‌నగర్ నుంచి నామినేషన్ వేసి చివరి క్షణంలో పోటీ నుంచి విరమించుకున్నాడు. జనతాదళ్ పార్టీ హైకమాండ్ లక్ష్మీపార్వతి పార్టీ వైపు మొగ్గుచూపింది. ఆ పార్టీకి ప్రజల్లో బలం లేదు. అప్పుడు చంద్రబాబు ఆయనతో మీరు ఇండిపెండెంట్‌గా పోటీచేస్తే నేను మద్దతిస్తానన్న ప్రతిపాదనతో ముందుకువచ్చినప్పుడు, ఒక పార్టీలో చేరడానికి కానీ, నిష్క్రమించడానికి కానీ ఒక సిద్ధాంత నేపథ్యం కావాలని చెప్పి ఆయన ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు. అప్పుడు ఆయన పోటీ చేయలేని నిస్సహాయతను చూసి ప్రముఖ పాత్రికేయుడు ఎ.బి.కె.ప్రసాద్ ఒక పత్రికలో ఒక వ్యాసం రాశారు. ఆయనను బ్రిటిష్ పార్లమెంట్‌ను తన వాగ్ధాటితోనే కాక పరిపాలనాదక్షతతో మలుపుతిప్పిన అలీవర్ క్రామ్‌వెల్‌తోను నాడు టోరీ పార్టీలో సాంఘిక సమానత్వాన్ని ప్రేమించి ప్రచారం చేసిన రాజకీయవేత్త రాబ్ బట్లర్‌తో పోల్చాడు. బట్లర్ భావకుడిగా, రాజకీయ మేధావిగా నాటి రాజకీయాల్లో పేరుగాంచిన వ్యక్తి. ఆయన భావాలు తన పార్టీలో నచ్చకపోయినా బట్లర్ ధోరణిలో మార్పు ఉండేది కాదు. ప్రగతిశీల విధానాలకు పేరుగాంచిన బట్లర్ భావాలకు నాటి లేబర్ పార్టీ నాయకుడు గైట్‌స్కెల్ భావాలకు పెద్ద తేడా ఉండేది కాదు. అందువల్ల రాజకీయవేత్తగా రెండు పార్టీల ప్రయోజనాలు సంఘర్షిస్తున్నప్పుడు వాటిని సాగదీయనీయకుండా మంచి సమన్వయకర్తగా వ్యవహరించేవాడు. అట్టి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నిఘంటువుల్లోకి ఒక కొత్త పదం వచ్చి చేరింది. దాని పేరు 'బట్‌స్కెలిజం'. అంతపెద్ద మేధావి కూడా చివరికి అత్యున్నత స్థానానికి చేరుకోలేకపోయాడు. జైపాల్‌రెడ్డి కూడా తనదైన శైలితో, వాగ్ధాటితో వక్రోక్తులు, వ్యంగ్యోక్తులు దట్టిస్తూ అనర్గళమైన తన ఆంగ్ల పాండిత్యంతో ప్రసంగాలు చేస్తూ రాజకీయాలను రెండు దశాబ్దాల పాటు ప్రభావితం చేశాడు. నాటి ఢిల్లీ రాజకీయాల్లో ఆయన పాత్రను, వచోవైభవ శైలిని దృష్టిలో ఉంచుకొని ఒక పదం రాజకీయ సంభాషణల్లో ప్రాచుర్యం పొందింది. దానిపేరు జైపాలిజ్. ఆయన మిత్రులు ఆ పదాన్ని ఆయనను టీజ్ చేయడానికి వాడేవారని ప్రచారంలో ఉన్నది. ఆయన అసెంబ్లీలో ఉన్నా, పార్లమెంట్‌లో ఉన్నా తెలుగులో, ఆంగ్లంలో కొత్త కొత్త పదబంధాలను సృష్టించి ప్రసంగాలను రసమయం చేసేవాడు. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గంభీరంగా ఉన్న అసెంబ్లీ వాతావరణాన్ని 'అంజయ్య నల్లన, జుట్టు తెల్లన, కడుపు చల్లన' అన్న పద కవితతో వాతావరణాన్ని చల్లబరిచాడని చెపుతారు. పార్లమెంట్‌లో కూడా 'ఘాట్' ఒప్పందాన్ని గాటోక్రసిగా (డెమోక్రసిలాగా), గ్లోబలైజేషన్‌ను కుంభకోణాలకు దారితీసే 'ఘోటాలైజేషన్' లాంటి కొత్త పదాలను సృష్టించి సన్నివేశాన్ని రసమయం చేసిన సందర్భాలెన్నో ఉన్నాయి. గుజ్రాల్ మంత్రివర్గ విస్తరణ చేసినప్పుడు ఆయన ఒక్కరినే మంత్రివర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అప్పుడు ఆయనతో 'నీవెంతో గౌరవనీయమైన ప్రముఖ వ్యక్తివి, నిన్ను మంత్రివర్గంలో తీసుకోవడం వల్ల ప్రభుత్వ ప్రతిష్ఠ పెరుగుతుందని తెలుసు. అందుకే నీతోపాటు ఎవ్వరినీ మంత్రివర్గంలోకి తీసుకోవడం లేదు' అని ప్రధానమంత్రి జైపాల్ రెడ్డితో అన్నట్లు అప్పటి ఇంగ్లీష్ పత్రికల్లో వచ్చింది. ఒక ప్రధాని తన సహచరుని గురించి అంత గొప్పగా మాట్లాడటం ఆ వ్యక్తి రాజకీయ జీవితంలో అంతకంటే గొప్ప పురస్కారం ఇంకొకటి ఉండదు. మంత్రివర్గ ప్రమాణ స్వీకారోత్సవానికంటే ముందు విలేకర్లతో మాట్లాడుతూ "My Political Virginity is on the verge of being violated" అని ఒక చలోక్తి విసురుతాడు. తన మనసులో చెలరేగిన భావాలను ఆ రకంగా వ్యక్తీకరించాడు. మంత్రివర్గంలో చేరిన వెంటనే ప్రసారభారతి బిల్లును ప్రవేశపెట్టి ప్రభుత్వ చెర నుంచి ప్రసార, ముద్రణ మాధ్యమాన్ని విడిపించడం జరిగింది. ప్రపంచంలో ఎక్కడా ప్రసార శాఖకు మంత్రి లేడు. మన దేశంలో కూడా ఇప్పటినుంచి అవసరం ఉండదని చెప్పాడు. వృత్తిరీత్యా, ప్రవృత్తిరీత్యా జైపాల్‌రెడ్డి ఉదార లౌకిక ప్రజాస్వామ్యవాది. మత విషయాల్లో నిరీశ్వరవాది. తాత్త్విక దృక్పథంలో అజ్ఞేయవాది. ఆర్థిక విషయాల్లో మొదట సామ్యవాదిగా ఉన్నా మారిన ప్రపంచ పరిస్థితుల దృష్ట్యా ఆయన సంక్షేమ ఆర్థిక వేత్తలైన అమర్త్య సేన్ వైపు మొగ్గుచూపాడు. రాజకీయాల్లో ఎంత తీరికలేకుండా ఉన్నా ఆయన అధ్యయనాన్ని ఎన్నడూ మానుకోలేదు. సమకాలీన రాజకీయవేత్తల్లో అంత అధ్యయనశీలత కలిగినవారు చాలా తక్కువ. హిస్టరీ నుంచి మిస్టరీ వరకు, సోక్రటీస్ నుంచి రామానుజాచార్యుల వరకు ఏ విషయమైనా సాధికారికంగా మాట్లాడగలడు. ఆయన రాసిన పుస్తకం 'టెన్ అయిడియాలోజీస్' సుదూర మానవ గమనంలో ప్రపంచాన్ని ప్రభావితం చేసి న పది భావజాలాలను, వాటి పరిమితులను సోదాహరణంగా వివరించాడు.



**జైపాల్‌రెడ్డి పదవుల కోసం తన సిద్ధాంతాలను, నైతిక విలువలను ఎప్పుడూ పణంగా పెట్టలేదు. 1971లో పీవీ తన మంత్రివర్గంలో సహాయ మంత్రిగా చేరమన్నప్పుడు తాను బ్రహ్మానందరెడ్డి గ్రూపునకు చెందినవాడినని ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు. ఆ తర్వాత ఎన్టీఆర్, చెన్నారెడ్డి మంత్రివర్గాల్లో చేరటానికి అవకాశం ఉన్నా నైతికంగా అది సరైనది కాదని మానుకున్నాడు.**

జైపాల్‌రెడ్డి పదవుల కోసం తన సిద్ధాంతాలను, నైతిక విలువలను ఎప్పుడూ పణంగా పెట్టలేదు. 1971లో పీవీ తన మంత్రివర్గంలో సహాయ మంత్రిగా చేరమన్నప్పుడు తాను బ్రహ్మానందరెడ్డి గ్రూపునకు చెందినవాడినని ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు. ఆ తర్వాత ఎన్టీఆర్, చెన్నారెడ్డి మంత్రివర్గాల్లో చేరటానికి అవకాశం ఉన్నా నైతికంగా అది సరైనది కాదని మానుకున్నాడు. వాజపేయి స్పీకర్ పదవిని ఇవ్వజూపినప్పుడు కూడా ఆ ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించి తన నైతిక సైద్ధాంతిక నిబద్ధతను చాటుకున్నాడు. జార్జ్ ఫెర్నాండెజ్, మురళీ మనోహర్ జోషి లాంటి నాయకులు స్పీకర్ పదవి పార్టీలకు అతీతమైనదని నచ్చజెప్పడానికి ప్రయత్నించినప్పటికీ తన వైఖరి మార్చుకోలేదు. రాజకీయాల్లో ఎప్పుడూ సానుకూల పరిస్థితులు ఉండవు. రెండు పార్టీల మధ్య, రెండు సిద్ధాంతాల మధ్యనే కాకుండా అప్పుడప్పుడు రెండురకాల పరిస్థితుల మధ్య పోటీ వస్తుంది. అప్పుడు మనం ఏ వైపు ఉన్నామనేది చాలా ముఖ్యమని ఆయన అంటాడు. ఉదాహరణకు ప్రధాని ఎంపిక విషయం వచ్చినప్పుడు సోనియా గాంధీతో పరిచయం లేనప్పటికీ లౌకికవాదాన్ని దృష్టిలో ఉంచుకొని ఆమె అభిప్రాయానికి అనుకూలంగా రాష్ట్రపతికి లేఖ రాయడం గమనార్హం. ఆ తర్వాత కూడా తన ఓటును వాజపేయికి వ్యతిరేకంగా వేసి ఆ ప్రభుత్వం పడిపోవడానికి కారణమయ్యారు.

అన్నిటికంటే ముఖ్యంగా తన రాజకీయ జీవితంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరటం మేధావులకే కాకుండా మిత్రులకు కూడా నచ్చలేదు. బోఫోర్స్ విషయంలో కాంగ్రెస్‌తో తీవ్రంగా పోరాడి రెండు దశాబ్దాల పాటు కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాలకు కేంద్ర బిందువుగా ఉండి చివరికి కాంగ్రెస్ లో చేరటాన్ని ఎవరూ హర్షించలేదు. కానీ నాటి దేశ యవనికపై థర్డ్ ఫ్రంట్ అదృశ్యమైపోయింది. రాజకీయాలు ద్విపాక్షిక ధృవీకరణ దిశగా పరిణామం చెందినవి. చంద్రబాబు బీజేపీ ఫ్రంట్‌లోకి వెళ్లాడు. తనకు ఎన్టీఆర్ లాగా ప్రజాకర్షణ శక్తి లేదు. తనకు మిగిలిన మార్గం కాంగ్రెస్ పార్టీలో చేరటం లేదా రాజకీయాల నుంచి విరమించుకోవటం. రాజకీయాల నుంచి విరమించుకోవటమంటే యుద్ధరంగం నుంచి పలాయనం చేసినట్లవుతుంది. అప్పుడు జైపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరటానికి ఇచ్చిన వివరణను ప్రొఫెసర్ నాగేశ్వర్ ఒక సామాజిక మాధ్యమం ద్వారా గుర్తుచేశారు. 'దేశ సమైక్యత, సమగ్రతలకు ప్రమాదం ఏర్పడినప్పుడు దేశంలో విచ్ఛిన్నకరశక్తులు పేట్రేగిపోతున్నప్పుడు ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యానికి ప్రమాదం ఏర్పడినప్పుడు చరిత్ర నా ముందు రెండు ప్రశ్నలు వేసింది. నీ అహంతో రాజకీయంగా వ్యవహరిస్తావా? లేదా చరిత్ర ఇచ్చే పిలుపునకు స్పందిస్తావా అని నన్నడిగితే చరిత్ర ఇచ్చే పిలుపునకు స్పందించి కాంగ్రెస్‌లో చేరడానికి నిర్ణయం తీసుకొన్నాను' అని చెప్పాడట. చరిత్ర మీద, రాజకీయ తాత్త్వికత మీద ఎంతో లోతైన అవగాహన లేకపోతే అటువంటి వివరణ ఇవ్వడం సాధ్యం కాదు. చివరికి రాజకీయ చరమాంకంలో కూడా తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి తన వంతు పాత్ర నిర్వహించారు. కానీ 2014లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. ఎలక్షన్‌లో ఓడిపోయినందుకు కూడా ఆయన బాధపడలేదు. గెలుపోటములు సహజం అనుకున్నాడు. కానీ రాజకీయాల్లో నైతిక విలువల పతనం పట్ల, సిద్ధాంతరహిత రాజకీయాల పట్ల ఆందోళన వ్యక్తం చేసేవాడు. దురదృష్టవశాత్తు ఆయన ఆకస్మిక మరణం చెందినప్పుడు అన్ని రాజకీయపార్టీల నాయకులు, ప్రజా సంఘాల నేతలు విషణ్ణ వదనాలతో సంతాపం తెలియజేయడాన్ని ఆయనలోని విశిష్ట వ్యక్తిత్వాన్ని తెలియజేస్తున్నది. ముఖ్యంగా కర్ణాటక మాజీ స్పీకర్ రమేష్‌కుమార్, మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య నైతిక విలువలకు, పరిపాలనాదక్షతకు పేరుగాంచిన కాకి మాధవరావు లాంటివారు విలపించిన సన్నివేశం అందరినీ కలిచివేసింది. రాజ్యసభలో వెంకయ్యనాయుడు సంతాపం ప్రకటిస్తూ శోకతప్త హృదయంతో కన్నీళ్లను ఆపుకోలేని దృశ్యాన్ని చూస్తే ఎవరి గుండె అయినా బరువెక్కుతుంది. సిద్ధాంతాలు వేరైనా, పార్టీలు వేరైనా మనుషుల మధ్య ఆత్మీయతను ఎలా పెంచుకోవాలో యావత్ దేశం వాళ్లను చూసి నేర్చుకోవాలి. ఆయన విలువల్లో కొన్నయినా మనం పాటించడమే ఆయనకు నిజమైన నివాళి.

# అశాస్త్రీయ భావాలకు అడ్డుకట్ట

**జాతీయం**

**దివ్యశంకర్ దాస్**

**దేబజ్యోతి సేన్‌గుప్తా**

ఈ మధ్యకాలంలో ఏది శాస్త్రీయమో, ఏది విశ్వాసమో తెలియని విధంగా అనేక విషయాలు ప్రచారంలోకి వస్తున్నవి. పాలకులు అవలంబిస్తున్న విధానాలు, ఆయా సందర్భాల్లో చెబుతున్న విషయాలకు తోడుగా సమాజంలో ఉన్నతులుగా చెప్పుకుంటున్నవారు కూడా మన కీర్తిప్రతిష్ఠల పేర చెప్పుకొస్తున్న విషయాలు ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. శాస్త్రీయతకు, విశ్వాసాలకు మధ్య ఉన్న సన్నని గీతను చెరిపేసే పని ఈ మధ్య ఎక్కువగా జరుగుతున్నది. అదే మన భారతీయ ఘనకీర్తిగా నమ్మబలుకుతున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రజలకు ఏది శాస్త్రీయమో, ఏదికాదో గుర్తించటం క్లిష్టమైపోయింది.

సరిగ్గా ఇలాంటి పరిస్థితుల్లో శాస్త్రవేత్తలు, విద్యార్థులు శాస్త్రీయ భావజాలం, విధానాల కోసం దేశవ్యాప్తంగా ప్రచారోద్యమాన్ని చేపట్టడం ముదావహం. ఈ క్రమంలో శాస్త్రవేత్తలు, విద్యార్థులు మూఢ విశ్వాసాలను, అశాస్త్రీయ భావాలు, విషయాలను ప్రచారంలో పెట్టడం మానుకోవాలని నినదించటానికి సమాయత్తమవుతున్నారు. ఈ నేపథ్యంలోనే శాస్త్రీయ పరిశోధనలకు ప్రభుత్వాలు ఎక్కువ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. శాస్త్రీయ ఆధారాలున్న వాటినే బోధించాలని కోరుతున్నారు.

మన దేశానికి సంబంధించి చారిత్రకంగా చూస్తే.. ఆర్యభట్ట నుంచి సుశ్రుత దాకా శాస్త్రాభివృద్ధిలో కీలకభూమిక పోషించారు. ఇవ్వాళ పూర్తి స్వదేశీ పరిజ్ఞానం, టెక్నాలజీతో శాటిలైట్ ప్రయోగాలు విజయవంతంగా చేస్తూ, మార్స్, చంద్రయాన్ ప్రయోగాలను విజయవంతంగా చేస్తున్నాం. ఇదంతా మన శాస్త్రవేత్తల కృషేనంటే అతిశయోక్తి ఏమీ కాదు. అని చెప్పి ఈ సందర్భంలోనే దేశంలో ప్రజల్లో శాస్త్రీయ భావజాలం పెరిగిందనీ, మూఢ విశ్వాసాలు క్రమంగా సన్నగిల్లుతున్నాయని చెప్పటానికి లేదు. మన శాస్త్ర, సాంకేతికరంగాల అభివృద్ధి, విజయవంతమైన ప్రయోగాలు చూసి ప్రజల్లో శాస్త్రీయత ఉచ్ఛస్థితిలో ఉన్నదని అనుకుంటే పొరపాటే. దీనికి ప్రధాన కారణం మన విద్యావిధానంలో ఉన్న లోపమని చెప్పవచ్చు. మన పాఠశాల విద్యలో విద్యార్థులు ప్రశ్నకు జవాబులు రాసే విధంగానే తయారవుతున్నారు. ప్రశ్నలకు జవాబులు రాసే క్రమంలో అందులోని విషయంపై విద్యార్థులకు ఏ ఆసక్తి ఉండదు, పట్టింపూ ఉండదు. మరో ప్రశ్న రాస్తే అదెందుకు తప్పో కూడా ఆలోచించరు. ఈ క్రమంలో విద్యార్థుల్లో హేతుబద్ధ ఆలోచనకు తావుండటం లేదు. ఈ నేపథ్యంలోంచే.. దేశవ్యాప్తంగా సైన్స్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు శాస్త్రీయ భావజాలం గురించి ప్రచారోద్యమాన్ని చేపట్టారు. ప్రదర్శనలు, ఊరేగింపులు నిర్వహిస్తూ ప్రజల్లో శాస్త్రీయత ప్రాముఖ్యాన్ని చాటేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పాఠశాలల్లో శాస్త్రీయత, భావజాలంపై సెమినార్‌లు, వర్క్‌షాపులు నిర్వహిస్తున్నారు. తద్వారా విద్యార్థుల్లో విశ్లేషణా శక్తిని, ప్రయోగాత్మక పరిశీలనా దృష్టిని పెంపొందించేదుకు కృషిచేస్తున్నారు. చదువులో, నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యలకు విద్యార్థులు తమవైన పరిష్కారాలు కనుగొనేందుకు ప్రోత్సహిస్తున్నారు. నేటి విద్యార్థులకు తెలిసిందేమంటే.. తమ పాఠశాలలోని ఉపాధ్యాయుడే అన్ని ప్రశ్నలకు సమాధానాలు చెబుతాడని. కానీ విద్యార్థి తనదైన పరిశీలనా, తార్కిక శక్తితో సమాధానాలను, పరిష్కారాలను కనుగొనే విధంగా చేసేందుకు చేస్తున్న బృహత్తర కార్యక్రమం.

దేశంలో పాఠశాలలన్నింటిలో సైన్స్‌ను కూడా ప్రశ్నలు, జవాబుల రూపంలో బోధించబడుతున్నది. ఇలాంటివారు ఉన్నత చదువుల్లోకి వెళ్లిన తర్వాత పరిశోధనలు చేయాల్సి వచ్చినప్పుడు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. వారికి కనీసం శాస్త్రీయ దృక్పథం, సూత్రాల పట్ల ప్రాథమిక అవగాహన లేకుండా కూడా ఉంటున్నారు. దీంతో విద్యార్థుల పరిస్థితి దారి తెన్నూ లేని అగమ్యగోచరంగా తయారవుతున్నది. కాబట్టి విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచే సైన్స్ పాఠాల బోధన కాకుండా ప్రయోగాలు చేయించటానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. చిన్న వయస్సు నుంచే ప్రయోగాలతో అవగాహన పెంచుకునే విధంగా తర్ఫీదు ఇవ్వాలి. అలా చేసినప్పుడే.. మన పురాతన కాలంలోనే విమానాలు ఉండేవని చెబుతున్న విషయాల పట్ల విద్యార్థులు హేతుబద్ధంగా ఆలోచిస్తారు. నిజా నిజాలను తార్కికంగా ఆలోచించి తేల్చుకుంటారు. ఇలాంటి ఆలోచనల నుంచే మంచి, చెడులను గుర్తించగలుగుతారు. ఇలాంటి తార్కిక, హేతుబద్ధ ఆలోచనల పునాదుల్లోంచే నేటి శాస్త్రీయాభివృద్ధి సాధ్యమైందన్నది మరువరాదు. దేశంలో తీవ్రంగా ఉన్న నీటి కరువు, నిరుద్యోగం, ఆర్థికమాంద్యం లాంటి విషయాలు అర్థం చేసుకోవటం, వాటినుంచి పరిష్కారాలను కనుగొనటం శాస్త్రీయ దృక్పథంతోనే సుసాధ్యం. కానీ నేటి పాలక విధానాలు, ప్రజల్లో ప్రచారంలో ఉన్న భావనలు చూస్తే భవిష్యత్తుపై భయం కలుగుతున్నది.

హేతుబద్ధ, తార్కిక విద్యావిధానంతోనే విద్యార్థుల్లో శాస్త్రీయత పెరుగుతుంది. కుహన శాస్త్ర విషయాలను గుర్తించి పక్కనపెట్టే విచక్షణ ఏర్పడుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15ఏ కూడా.. 'శాస్త్రీయ, మానవీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయటమే ప్రతి పౌరుని ప్రాథమిక కర్తవ్యం. హేతుబద్ధ, సంస్కరణకు పెద్దపీట వేయాల'ని చెబుతున్నది. దురదృష్టవశాత్తూ.. ఇప్పుడు ఈ ధోరణి సర్వత్రా విస్మరణకు గురవుతున్నది. తార్కిక, హేతుబద్ధతకు పాతరేసే ధోరణి పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) కూడా విద్యార్థుల్లో శాస్త్రీయతను పెంచేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నది. అయితే ఈ కృషి సఫలీకృతం కావాలంటే ప్రభుత్వపరంగా తోడ్పాటు అవసరం. కానీ ప్రభుత్వాలు శాస్త్రీయ పరిశోధనలకు అవసరమైన నిధుల కేటాయింపులో కోతలు విధిస్తున్నాయి. కొంతకాలంగా శాస్త్ర పరిశోధనల నిధుల్లో 40-50 శాతం తక్కువ కేటాయించారు. పరిశోధనలు చేసే స్కాలర్లకు కూడా ఉపకార వేతనాలు ఇవ్వడంలో కూడా వివక్ష చూపుతున్నది.

**హేతుబద్ధ, తార్కిక విద్యావిధానంతోనే విద్యార్థుల్లో శాస్త్రీయత పెరుగుతుంది. కుహన శాస్త్ర విషయాలను గుర్తించి పక్కనపెట్టే విచక్షణ ఏర్పడుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 15ఏ కూడా.. 'శాస్త్రీయ, మానవీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయటమే ప్రతి పౌరుని ప్రాథమిక కర్తవ్యం. హేతుబద్ధ, సంస్కరణకు పెద్దపీట వేయాల'ని చెబుతున్నది. దురదృష్టవశాత్తూ.. ఇప్పుడు ఈ ధోరణి సర్వత్రా విస్మరణకు గురవుతున్నది.**

ఇలాంటి పరిస్థితుల్లో శాస్త్రీయత కోసం విద్యార్థులు, శాస్త్రవేత్తలు ప్రచారోద్యమానికి పూనుకోవటం హర్షణీయం. ఇందులో భాగంగానే దేశంలో నేడు (ఆగస్టు 9) ముంబై, కలకత్తా నగరాల్లో విద్యార్థులు, శాస్త్రవేత్తల ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలన్నింటా శాస్త్రీయభావాల కోసం ప్రచారోద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ శాస్త్రీయ ఆలోచనలు, భావాల పెంపు కోసం కృషిచేయాలి. హేతుబద్ధ, తార్కిక ఆలోచనలకు పెద్దపీట వేయాలి. అలాగే వివిధ రూపాల్లో ప్రచారంలోకి వస్తున్న అశాస్త్రీయ భావాలకు అడ్డుకట్ట వేయాలి. ఈ విధమైన ఆలోచన ఆచరణతోనే శాస్త్రీయ, మానవీయ సమాజం ఆవిష్కరించుకోగలుగుతాం.

**(వ్యాసకర్తలు: శాస్త్ర పరిశోధక విద్యార్థులు)**

**జనగళం**

## హామీలు మరిచి అసత్యాలా?

ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో పేర్కొన్న హామీలను నెరవేరుస్తామని బీజేపీ నాయకులు పదేపదే ప్రకటనలు ఇస్తుంటారు. కానీ గడిచిన ఐదేండ్ల కాలంలో ఇప్పటికీ అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయి. వాటి గురించి ఎన్నడూ వారు పట్టించుకోలేదు. కానీ తెలంగాణ రాష్ట్రంపై మాత్రం తమ అక్కసును అవసరం వచ్చినప్పుడల్లా వెళ్లగక్కుతూనే ఉంటారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావమే ఒప్పందాల ప్రాతిపదికన ఏర్పడింది. నాడు విలీన సమయంలో చేసుకున్న ఒప్పందాలను ఉల్లంఘించిన ఫలితమే తెలంగాణ రాష్ట్ర పోరాటం దశాబ్దాల పాటు జరిగింది. ఈ విషయం తెలియకుండా బీజేపీ నాయకులు తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై చట్టసభల్లోనూ, బైట అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. ఇటీవలి పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వం అవాకులు చెవాకులు పేల్చే తెలంగాణ బీజేపీ నేతలు అమిత్ షా వ్యాఖ్యలపై మాత్రం మౌనం వహించటం సిగ్గుచేటు. జమ్ముకశ్మీర్‌లో 370, 35 ఏ ఆర్టికల్‌ను రద్దుచేయడం మూలంగా దేశంలో దుమారం రేగింది. దీన్ని ఆసరాగా చేసుకున్న కాంగ్రెస్ నాయకులు బీజేపీని ఎండగట్టారు. పార్లమెంట్‌లో పరస్పరం దూషించుకున్నారు కూడా. ఇదిలా ఉంటే తెలంగాణ ఏర్పాటును అమిత్ షా వాడుకోవడం విడ్డూరం. తెలంగాణ రాష్ట్రం అనేక పోరాటాలు, త్యాగాల ఫలితంగా ఏర్పడింది. కొత్త రాష్ట్రమైనా అనేక సమస్యలు అధిగమిస్తూ ప్రగతిపథంలో పయనిస్తున్నది. అలాంటి రాష్ట్రానికి విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేంద్రానికి ఇక్కడి ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. రెండోసారి ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇప్పటికీ విభజన సమస్యల పరిష్కారం కోసం కేంద్రంలోని పెద్దలు ఏ మాత్రం కృషిచేయడం లేదు. కానీ ఏపీ విభజనపై అసత్యాలతో కూడిన వ్యాఖ్యలు చేయడం వీళ్లకు పరిపాటిగా మారింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై బీజేపీ నేతలు చేసిన వ్యాఖ్యలు వెనక్కితీసుకోవాలి. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం తన వంతు సాయం చేయాలి. అప్పుడే ఇక్కడి ప్రజల మన్ననలు పొందుతారు.

**- ఎర్ర సైదులు, వలిగొండ, యాదాద్రి భువనగిరి జిల్లా**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118


Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



epaper.ntnews.com


ఆర్టికల్ 370 రద్దు..

## అత్యవసర విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న ఆర్టికల్ 370 రద్దు చట్ట విరుద్ధమంటూ సుప్రీంకోర్టులో న్యాయవాది ఎంఎల్ శర్మ దాఖలు చేసిన పిటిషన్ అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు నిరాకరించింది. సరైన సమయంలో దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. అధికరణం 370ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ న్యాయవాది ఎంఎల్ శర్మ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. అధికరణ 370నిరద్దు చేస్తూ రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా పాకిస్థాన్ ప్రభుత్వం, కశ్మీర్ ప్రజలు ఐక్యరాజ్యసమితి(ఐరాస)కి వెళ్లనున్నారని శర్మ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన జస్టిస్ ఎన్ వి రమణ నేతృత్వంలోని ధర్మాసనం.. 'వాళ్లు అక్కడికి వెళ్తే, భారతప్రభుత్వం చేసిన రాజ్యాంగ సవరణను ఐరాస నిలుపుదల చేస్తుందా?' అని పిటిషనర్‌ను ఎదురు ప్రశ్నించింది. సరైన సమయంలో విచారణ జరుపుతామని తెలిపింది.

## శాంతియుతంగా పరిష్కరించుకుందాం

కశ్మీర్‌పై నోబెల్ అవార్డు గ్రహీత మలాలా పిలుపు



**లండన్:** కశ్మీర్ సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవడానికి భారత్, పాకిస్థాన్ కృషి చేయాలని నోబెల్ అవార్డు గ్రహీత, పాకిస్థాన్ విద్యాహక్కుల కార్యకర్త మలాలా యూసఫ్‌జాయ్ సూచించారు. అందరం శాంతియుత వాతావరణంలో జీవిద్దామని, హృదయాలు గాయపడేలా ఒకరినొకరు దూషించుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. మలాలా గురువారం మాట్లాడుతూ కశ్మీర్ సమస్య తమ తాతలు యువకులుగా ఉన్నప్పటి నుంచీ నలుగుతున్నదని చెప్పారు. తన బాధంతా కశ్మీర్‌లోని మహిళలు, పిల్లల గురించేనని.. రాష్ట్రంలో జరుగుతున్న హింసాత్మక సంఘటనల వల్ల వీరే ఎక్కువగా ఇబ్బందుల బారిన పడుతున్నారని తెలిపారు.

## ప్రధాని ప్రసంగం స్ఫూర్తిదాయకం: బీజేపీ

- విశ్వాసం కొరవడిందన్న కాంగ్రెస్

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌పై జాతిని ఉద్దేశించి ప్రధాని నరేంద్రమోదీ చేసిన ప్రసంగం స్ఫూర్తిదాయకమని అధికార బీజేపీ పేర్కొంది. కానీ ప్రతిపక్ష కాంగ్రెస్ మాత్రం ప్రజలకు పునఃహామీలు ఇవ్వడం మినహా ప్రధాని మోదీ ప్రసంగంలో విశ్వాసం కొరవడిందని వ్యాఖ్యానించింది. బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. 'ఈ చరిత్రాత్మక ప్రయాణంలో భాగస్వాములు కావాలని జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రాంత ప్రజలను అభ్యర్థించడం ద్వారా ఆ ప్రాంతాల అభివృద్ధి పట్ల ప్రధాని మోదీ తన నిబద్ధతను ప్రదర్శించారు' అని పేర్కొన్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఆనంద్‌శర్మ స్పందిస్తూ.. 'హోంమంత్రి అమిత్‌షా చెప్పిన మాటల్నే ప్రధాని వల్లె వేశారు.కశ్మీరీల ప్రాథమిక హక్కులను గౌరవిస్తామన్న విషయమై ప్రధాని ప్రసంగంలో విశ్వాసం, తార్కికత కొరవడింది' అని చెప్పారు. కశ్మీర్ లోయలో ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

### ప్రపంచం దృష్టిని ఆకర్షించేందుకే..

పాక్ దౌత్య సంబంధాల తెగదెంపులపై భారత్ వ్యాఖ్య

**న్యూఢిల్లీ:** కశ్మీర్ విషయంలో ఏదో జరిగిపోతున్నదని అంతర్జాతీయ సమాజానికి సంకేతాలివ్వడానికి పాకిస్థాన్ ప్రయత్నిస్తున్నదని.. దీనికోసమే ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తున్నదని విదేశాంగశాఖ పేర్కొంది. పాక్ తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని పేర్కొంది. ఆర్టికల్ 370 రద్దు, జమ్ము కశ్మీర్ విభజన నేపథ్యంలో.. భారత రాయబారిని బహిష్కరించటంతోపాటు, పలు కఠిన చర్యలకు దిగిన విషయం తెలిసిందే.

# కశ్మీర్‌లో నవశకం

## ఆర్టికల్ 370 రద్దు చారిత్రాత్మక నిర్ణయం ■ ఒకే దేశం - ఒకటే రాజ్యాంగం కల నెరవేరింది

- ఉగ్రవాదం, వేర్పాటువాదం, కుటుంబపాలనకు చరమగీతం
- ఇకపై జమ్ముకశ్మీర్, లడఖ్‌లో అభివృద్ధి పరుగులు
- అన్నివర్గాల ప్రజలకు దక్కనున్న ప్రయోజనాలు
- కేంద్ర పథకాలన్నీ అమలవుతాయి
- యువతకు అపార ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి
- జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రధాని మోదీ



గురువారం జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** కశ్మీర్‌లో నవశకం మొదలైందని ప్రధాని నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దును చారిత్రాత్మక నిర్ణయంగా అభివర్ణించారు. దశాబ్దాలుగా జమ్ముకశ్మీర్, లడఖ్ ప్రజలు పడుతున్న బాధలకు చరమగీతం పాడామన్నారు. అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్, శ్యామ ప్రసాద్ ముఖర్జీ, వాజపేయి వంటి గొప్పనేతలతోపాటు కోట్ల మంది ప్రజలు ఆర్టికల్ 370ని రద్దు చేయాలని ఆకాంక్షించారని తెలిపారు. స్వాతంత్ర్యం లభించిన ఏడు దశాబ్దాల తర్వాత ఒకే దేశం, ఒకే రాజ్యాంగం కల నెరవేరిందన్నారు. ఇకపై కశ్మీర్ దశాదిశా మారిపోతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఆర్టికల్ 370 రద్దు, జమ్ముకశ్మీర్ విభజన తర్వాత ప్రధాని తొలిసారిగా గురువారం సాయంత్రం జాతినుద్దేశించి ప్రసంగించారు. అందులోని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

### యూటీ శాశ్వతం కాదు

జమ్ముకశ్మీర్ శాశ్వతంగా కేంద్రపాలిత ప్రాంతంగా (యూటీ)ఉండదు. గవర్నర్ పాలనలో అక్కడ ఎంతో అభివృద్ధి జరిగింది. ఇది గమనించిన తర్వాత అనేక చర్చల అనంతరం జమ్ముకశ్మీర్, లడఖ్‌ను యూటీలుగా మార్చాం. ఉగ్రవాదం, వేర్పాటువాదం వంటివి తొలిగిపోయి పరిస్థితులు మెరుగుపడ్డాక జమ్ముకశ్మీర్‌కు పూర్తిస్థాయి రాష్ట్ర హోదా వస్తుంది.

### ఆర్టికల్ 370తో అపార నష్టం

ఆర్టికల్ 370తో కశ్మీర్ ప్రజలకు అపార నష్టం కలిగింది. పాకిస్థాన్ దీనిని ఆయుధంగా మలుచుకొని ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టింది. ఫలితంగా గత మూడు దశాబ్దాల్లో 42 వేల మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. 370, 35ఏ అధికరణల వల్ల కశ్మీర్‌లో ఉగ్రవాదం, వేర్పాటువాదం, కుటుంబపాలన పెరిగిపోయాయి. అవినీతి వేళ్లూనుకుపోయింది. కొత్త పాలనలో కశ్మీర్ శాంతివనంలా మారుతుందనే నమ్మకం నాకున్నది. జమ్ముకశ్మీర్, లఢక్‌కు కొత్త దశ, దిశ చూపేందుకు కేంద్రం, దేశం మొత్తం సిద్ధంగా ఉన్నది.

### హక్కులు, చట్టాలకు దూరమయ్యారు

ఆర్టికల్ 370 వల్ల అక్కడి ప్రజలు మిగతా రాష్ట్రాలతో పోల్చితే ఎంతో కోల్పోయారు. దేశమంతటా విద్యాహక్కు చట్టం కింద పిల్లలకు మెరుగైన విద్య అందుతున్నది. కానీ.. కశ్మీర్‌లో ఈ చట్టం ఊసే లేదు. కశ్మీర్ బాలలు ఏం పాపం చేశారు?. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రక్షణగా ప్రత్యేక చట్టాలున్నాయి. ఇవి కశ్మీర్‌లో మినహా దేశవ్యాప్తంగా అమలవుతున్నాయి. ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీలకు దేశవ్యాప్తంగా ప్రత్యేక రిజర్వేషన్లున్నా కశ్మీర్‌లో మచ్చుకైనా కానరావు. మిగతారాష్ట్రాల్లోని ఆడపిల్లలకు లభించే హక్కులు కశ్మీరీలకు అందడం లేదు. కనీస వేతన చట్టం కాగితాల్లో కూడా కనిపించదు.

'**ఇటీవల** నేను శ్రీనగర్‌కు వెళ్లినప్పుడు జమ్ముకశ్మీర్‌లోని సర్పంచులు అద్భుతంగా పనిచేయడం గమనించాను. వారు తమ గ్రామాల్లో కేంద్ర పథకాల అమలుకు ఆసక్తి చూపుతున్నారు. 370 రద్దుతో వారికి స్వేచ్ఛ వస్తుంది. ఇంకా అద్భుతాలు సృష్టిస్తారు'

'**ఒకప్పుడు** అనేక సినిమాలను జమ్ముకశ్మీర్‌లో చిత్రీకరించేవారు. ఇక్కడి పరిస్థితులు కుదుటపడిన తర్వాత బాలీవుడ్‌తోపాటు తెలుగు, తమిళ సినిమాలు ఇక్కడ చిత్రీకరణ జరుపాలని కోరుతున్నా. దీంతో ఇక్కడి యువతకు ఉపాధి దొరుకుతుంది'

### అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం

ఆర్టికల్ 370 రద్దుతో జమ్ముకశ్మీర్, లడఖ్ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి. ఈ ప్రాంత ఉద్యోగులు, పోలీసులకు త్వరలో కేంద్రపాలిత ప్రాంత ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పిస్తాం. ప్రజలందరికీ మెరుగైన వైద్యం, విద్యుత్తు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. రోడ్డు, రైలు మార్గాలు విస్తరిస్తాయి. ప్రాజెక్టుల నిర్మాణాన్ని, ఎయిర్‌పోర్టుల ఆధునీకరణను వేగవంతం చేస్తాం. విద్యార్థుల కోసం ప్రధానమంత్రి స్కాలర్‌షిప్ పథకాన్ని అమలు చేస్తాం. ఐఐటీ, ఐఐఎం వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలను నెలకొల్పుతాం. టెక్నాలజీని విస్తరిస్తాం.

### యువత కోసం..

జమ్ముకశ్మీర్, లడఖ్‌లోని యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అపార ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో నియామకాలు చేపడుతాం. సైన్యంలో స్థానిక యువతను భర్తీచేస్తాం. ప్రైవేట్ కంపెనీల ఏర్పాటును ప్రోత్సహిస్తాం. జమ్ముకశ్మీర్ యువతకు ఇంగ్లిష్‌లో మంచి నైపుణ్యం ఉన్నది. కాబట్టి బీపీవోలు పెట్టేందుకు అవకాశాలు ఉన్నాయి. క్రీడల్లో కశ్మీర్ యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు స్పోర్ట్స్ అకాడమీ, స్టేడియంలు నిర్మిస్తాం.

### పర్యాటకంలో ప్రపంచస్థాయికి..

జమ్ముకశ్మీర్, లడఖ్ త్వరలో ఆధ్యాత్మిక, అడ్వెంచర్, ఎకో టూరిజం కేంద్రాలుగా మారుతాయి. భారత అభివృద్ధిలో భాగమవుతాయి. ఇక్కడ ప్రపంచస్థాయి పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నాయి. కశ్మీర్ కళాకారుల ఉత్పత్తులు, లడఖ్ సేంద్రియ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్‌లోకి చేరాలి. ఈ బాధ్యత అందరిపైనా ఉన్నది. లడఖ్‌లో దొరకే ఒక మూలిక ఆక్సిజన్ తక్కువగా ఉండే పర్వత ప్రాంతాల్లో జీవించేవారికి, మంచుకొండల్లో ఉండే సైనికులకు, యాత్రికులకు సంజీవిని మాదిరిగా పనిచేస్తుంది.

### రాబోయేది ప్రజా ప్రభుత్వం

ఇన్నాళ్లూ పిడికెడు మంది కలిసి కశ్మీర్‌ను ఏలారు. ఇకపై అలా కుదురదు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తాం. ప్రజల కోసం పనిచేసే ప్రజా ప్రభుత్వం గద్దెనెక్కుతుంది. యువత నుంచి కొత్త నాయకులు పుట్టుకొస్తారు. కశ్మీర్ ప్రజలందరికీ ఈద్ శుభాకాంక్షలు. సోదరసోదరీమణులారా నాతో చేతులు కలుపండి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందాం.



నానాజీ దేశ్‌ముఖ్ తరపున అవార్డును స్వీకరిస్తున్న ఆయన కుటుంబసభ్యుడు.. హజారికా తరపున అవార్డును స్వీకరిస్తున్న ఆయన కుమారుడు తేజ్

ప్రణబ్ ముఖర్జీకి

## భారతరత్న ప్రదానం

- హజారికా తరపున అవార్డును తీసుకున్న ఆయన కొడుకు తేజ్
- నానాజీ దేశ్‌ముఖ్ అవార్డును స్వీకరించిన కుటుంబసభ్యులు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం భారతరత్న పురస్కారాల ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. 2019 ఏడాదికిగాను దేశ అత్యున్నత పురస్కారాన్ని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ, భారతీయ జనసంఘ్ నాయకుడు దివంగత నానాజీ దేశ్‌ముఖ్, దివంగత గాయకుడు భూపేన్ హజారికాకు ప్రకటించిన విషయం తెలిసిందే. దర్బార్ హాల్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ప్రణబ్ ముఖర్జీ భారతరత్న పురస్కారాన్ని అందుకోగా.. భూపేన్ హజారికా తరపున ఆయన తనయుడు తేజ్ హజారికా, నానాజీ దేశ్‌ముఖ్ తరపున ఆయన సన్నిహిత కుటుంబసభ్యులు అవార్డును తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్ర మంత్రులు, ఇతర నేతలు పాల్గొన్నారు.

**ప్రణబ్ ముఖర్జీ**

ప్రణబ్ ముఖర్జీని 'ప్రణబ్ దా'(ప్రణబ్ అన్న) అని ప్రేమతో పిలుస్తారు. దేశ అత్యున్నత పురస్కారం అందుకున్న ఐదో రాష్ట్రపతిగా ఆయన నిలిచారు. అంతకు ముందు మాజీ రాష్ట్రపతులు సర్వేపల్లి రాధాకృష్ణన్, రాజేంద్ర ప్రసాద్, జాకీర్ హుస్సేన్, వి వి గిరి ఈ గౌరవాన్ని అందుకున్నారు.

**నానాజీ దేశ్‌ముఖ్ (1916-2010)**

1928 మొదలు 2010లో చనిపోయేంత వరకూ నానాజీ దేశ్‌ముఖ్‌కు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్)తో అవినాభావ సంబంధం కొనసాగింది. భారతీయ జనసంఘ్(తర్వాత భారతీయ జనతా పార్టీగా మారింది) వ్యవస్థాపకుల్లో ఈయన ఒకరు.

**భూపేన్ హజారికా(1926-2011)**

గాయకుడిగా, గేయ రచయితగా, సంగీత దర్శకుడిగా, సినీ నిర్మాతగా కళారంగానికి నిరుపమాన సేవలందించిన భూపేన్ హజారికా 2004లో బీజేపీ నుంచి గువాహటి లోక్‌సభ స్థానానికి పోటీ చేశారు.

### ఇటువంటి పొరుగుదేశం ఎవరికీ ఉండొద్దు

**న్యూఢిల్లీ:** రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పరోక్షంగా పాకిస్థాన్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ఇటువంటి పొరుగు దేశం ఎవరికీ ఉండొద్దన్నారు. గురువారం ఢిల్లీలో జరిగిన మాజీ సైనికాధికారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'పొరుగుదేశం నుంచి పలు సమస్యలను ఎదుర్కొన్నాం. ఇరుగుపొరుగును ఎంచుకోవడంలో మీ పాత్రేమీ ఉండదు. ఇటువంటి ఇరుగు పొరుగు (పాకిస్థాన్)ను ఎవరికీ ఇవ్వొద్దని దేవుడ్ని కోరుతున్నా' అని అన్నారు.

### నాజీ నిర్బంధ క్యాంపులా కశ్మీర్

**న్యూఢిల్లీ:** కశ్మీర్‌లో పరిస్థితి నాజీల నిర్బంధ క్యాంపులను తలపిస్తున్నదని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత అధిర్ రంజన్ చౌదరి అన్నారు. ఆంక్షల ద్వారా కశ్మీర్‌ను అభివృద్ధి చేస్తారా? అని ప్రశ్నించారు. 'ఈనాడు కశ్మీర్‌లో పరిస్థితి నిర్బంధ క్యాంపును గుర్తు చేస్తున్నది. మొబైల్, ఇంటర్నెట్ సేవలు లేవు, అమర్‌నాథ్ యాత్ర లేదు. ఏం జరుగుతున్నది అక్కడ' అని ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ ప్రశ్నించారు.

# సంఝౌతా ఎక్స్‌ప్రెస్ నిలిపివేత

- రైలు సేవలను ఆపేస్తున్నట్టు ప్రకటించిన పాకిస్థాన్
- వాఘా సరిహద్దు వద్ద నిలిచిపోయిన రైలు
- అట్టారి వరకు తీసుకొచ్చిన భారత రైల్వేసిబ్బంది
- భారత్‌కు పలు మార్గాల్లో అడ్డంకులు సృష్టిస్తున్న పాక్



అట్టారిలో సంఝౌతా ఎక్స్‌ప్రెస్ నుంచి దిగుతున్న ప్రయాణికులు

**న్యూఢిల్లీ, ఇస్లామాబాద్:** కశ్మీర్‌పై కేంద్రం నిర్ణయాన్ని పాకిస్థాన్ జీర్ణించుకోలేకపోతున్నది. బుధవారం భారత హైకమిషనర్‌ను బహిష్కరించిన పాక్.. తాజాగా భారత్-పాక్‌ను కలిపే సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలును నిలిపివేసింది. భారత సినిమాలను నిషేధించింది. తమ అదుపులో ఉన్న కుల్‌భూషణ్‌తో భారత అధికారులు మాట్లాడకుండా అడ్డుకుంటున్నది.

**వాఘా సరిహద్దులో బ్రేక్..**

సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలు సేవలను నిలిపివేస్తున్నట్టు పాక్ రైల్వే మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గురువారం తెలిపారు. తాను రైల్వే మంత్రిగా ఉన్నంత వరకూ ఈ రైలు నడిచే ప్రసక్తే లేదన్నారు. ఈ మేరకు లాహోర్ నుంచి వెళ్తున్న రైలును వాఘా సరిహద్దు వద్ద నిలిపివేసినట్టు ఆ దేశ రైల్వేశాఖ ప్రతినిధి తెలిపారు. రైలు 110 మంది ప్రయాణికులతో ఉదయం 9:30 గం టలకు వాఘాకు చేరుకున్నట్టు అధికారవర్గాలు తెలిపాయి. 'భద్రతా కారణాల వల్ల తమ రైల్వేశాఖ సిబ్బంది రైలును అట్టారి వరకు తేవడానికి ఇష్టపడటం లేదని పాక్ అధికారులు సమాచారం ఇచ్చారు. భారత్ నుంచి ఒక రైలు ఇంజిన్, డ్రైవర్, ఇతర సిబ్బందిని వాఘాకు పంపి రైలును తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు మేం పంజాబ్‌లోని అమృత్‌సర్ స్టేషన్ నుంచి రైలింజిన్, సిబ్బందిని రప్పించాం. వాళ్లు వాఘాకెళ్లి ప్రయాణికులను అట్టారి వరకు తీసుకొచ్చారు' అని నార్తన్ రైల్వే అధికార ప్రతినిధి దీపక్ కుమార్ తెలిపారు.

**ఒకే సర్వీస్.. రెండు రైళ్లు**

సంఝౌతా ఎక్స్‌ప్రెస్ ఢిల్లీ-లాహోర్ మధ్య వారానికి రెండుసార్లు నడుస్తుంది. 1971 సిమ్లా ఒప్పందంలో భాగంగా 1976 జూలై 22న సంఝౌతా ఎక్స్‌ప్రెస్ సేవలను ప్రారంభించారు. కానీ భారత్-పాక్ ఉద్రిక్తత తలెత్తినప్పుడల్లా పాక్ ఈ రైలును నిలిపివేస్తూ ఉంటుంది.

**సైనిక చర్య ఆలోచనే లేదు**

కశ్మీర్ విషయంలో తమకు సైనిక చర్యకు దిగాలనే ఆలోచనే లేదని పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఖురేషీ గురువారం మీడియాకు తెలిపారు. కశ్మీర్‌పై భారత్ నిర్ణయాన్ని రాజకీయంగా, న్యాయపరంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. త్వరలో తాను చైనాకు వెళ్లనున్నానని, ప్రస్తుత పరిస్థితిని చైనా ప్రభుత్వానికి వివరిస్తానని చెప్పారు. జమ్ముకశ్మీర్‌పై వెనక్కి తగ్గితేనే భారత్‌తో దౌత్య సంబంధాలపై పునరాలోచిస్తామన్నారు. మరోవైపు పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ బుధవారం బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్, సౌదీ రాజు ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్‌కు ఫోన్ చేసి ఆర్టికల్ 370 రద్దు గురించి చర్చించారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో భారత విమానాలు తమ గగనతలం మీదుగా వెళ్లకుండా పాకిస్థాన్ నిషేధం విధించిందని వచ్చిన వార్తలను పాకిస్థాన్ పౌరవిమానయానశాఖ అధికార ప్రతినిధి ముజ్తాబా బేగ్ తోసిపుచ్చారు. కశ్మీర్ అంశాన్ని ఐక్యరాజ్యసమితి(ఐరాస) భద్రతామండలి ఎజెండాలో పొందుపరుస్తామని పాక్ తెలిపింది. కర్తాపూర్ కారిడార్ పనులను కొనసాగిస్తామని పాకిస్థాన్ స్పష్టం చేసింది. తాజా ఉద్రిక్తతలకు ఈ పనులను సంబంధం లేదని పాకిస్థాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మహ్మద్ ఫైజల్ మీడియాకు తెలిపారు.



మహారాష్ట్రలోని కొల్లాపూర్‌లో వరద మునిగిన ఓ ప్రాంతం

కుంభవృష్టితో రాష్ట్రాలు

# అతలాకుతలం!

- మహారాష్ట్రలో పడవ బోల్తా, 9 మంది మృతి
- వరద నీటిలో చిక్కుకున్న కొల్హాపూర్, సంగ్లీ జిల్లాలు
- కేరళలోని నాలుగు జిల్లాల్లో ప్రమాద హెచ్చరికలు, ఎనిమిది మంది మృతి
- తమిళనాట ముగ్గురు మృతి



కేరళ లోని అలువాలో భారీ వర్షానికి నీట మునిగిన అలువా మహదేవ దేవాలయం

**సంగ్లీ/కొల్హాపూర్/బెంగళూరు/భువనేశ్వర్:** కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పలు రాష్ట్రాలను అతలాకుతలం చేస్తున్నాయి. గురువారం ఒక్కరోజే మహారాష్ట్రలో 9 మంది, కేరళలో 8 మంది, తమిళనాడులో ముగ్గురు మృతి చెందారు. మహారాష్ట్రలో కుంభవృష్టి కొనసాగుతున్నది. కొల్హాపూర్, సంగ్లీ జిల్లాలు వరద గుప్పిట్లో చిక్కుకున్నాయి. వరదలు ముంచెత్తడంతో సంగ్లీ జిల్లాలో జరిగిన ఓ పడవ ప్రమాదంలో 9 మంది మరణించగా మరో నలుగురు గల్లంతయ్యారు. సంగ్లీ జిల్లా జైలు కింది అంతస్తులోకి వర్షపు నీరు రావడంతో అధికారులు ఖైదీలను మొదటి అంతస్తులోకి తరలించారు.1.32 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. కేరళలోని ఇడుక్కి, మలప్పురం, కోజికోడ్, వయనాడ్ జిల్లాల్లో అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. వివిధ ఘటనల్లో 8 మంది మరణించారు. కర్ణాటకలో కురుస్తున్న వర్షాలతో పచ్చపూర్, గోకాక్, పుణె డివిజన్‌లోని పలు ప్రాంతాలకు రైలు సర్వీసులు రద్దయ్యాయి. దక్షిణ ఒడిశా లో రోడ్డు, రైలు రవాణాకు అంతరాయం ఏర్పడింది. తమిళనాడులో ముగ్గురు మృతి చెందారు. వచ్చే 2,3 రోజుల్లో గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం అంచనా వేసింది. మరోవైపు, కేంద్ర కేబినెట్ కార్యదర్శి పీకే సిన్హా నేతృత్వంలో జాతీయ సంక్షోభ నిర్వహణ కమిటీ వరద పరిస్థితులను సమీక్షించింది.


**వరద గుప్పిట్లో శ్రీకాకుళం**

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా గొట్టా బరాజ్ వద్ద వంశధార నది ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికలు జారీచేశారు. గురువారం బరాజ్‌లోకి 1.11 లక్షల క్యూసెక్కుల వరద నీరు చేరింది. కాగా, నాగావళి నది పైగల తోటపల్లి బరాజ్‌కి 43,479 క్యూసెక్కుల నీరు వస్తుండటం తో రెండో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు.



శ్రీకాకుళం జిల్లాలోని మడపం బ్రిడ్జ్ కింది నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వంశధార నది

# కశ్మీర్ గౌరవాన్ని కాలరాశారు



శ్రీనగర్ నుంచి వెనక్కి పంపిన అనంతరం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న ఆజాద్

- కనికరం లేకుండా ఊచకోత కోశారు
- రాష్ట్రమంతటా కర్ఫ్యూ వాతావరణం కనిపిస్తున్నది
- కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ నేత ఆజాద్ నిప్పులు
- శ్రీనగర్ విమానాశ్రయంలో ఆజాద్‌ను అడ్డుకున్న పోలీసులు
- ఢిల్లీకి వెనక్కి పంపివేత

**న్యూఢిల్లీ/శ్రీనగర్, ఆగస్టు 8:** జమ్ముకశ్మీర్ గౌరవాన్ని, గుర్తింపును, గత చట్టాలను కాలరాస్తూ కేంద్రప్రభుత్వం కనికరంలేని ఊచకోతకు పాల్పడిందని కాంగ్రెస్ ఎంపీ, జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ మండిపడ్డారు. జమ్ముకశ్మీర్‌లో పర్యటించడానికి కశ్మీర్ కాంగ్రెస్ అధ్యక్షుడు గులామ్ అహ్మద్ మీర్‌తో కలిసి ఆయన గురువారం శ్రీనగర్ విమానాశ్రయానికి చేరుకున్నారు. అయితే, విమానాశ్రయంలోనే పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని.. తిరిగి ఢిల్లీకి పంపారు. ఢిల్లీకి చేరిన అనంతరం ఆజాద్ మీడియాతో మాట్లాడుతూ.. కశ్మీర్ విషయంలో కేంద్రం అవలంభిస్తున్న తీరుపై దుమ్మెత్తిపోశారు. జమ్ముకశ్మీర్‌ను రెండుగా విడగొట్టి.. రాష్ట్ర గౌరవాన్ని, గుర్తింపును, గత చట్టాలను కాలరాస్తూ బీజేపీ నేతృత్వంలోని కేంద్రం కనికరంలేని ఊచకోతకు పాల్పడిందన్నారు. 'జమ్ముకశ్మీర్ తన గౌరవాన్ని, గుర్తింపును కోల్పోయింది. జమ్ముకశ్మీర్‌కు గతంలో మహారాజు, ప్రధాని ఉండేవారు. అనంతరం 18 ఏండ్లపాటు రాష్ట్రపతి, ప్రధాని ఉండేవారు. ఆ గౌరవమంతా తుడిచిపెట్టుకుపోయింది. జమ్ముకశ్మీర్‌కు గవర్నర్, ముఖ్యమంత్రి ఉండేవారు. ఇప్పుడు కేవలం లెఫ్టినెంట్ గవర్నర్ మాత్రమే ఉన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో ఇది సిగ్గుచేటు. కశ్మీర్ గౌరవం పోయింది' అని అన్నారు. 'ప్రపంచంలోనే పేరున్న రాష్ట్రం రెండు ముక్కలైంది. మేము విడిపోయాం. మా గుర్తింపును కోల్పోయాం. సర్వస్వం కోల్పోయాం' అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రజలెవరూ ఇంటి నుంచి బయటకు రాకుండా నిర్బంధించారని, ఆ ప్రాంతమంతా కర్ఫ్యూ వాతావరణం కనిపించిందని ఆరోపించారు. 'జమ్ముకశ్మీర్‌లోని 22 జిల్లాల్లో కర్ఫ్యూ విధించి మోదీ కొత్త నల్ల చట్టాన్ని బలవంతంగా తీసుకురావాలని అనుకుంటున్నారేమో' అని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో అడుగుపెట్టకుండా తనను అక్కడి పోలీసులు, అధికారులు అడ్డుకున్నారని.. తాను రాజ్యసభలో ఆ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నానని.. అక్కడి ప్రజలను కలిసే హక్కు తనకు ఉన్నదని అన్నారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో భద్రతాపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొనే ఆయన్ని అదుపులోకి తీసుకున్నట్టు అధికారులు తెలిపారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కశ్మీర్‌లోని షోపియాన్‌లో బుధవారం స్థానిక ముస్లింలతో కలిసి రోడ్డు పక్కన ఆహారం తీసుకుంటూ సంభాషించటంపై ఆజాద్ స్పందిస్తూ వాళ్లంతా డబ్బులు చెల్లించి తీసుకొచ్చిన వారని అన్నారు. 'డబ్బులు ఇచ్చి ఎవరినైనా వెంట తీసుకెళ్లవచ్చు' అని ఆయన పేర్కొన్నారు.



### కార్గిల్‌లో ర్యాలీ.. పలువురు అరెస్ట్

ఆర్టికల్ 370ను రద్దు చేయడాన్ని నిరసిస్తూ కార్గిల్‌లో పలువురు ర్యాలీ తీయగా పోలీసులు వాళ్లని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సెక్షన్ అమలవుతున్నప్పటికీ దీనిని ఉల్లంఘించి గురువారం కార్గిల్ ప్రాంతంలో దాదాపు 300 మంది ర్యాలీ నిర్వహించారు. పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నానని, అది తన వ్యక్తిగత అభిప్రాయమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కరణ్‌సింగ్ చెప్పారు. మరోవైపు జమ్ముకశ్మీర్‌లో తాజా పరిస్థితిపై ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ గురువారం సమీక్షించారు. శుక్రవారం తాము జమ్ముకశ్మీర్‌లో పర్యటిస్తామని, ప్రభుత్వం నుంచి ఎలాంటి అడ్డంకులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ వామపక్ష నాయకులు సీతారాం ఏచూరి, డీ రాజా గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు గురువారం ఓ లేఖ రాశారు. కశ్మీర్ లోయలోని 25 మంది వేర్పాటువాదులను అధికారులు గురువారం శ్రీనగర్ నుంచి ఆగ్రాకు తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆంక్షలు కొనసాగుతున్నాయి.

నమస్తే తెలంగాణ
ఆట
10
[ కరీంనగర్ ]
శుక్రవారం 9 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM

**పీకేఎల్‌లో నేడు**

బెంగాల్ X యూ ముంబా -7.30గం.
పాట్నా X యూపీ యోధా -8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో

# పెండ్లి పీటలెక్కనున్న రెజ్లర్లు

## సంగీత ఫోగట్‌ను వివాహమాడనున్న బజరంగ్ పునియా



**న్యూఢిల్లీ:** మరో రెజ్లింగ్ జోడీ పెండ్లి పీటలెక్కడానికి రెడీ అవుతున్నది. ఇప్పటికే గీతా ఫోగట్-పవన్ కుమార్.. సాక్షి మాలిక్-సత్యవర్త్.. వినేశ్ ఫోగట్-సోమ్‌వీర్ రథి వివాహ బంధంతో ఒక్కటవగా.. తాజాగా ప్రపంచ నంబర్‌వన్ రెజ్లర్ బజరంగ్ పునియా, జాతీయ మాజీ చాంపియన్ సంగీత ఫోగట్ (59 కేజీలు) ఈ జాబితాలో చేరనున్నారు. టోక్యో ఒలింపిక్స్ (2020) తర్వాత వివాహ మహోత్సవం జరుపనున్నట్లు సమాచారం. పురుషుల 65 కేజీల విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ బజరంగ్‌పై టోక్యో ఒలింపిక్స్‌లో భారీ అంచనాలు ఉన్నాయి. పెండ్లిపై రెండు కుటుంబాలు ఓ అవగాహనకు వచ్చినట్లు సమాచారం. 'ఇరు కుటుంబాల మధ్య చర్చలు జరిగిన మాట నిజమే. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. పిల్లల ఇష్టాఇష్టాలను గౌరవించడం పెద్దల బాధ్యత. నా కూతుర్లు వాళ్లకు ఇష్టమైన వారిని ఎంచుకునే స్వేచ్ఛనిచ్చా. ఏనాడు వారిపై ఒత్తిడి చేయలేదు. ఎవరితో మీరు జీవితాంతం ఆనందంగా ఉండగలరో వారినే ఎంచుకోమని పదే పదే చెప్తూ ఉంటా. టోక్యో ఒలింపిక్స్ తర్వాత దీని గురించి ఆలోచిస్తాం' అని మహావీర్ సింగ్ ఫోగట్ మీడియాకు తెలిపారు. ఈ అంశంపై సంగీత స్పందన కోరగా.. 'ముఝే ఇస్ బారేమే బాత్ నహీ కర్నీ. పాపాసే బాత్ కర్లో' (ఈ అంశంలో నేనేం మాట్లాడాలనుకోవడం లేదు. మా నాన్నతోనే మాట్లాడుకోండి) అని చెప్పింది.

# వరుణుడి దోబూచులాట

**భారత్,వెస్టిండీస్ తొలి వన్డేకు వర్షం దెబ్బ**

**చివరికి ఫలితం తేలకుండానే రద్దు**

**13 ఓవర్లలో విండీస్ 54/1**



**గయానా:** టీ20 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి జోరు మీదున్న టీమ్‌ఇండియా వన్డే సరీస్‌లోనూ అదే జోరు కొనసాగించాలనుకుంటే.. తొలి మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడ్డాడు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ వర్షం కారణంగా మ్యాచ్ నిలిచిపోయే సమయానికి 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 54 పరుగులు చేసింది. లూయిస్ (36 బంతుల్లో 40 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్సర్లు) ఆకట్టుకున్నాడు. వాన ఎంతకూ తగ్గకపోవడంతో చివరకు మ్యాచ్‌ను ఫలితం తేల్చకుండానే ముగించారు. ఈ మ్యాచ్‌లో లోకేశ్ రాహుల్‌ను కాదని నాలుగో స్థానం కోసం శ్రేయస్ అయ్యర్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు. మెగాటోర్నీలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన కేదార్ జాదవ్ మరోసారి జట్టులో చోటు దక్కించుకున్నాడు. చహల్‌ను కాదని స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు చాన్స్ ఇచ్చారు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే ఆదివారం జరుగనుంది.

### ఆకట్టుకున్న పేసర్లు

టాస్ గెలిచిన విరాట్ కోహ్లీ మొదట ఫీల్డింగ్ చేసేందుకు మొగ్గుచూపాడు. బౌలింగ్‌కు సహకరిస్తున్న పిచ్‌పై భారత పేసర్లు సత్తా చాటడంతో విండీస్ ఓపెనర్లు పరుగులు రాబట్టేందుకు నానా తంటాలు పడ్డారు. 5.4 ఓవర్లలో విండీస్ 9/0తో ఉన్న దశలో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించింది. దాదాపు గంటసేపటి తర్వాత తిరిగి మైదానంలోకి వచ్చిన కరీబియన్లు ధాటిగా ఆడే ప్రయత్నం చేశారు. ముఖ్యంగా లూయిస్ రెచ్చిపోయాడు. భువనేశ్వర్ ఓవర్‌లో సిక్సర్ బాదిన అతడు.. ఖలీల్ అహ్మద్ తొలి ఓవర్‌లో 4,6,4 దంచాడు. మరో ఎండ్‌లో గేల్ (4) ఇబ్బంది పడుతుంటే.. లూయిస్ మాత్రం యధేచ్ఛగా భారీ షాట్లు ఆడాడు. ఖలీల్ ఓవర్‌లో అతడు మరో సిక్సర్ కొట్టాడు. ఫలితంగా 10 ఓవర్లు పూర్తయ్యేసరికి వెస్టిండీస్ వికెట్ నష్టపోకుండా 42 పరుగులు చేసింది. వెస్టిండీస్ తరఫున వన్డేల్లో అత్యధిక పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గా నిలిచేందుకు అతి చేరువలో ఉన్న యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ స్థాయికి తగ్గట్లు ఆడలేకపోయాడు. కుల్దీప్ వేసిన 11వ ఓవర్ తొలి బంతికి బౌల్డ్ అయ్యాడు. విధ్వంసానికి మారుపేరైన గేల్ 31 బంతులు ఎదుర్కొని కేవలం 4 పరుగులే చేయడం గమనార్హం. మూడో స్థానంలో వచ్చిన హోప్ (6 నాటౌట్)తో కలిసి లూయిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. దీంతొ 13 ఓవర్లు ముగిసేసరికి విండీస్ 54/1తో నిలిచింది. ఈ దశలో మరోసారి వాన ముంచెత్తడంతో మ్యాచ్ మళ్లీ ఆగింది. మధ్యలో ఓసారి వర్షం తగ్గి ఆట ఆరంభమయ్యే సూచనలు కనిపించినా.. తిరిగి వన జోరందుకోవడంతో ఆట సాధ్యపడే అవకాశాలు లేకపోవడంతో ఫలితం తేలకుండా ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

### ఆటాడుకున్న వర్షం

అంతకుముందు మ్యాచ్ ఆరంభానికి ముందే ఇక్కడ భారీ వర్షం కురవడంతో ఆట నిర్ణీత సమయం కంటే రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. దీంతో తొలుత మ్యాచ్‌ను 43 ఓవర్లకు కుదించారు. ఆ తర్వాత పట్టుమని పది ఓవర్లు కూడా మ్యాచ్ సజావుగా సాగక ముందే మరోసారి వర్షం ఆటంకం కలిగించింది. దీంతో 40 ఓవర్లకు కుదించారు. వర్షం తగ్గినా ఔట్ ఫీల్డ్ చిత్తడిగా మారడంతో ఆట ఆరంభించడానికి తీవ్ర ఆలస్యమవడంతో ఆఖరుకు 34 ఓవర్లుగా నిర్ణయించారు.

### స్కోరు బోర్డు

**వెస్టిండీస్:** గేల్ (బి) కుల్దీప్ 4, లూయిస్ (నాటౌట్) 40, హోప్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు:** 4, **మొత్తం:** 13 ఓవర్లలో 54/1. **వికెట్ల పతనం:** 1-42, **బౌలింగ్:** భువనేశ్వర్ 4-1-11-0, షమీ 3-0-5-0, ఖలీల్ 3-0-27-0, కుల్దీప్ 2-0-3-1, జడేజా 1-0-6-0.

**వెయ్.. చిందెయ్..**



ఓ వైపు మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగిస్తుంటే.. మైదానంలో ప్లేయర్లు మాత్రం హుషారుగా కనిపించారు. ముఖ్యంగా టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ఉత్సాహంతో పలుమార్లు చిందులు వేశాడు. విరామం అనంతరం మైదానంలోకి వచ్చిన కోహ్లీ డీజే పాటలకు అనుగుణంగా తనదైన శైలిలో డ్యాన్స్ చేస్తుంటే.. అతడితో పాటు విండీస్ వీరుడు క్రిస్ గేల్ కూడా కాలు కదిపాడు. వీరిద్దరూ కలిసి స్టెప్పులు వేయడంతో అభిమానులు సంబురపడిపోయారు.

## ఐదుగురు కొత్త వాళ్లకు చోటు

**న్యూఢిల్లీ:** ప్రతిష్ఠాత్మక మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ కోసం 10 మందితో కూడిన భారత జట్టును గురువారం ప్రకటించారు. ఇందులో దిగ్గజ బాక్సర్ మేరికోంతో సహా సరితా దేవి చోటు దక్కించుకోగా, మంజురాణి, జమునా బోరో, నీరజ్, మంజు బాంబోరియా, నందిని మెగాటోర్నీకి తొలిసారి ఎంపికయ్యారు. అయితే ట్రయల్స్ లేకుండా మేరికోం(51కి), లోవ్లీనా బోర్గోహెయిన్(69కి) ఎంపిక చేయడం ఒకింత అసంతృప్తులకు దారితీసింది. ఎలాంటి ట్రయల్స్ లేకుండా మేరికోంను ఎలా ఎంపిక చేస్తారంటూ రాష్ట్ర యువ బాక్సర్ నిఖత్ జరీన్ సెలెక్షన్ కమిటీ చైర్మన్‌కు లేఖ రాయడం తెలిసిందే. అయితే వీటిని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోని భారత బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్‌ఐ) బాక్సర్లను ఎంపిక చేసింది. అక్టోబర్ 3న రష్యా వేదికగా మొదలయ్యే ప్రపంచ బాక్సింగ్ టోర్నీలో వీరు భారత్ తరఫున బరిలోకి దిగనున్నారు.

## ఆయూష్ అదుర్స్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** ఆరవ తెలంగాణ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో యువ షూటర్లు అదరగొడుతున్నారు. పోటీలకు రెండో రోజైన గురువారం జరిగిన పురుషుల క్లే పీజియన్ స్కీట్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఆయూష్ రుద్రరాజు 46 పాయింట్లతో పసిడి పతకాన్ని దక్కించుకున్నాడు. మునెక్ బత్తుల(43), వికార్ అహ్మద్ షయిఖ్(41) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. పురుషుల జూనియర్ విభాగంలోనూ ఆయూష్(46) స్వర్ణాన్ని ఒడిసిపట్టుకోగా, మునెక్(43)కు రజతం, విరాజ్(34)కు కాంస్యం లభించాయి.

## గిల్ సెంచరీ

**భారత్ 'ఎ' 190/4**

**తరౌబ(ట్రినిడాడ్ అండ్ టోబాగో):** యువ బ్యాట్స్‌మన్ శుభ్‌మన్ గిల్ మరోమారు తన బ్యాటు పవర్ ఏంటో చూపెట్టాడు. నిలకడైన ఆటతీరుతో వెస్టిండీస్ 'ఎ' బౌలర్లను ఎదుర్కొంటూ సూపర్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఓవర్‌నైట్ స్కోరు 23/3తో మూడో రోజు(గురువారం) రెండో ఇన్నింగ్స్‌కు దిగిన భారత్ 'ఎ' గిల్(119 బంతుల్లో 100 నాటౌట్) అజేయ సెంచరీకి తోడు కెప్టెన్ హనుమ విహారి(85 బంతుల్లో 51 నాటౌట్) అర్ధసెంచరీతో లంచ్ విరామ సమయానికి 4 వికెట్లకు 190 పరుగులు చేసింది. నైట్ వాచ్‌మన్ షాబాజ్ నదీమ్(13)తో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన గిల్ సాధికారిక ఇన్నింగ్స్‌తో విజృంభించాడు. దీంతో భారత్ 'ఎ' ప్రస్తుతం 197 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతున్నది. కృష్ణప్ప గౌతమ్ (6/67) ధాటికి వెస్టిండీస్ 'ఎ' తొలి ఇన్నింగ్స్‌లో 194 పరుగులకు కుప్పకూలిన సంగతి తెలిసిందే.

## క్రికెట్‌కు ఆమ్లా వీడ్కోలు



**జొహాన్నెస్‌బర్గ్:** దక్షిణాఫ్రికా స్టార్ బ్యాట్స్‌మన్ హషీమ్ ఆమ్లా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 36 ఏండ్ల ఆమ్లా దక్షిణాఫ్రికా తరఫున ఓవరాల్‌గా 349 మ్యాచ్‌లు ఆడి 18 వేల పైచిలుకు పరుగులు చేశాడు. ఇందులో 55 శతకాలు ఉన్నాయి. ఇటీవల ముగిసిన వన్డే వరల్డ్‌కప్‌లో నిరాశజనక ప్రదర్శన కారణంగానే ఆమ్లా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. సఫారీ స్పీడ్‌స్టర్ డెయిల్ స్టెయిన్ టెస్టు కెరీర్‌కు వీడ్కోలు పలికిన మూడు రోజుల వ్యవధిలో ఆమ్లా అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకోవడంతో ఆ జట్టు అగ్రశ్రేణి ఆటగాళ్ల సేవలు కోల్పోయినట్లెంది. 2004లో భారత్‌పై టెస్టు అరంగేట్రం చేసిన ఆమ్లా.. కెరీర్‌లో 124 మ్యాచ్‌లాడి 46.64 సగటుతో 9282 పరుగులు చేశాడు. అందులో 28 శతకాలు, 4 ద్విశతకాలు ఉన్నాయి. దక్షిణాఫ్రికా తరఫున టెస్టు క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరుతో పాటు ఏకైక ట్రిపుల్ సెంచరీ (311 నాటౌట్; 2012లో ఇంగ్లండ్‌పై) చేసిన ఆటగాడిగా అతడు చరిత్రకెక్కాడు. తొలి టెస్టు ఆడిన దాదాపు నాలుగేండ్ల తర్వాత గానీ వన్డేల్లో చాన్స్ రాని ఆమ్లా అక్కడా దుమ్మురేపాడు. 181 వన్డేల్లో 49.46 సగటుతో 8113 పరుగులు చేశాడు. అందులో 27 సెంచరీలు, 39 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. 44 టీ20ల్లో 1277 పరుగులు చేశాడు. ఈ ఏడాది సొంతగడ్డపై శ్రీలంకతో జరిగిన టెస్టు అతడికి చివరిది కాగా.. వన్డేల్లోనూ ప్రపంచకప్‌లో లంకతో ఆడిన మ్యాచే ఆఖరుది.

నిలకడకు మారుపేరైన ఆమ్లా.. పొట్టి ఫార్మాట్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయినా.. సుదీర్ఘ ఫార్మాట్‌తో పాటు వన్డేల్లో తనదైన ముద్ర వేశాడు. క్రికెట్ పుస్తకాల్లోని క్లాసిక్ షాట్లతో క్రీడాభిమానులను అలరించాడు. ఒక దశలో రికార్డులు సృష్టించడంలో టీమ్ ఇండియా కెప్టెన్ కోహ్లీకి గట్టి పోటీనిచ్చాడు. వన్డేల్లో వేగంగా 2 వేలు, 3 వేలు, 4 వేలు, 5 వేల పరుగులు చేసిన రికార్డు అతడి పేరిటే ఉంది. అయితే ఇటీవల ఫామ్ లేమితో తంటాలు పడుతున్న ఆమ్లా.. వన్డే ప్రపంచకప్‌లో స్థాయికి తగ్గ రీతిలో రాణించలేకపోవడంతో.. ఇక లాభం లేదని అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాడు.

## క్రీడా అవార్డుల కమిటీలో మేరికోం, భూటియా





**న్యూఢిల్లీ:** క్రీడా అవార్డుల కమిటీ ఖరారైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ వస్తున్న ఆటగాళ్లకు, వాళ్లను మెరికల్లాగా తీర్చిదిద్దిన కోచ్‌లకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ఈసారి 12 మందితో కూడిన అవార్డుల కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది లాగే మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినం ఆగస్టు 29ని జాతీయ క్రీడదినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డులను ప్రకటించనున్నారు. కమిటీలో ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ మేరికోంతో పాటు భారత ఫుట్‌బాల్ మాజీ కెప్టెన్ బైచుంగ్ భూటియా ఉన్నారు. 'ఈ యేడాది అవార్డుల ఎంపిక కోసం కొత్తగా ఒక కమిటీ ఎంపిక చేయాలనుకున్నాం. చాలా కమిటీ వల్ల కొత్త సమస్యలు ఏర్పడటంతో పాటు వివాదాలు నెలకొంటున్నాయి' అని క్రీడాశాఖ వర్గాలు పేర్కొన్నాయి. మొత్తం 12 మంది సభ్యులు కలిగిన అవార్డు కమిటీకి సుప్రీం కోర్టు జడ్డి జస్టిస్ ముకుందమ్ శర్మ నాయకత్వం వహించనుండగా, క్రీడాశాఖ కార్యదర్శి రాధేశ్యామ్, సాయ్ డైరెక్టర్ జనరల్ సందీప్ ప్రదాన్, టాప్స్ సీఈవో రాజేశ్ రాజగోపాలన్, మేరికోం, బైచుంగ్ భూటియా, అంజుమ్ చోప్రా, అంజు బాబీ జార్జ్, కమలేశ్ మెహతాతో పాటు రాజేశ్ కల్రా, చారుశర్మ సభ్యులుగా ఉన్నారు. వీరు ప్రతిష్ఠాత్మక రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డుతో పాటు అర్జున, ద్రోణాచార్య, ధ్యాన్‌చంద్ అవార్డులకు ఆటగాళ్లను ఎంపిక చేస్తారు.

## 4 ఓవర్లు.. 18 పరుగులు.. 7 వికెట్లు

**సఫారీ స్పిన్నర్ ప్రపంచ రికార్డు**



అకర్‌మన్

**లండన్:** దక్షిణాఫ్రికా యువ స్పిన్నర్ కొలిన్ అకర్‌మన్ టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇంగ్లండ్ దేశవాళీ టోర్నీ కౌంటీ మ్యాచ్‌లో భాగంగా లిసెస్టర్‌షైర్ తరఫున బరిలో దిగిన అకర్‌మన్ 18 పరుగులిచ్చి 7 వికెట్లు పడగొట్టి రికార్డుల్లోకెక్కాడు. బుధవారం వార్విక్‌షైర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అకర్‌మన్ ఈ ఫీట్ నమోదు చేశాడు. గతం(2011)లో మలేషియా బౌలర్ అరుల్ సుప్పయ్య (6/5) పేరిట ఉన్న రికార్డును అకర్‌మన్ తిరగరాశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన లిసెస్టర్‌షైర్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 189 పరుగులు చేసింది. అనంతరం అకర్‌మన్ విజృంభించడంతో వార్విక్‌షైర్ జట్టు 134 పరుగులకే కుప్పకూలింది. ఒక దశలో 114/2తో పటిష్ఠంగా కనిపించిన ఆ జట్టు 20 పరుగుల వ్యవధిలో చివరి 8 వికెట్లు కోల్పోయి ఓటమి పాలైంది.

# భారత ఆర్చరీ సంఘంపై సస్పెన్షన్

## ప్రపంచ ఆర్చరీ కఠిన నిర్ణయం




**కోల్‌కతా:** నిబంధనలకు వ్యతిరేకంగా ఇద్దరు అధ్యక్షులను ఎన్నుకున్న భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ)ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రపంచ ఆర్చరీ (డబ్ల్యూఏ) గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. డబ్ల్యూఏ విడుదల చేసిన మార్గదర్శకాలకు తిలోదకాలు వదిలి రెండు వేర్వేరు గవర్నింగ్ బాడీలను ఎన్నుకోవడం వల్లే సస్పెన్షన్ విధించినట్లు పేర్కొంది. ఈ నెలాఖరులోగా వివాదానికి ముగింపు పలకాలని లేకుంటే పరిణామాలు ఇంకా తీవ్రంగా ఉంటాయని హెచ్చరించింది. ఈ ఉత్తర్వులు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. 'భారత ఆర్చరీ సంఘాన్ని సస్పెండ్ చేయాలని జూన్‌లో డబ్ల్యూఏ తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేస్తున్నాం' అని ప్రపంచ ఆర్చరీ కార్యదర్శి టామ్ డైలెన్ తెలిపారు. జూలై నెలాఖరుకల్లా పరిస్థితిని చక్కదిద్దాలని గతంలోనే డబ్ల్యూఏ ఆదేశించింది. అయినా పట్టించుకోని భారత ఆర్చరీ సంఘం తమ స్వప్రయోజనాల కోసం ఆర్చర్ల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది.

### అసలేంటీ వివాదం..!

ఈ ఏడాది జూన్ 9న భారత ఆర్చరీ సంఘం రెండు వేర్వేరు ఎన్నికలు నిర్వహించింది. అందులో ఒకటి ఢిల్లీ వేదికగా జరగ్గా.. రెండోదానికి చండీగఢ్ కేంద్రంగా నిలిచింది. వాటిలో అర్జున్ ముండా, బీవీ పాపారావు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. అర్జున్ ముండాకు దేశంలోని 20 రాష్ట్రాల మద్దతు ఉండగా.. పాపారావుకు 10 రాష్ట్రాల ఆర్చరీ సంఘాలు సపోర్ట్‌గా నిలిచాయి. ఈ అంశంపై త్వరగా తేల్చుకోవాలని గతంలోనే డబ్ల్యూఏ హెచ్చరిస్తే.. కొంత గడువు ఇస్తే పరిస్థితి చక్కదిద్దుకుంటామని భారత ఆర్చరీ సంఘం తెలిపింది. ఆ ఇచ్చిన గడువు పూర్తైనా ఇప్పటి వరకు ఎలాంటి ముందడుగు పడకపోవడంతో ఆగ్రహించిన డబ్ల్యూఏ సస్పెన్షన్ వేటు వేసింది.

### నష్టమెవరికి..?

అధికారులు చేసిన తప్పిదానికి యువ ఆర్చర్లు భవిష్యత్తు అంధకారంగా మారింది. సస్పెన్షన్ కారణంగా ఈ ఏడాది నవంబర్‌లో బ్యాంకాక్ వేదికగా జరుగనున్న ఆసియా చాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు పాల్గొనడంపై సందేహాలు నెలకొన్నాయి. టోక్యో ఒలింపిక్స్ (2020) బెర్తులు దక్కించుకోవాలంటే మన వాళ్లకు ఈ టోర్నీ ఎంతో ముఖ్యం. ఇలాంటి దశలో ఆటేతర విషయాల కారణంగా ఆర్చర్లు ఇబ్బందులు పడాల్సి రానుంది. ఈ టోర్నీలో వ్యక్తిగత విభాగంలో పాల్గొనే అవకాశమున్నా.. టీమ్ విభాగంలో బరిలో దిగాలంటే మాత్రం సస్పెన్షన్ తీవ్ర ఇబ్బందికి గురిచేయనుంది. పురుషుల విభాగంలో ఇప్పటికే ముగ్గురు భారత ఆర్చర్లు టోక్యో ఒలింపిక్స్ బెర్తులు దక్కించుకోగా.. మహిళల విభాగంలో ఇంతవరకూ ఒక్కరు కూడా అర్హత సాధించలేదు. 'ఈ నెలాఖరులోగానైనా పరిష్కారం చూపకపోతే.. త్వరలో జరుగనున్న ఆసియా చాంపియన్‌షిప్, పారా ఆసియా చాంపియన్‌షిప్‌ల్లో భారత ఆర్చర్లకు అవకాశమివ్వాలా లేదా అనే అంశంపై దృష్టి పెట్టాల్సి ఉంటుంది' అని టామ్ పేర్కొన్నారు.


## కింగ్స్ ఎలెవన్‌కు హెస్సెన్ గుడ్‌బై



**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా చీఫ్ కోచ్ పదవి ఆశిస్తున్న న్యూజిలాండ్ మాజీ కోచ్ మైక్ హెస్సెన్ ఐపీఎల్‌లో కింగ్స్ ఎలెవన్ పంజాబ్ ఫ్రాంచైజీ నుంచి తప్పుకున్నాడు. ఐపీఎల్ 12వ సీజన్‌లో పంజాబ్ కోచ్‌గా వ్యవహరించిన హెస్సెన్ పది నెలలు మాత్రమే కింగ్స్‌తో కలిసి ప్రయాణం చేశాడు. 'పంజాబ్‌తో పనిచేసినంత కాలం చాలా ఎంజాయ్ చేశా. ఈ అవకాశం ఇచ్చిన జట్టు యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ ఏడాది కింగ్స్ ప్రదర్శన ఆశించినంత గొప్పగా లేదు. కానీ ఒక్కటి మాత్ర నిజం. మీరు సక్సెస్ అయ్యే సమయం ఎంతో దూరంలో లేదు'అని హెస్సెన్ గురువారం ట్విట్టర్‌లో పేర్కొన్నాడు. 2012 నుంచి 2018 వరకు న్యూజిలాండ్ జాతీయ జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన హెస్సెన్ ఆ జట్టును విజయపథంలో నడిపించాడు.

# టైటాన్స్‌కు తప్పని నిరీక్షణ

- బెంగళూరు బుల్స్ చేతిలో పరాజయం



**పాట్నా:** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ పరాజయాల పరంపర కొనసాగుతున్నది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో బోణీ కొట్టలేకపోయిన టైటాన్స్ ఆరో మ్యాచ్‌లోనూ ఓటమి పాలైంది. లీగ్‌లో తొలి విజయం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్న టైటాన్స్ గురువారం జరిగిన మ్యాచ్‌లో 26-47తో బెంగళూరు బుల్స్ చేతిలో ఓటమి పాలైంది. స్టార్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ 19 సార్లు రైడ్‌కు వెళ్లి 11 పాయింట్లు సాధించగా.. ట్యాక్లింగ్‌లో విశాల్ భరద్వాజ్ (6 పాయింట్లు) ఫర్వాలేదనిపించాడు. బుల్స్ తరఫున పవన్ షెరావత్ (17 పాయింట్లు), రోహిత్ కుమార్ (8 పాయింట్లు) అదరగొట్టారు. మ్యాచ్ ఆరంభంలోనే ఆధిక్యం దక్కినా.. దాన్ని వినియోగించుకోలేకపోయిన టైటాన్స్ తగిన మూల్యం చెల్లించుకుంది. బుల్స్‌కు ఇది వరుసగా మూడో విజయం కాగా.. టైటాన్స్‌కు ఐదో పరాజయం.

### పవన్ పవర్..

తొలి నిమిషంలోనే రెండు రైడ్ పాయింట్లు సాధించిన రోహిత్ బెంగళూరుకు మంచి ఆరంభం అందించాడు. మొదట్లో సిద్ధార్థ్ వరుసగా 5 పాయింట్లు సాధించడంతో టైటాన్స్ 5-3తో ఆధిక్యంలో నిలిచింది. ప్రత్యర్థి కోర్టులో ఇద్దరు ఆటగాళ్లే ఉన్న సమయంలో సునాయాసంగా ఆలౌట్ చేసే చాన్స్‌ను టైటాన్స్ చేజార్చుకుంది. సిద్ధార్థ్‌ను సూపర్ ట్యాకిల్ ద్వారా పట్టేసిన బెంగళూరు డిఫెండర్లు ఆ తర్వాత ఏ దశలోనూ వెనుదిరిగి చూసుకోలేదు. టైటాన్స్‌ను రెండు సార్లు ఆలౌట్ చేయడంతో పాటు మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. చూస్తుండగానే బుల్స్ 10-6, 17-9తో ముందంజ వేసుకుంటూ వెళ్లింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి టైటాన్స్ 14-21తో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ పూర్తి ఆధిపత్యం కనబర్చిన బుల్స్‌కు టైటాన్స్ ఏమాత్రం పోటీనివ్వలేకపోయింది. రెండో సగంలో రెచ్చిపోయిన పవన్ వరుస పాయింట్లతో ఆధిక్యాన్ని అంతకంతకు పెంచుకుంటూ పోవడంతో.. బెంగళూరు అలవోక విజయం సొంతం చేసుకుంది.

# వాణిజ్య

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 37,327 | 11,032 |
| 637 | 177 |

ముడి చమురు (బ్రెంట్) 57.57 డాలర్లు

**బంగారం ధరలు**

| న్యూఢిల్లీ (రూ.లలో) | |
|---|---|
| 24 క్యారెట్లు | 38,470 |
| 22 క్యారెట్లు | 38,300 |
| వెండి (కిలో) | 44,300 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 67.90 | 73.40 |
| యూరో | 76.00 | 82.50 |
| బహ్రెయిన్ దినార్ | 177.60 | 191.60 |
| కువైట్ దినార్ | 223.00 | 235.00 |
| సౌదీ రియాల్ | 17.70 | 19.50 |
| యూఏఈ దిర్హామ్ | 18.20 | 19.90 |

## వండర్‌లా లాభాల్లో వృద్ధి

**బెంగళూరు, ఆగస్టు 8:** ప్రముఖ అమ్యూజ్‌మెంట్ పార్కుల నిర్వహణ సంస్థ వండర్‌లా హాలీడేస్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికిగాను పన్నుల చెల్లించిన తర్వాత రూ.42.03 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.32.97 కోట్లతో పోలిస్తే 27 శాతం అధికం. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.106.11 కోట్ల నుంచి 14 శాతం పెరిగి రూ.121.30 కోట్లకు చేరుకున్నది.



## ఆకాశమే హద్దుగా పసిడి

- చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న ధర
- రూ.550 పెరిగి రూ.38,470 పలికిన బంగారం
- రూ.44 వేలు దాటిన కిలో వెండి



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** పసిడి రికార్డుల పరంపర కొనసాగుతున్నది. రోజుకొక చారిత్రక స్థాయికి చేరుకుంటున్న ధరలు గురువారం ఆకాశమే హద్దుగా దూసుకుపోయాయి. అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధం కొనసాగుతుండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడం, దేశీయంగా ఆభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గుచూపడంతో బంగారం ధర రూ.38 వేల మార్క్‌ను దాటింది. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పసిడి ధర మరో రూ.550 అందుకొని రూ.38,470కి చేరుకున్నది. బుధవారం రూ.1,113 పెరిగిన బంగారం ధర ఆ మరుసటి రోజు కలుపుకొని రూ.1,663 అధికమైనట్లు అయింది. బంగారంతోపాటు వెండి కూడా మరింత పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి లభించిన కొనుగోళ్ల మద్దతుతో కిలో వెండి రూ.630 అధికమై రూ.44,300కి చేరింది.

### గ్లోబల్ మార్కెట్లోనూ అదే తీరు..

అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు 1,500 డాలర్లకు చేరుకోవడం వల్లనే దేశీయంగా భారీగా పుంజుకుంటున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. యూఎస్-చైనాల ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు పసిడి వైపు మొగ్గుచూపడంతో గ్లోబల్ మార్కెట్లో గోల్డ్ ధర ఆరేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకుందున్నారు. వీటికితోడు దేశీయ ఆర్థిక పరిస్థితులు నిరాశాజనకంగా ఉండటం కూడా ధరలు పెరుగడానికి పరోక్షంగా కారణమైందని జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్ హరీష్ వీ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను రిజర్వు బ్యాంక్ ప్రకటించిన మూడో ద్వైమాసిక సమీక్షలో భారత వృద్ధిరేటును 7 శాతం నుంచి 6.9 శాతానికి తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయం పెట్టుబడిదారుల్లో ఆందోళనను పెంచింది. న్యూయార్క్ బులియన్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,497.40 డాలర్లకు పెరుగగా, వెండి 17.16 డాలర్ల వద్ద నిలిచింది.

# పోటెత్తిన లాభాలు

## భారీగా పుంజుకున్న స్టాక్ మార్కెట్లు.. సెన్సెక్స్ 637, నిఫ్టీ 177 పాయింట్లు వృద్ధి

- ఎఫ్‌పీఐలపై సర్‌చార్జీ ఉపసంహరణ అంచనాలే కారణం
- ఆకట్టుకున్న బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లు

**ముంబై, ఆగస్టు 8:** దేశీయ స్టాక్ మార్కెట్లలో గురువారం లాభాల వరద పారింది. 11 వారాల గరిష్ఠ స్థాయిలో సూచీలు పుంజుకున్నాయి. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ)పై అధిక సర్‌చార్జీని కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసే వీలుందన్న అంచనాల మధ్య మార్కెట్లకు పెట్టుబడులు పోటెత్తాయి. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేకుండా అన్ని రంగాల్లో కొనుగోళ్లు పెద్ద ఎత్తున నమోదు కావడంతో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 636.86 పాయింట్లు లేదా 1.74 శాతం ఎగబాకి తిరిగి 37 వేల స్థాయిని అధిరోహిస్తూ 37,327.36 వద్దకు చేరింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌ఎస్‌ఈ) కీలక సూచీ నిఫ్టీ సైతం 176.95 పాయింట్లు లేదా 1.63 శాతం ఎగిసి మళ్లీ 11 వేల మార్క్‌ను అధిగమిస్తూ 11,032.45 స్థాయిని తాకింది. మే నెల 20 తర్వాత ఈ స్థాయి లాభాలు నమోదు కావడం ఇదే తొలిసారి. ఇంధనం, బ్యాంకింగ్, ఐటీ రంగాల షేర్లు మదుపరులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను గత నెల 5న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగానే ఎఫ్‌పీఐలపై సర్‌చార్జీని ప్రతిపాదించారు. దీంతో నాటి నుంచి ఎఫ్‌పీఐలు భారతీయ క్యాపిటల్ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటూనే ఉన్నారు. దీంతో సూచీలు భీకర నష్టాలకు గురవుతున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో బడ్జెట్‌లో ప్రతిపాదించిన సర్‌చార్జీతోపాటు దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ) అంశాన్నీ పునఃసమీక్షించనున్నారన్న వార్తలు మార్కెట్ సెంటిమెంట్‌ను ఒక్కసారిగా బలపరిచాయి.



### గ్లోబల్ మార్కెట్లలోనూ జోష్

ఆసియా, ఐరోపా దేశాల స్టాక్ మార్కెట్లూ లాభాల్లో ముగిశాయి. ఊహించనివిధంగా చైనా ఎగుమతుల్లో వృద్ధి చోటుచేసుకోవడంతో ఆసియాలోని ప్రధాన స్టాక్ మార్కెట్లైన చైనా, హాంకాంగ్, దక్షిణ కొరియా, జపాన్ సూచీలు లాభాలను అందుకున్నాయి. ఐరోపాలోని స్టాక్ మార్కెట్లూ పెరుగగా, ప్రధాన సూచీలైన జర్మనీ, ఫ్రాన్స్, బ్రిటన్ మార్కెట్లు లాభాల్లో కదలాడాయి. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం మధ్య గ్లోబల్ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న విషయం తెలిసిందే. అయినప్పటికీ చైనా ఎగుమతులు పుంజుకోవడం మార్కెట్ వర్గాలనే ఆశ్చర్యపరుస్తున్నది.

### బ్లూచిప్ షేర్లకు డిమాండ్

భారీ సంస్థల షేర్ల కొనుగోళ్లకు మదుపరులు అధిక ప్రాధాన్యతనిచ్చారు. దీంతో హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఆటో, రిలయన్స్ ఇండస్ట్రీస్, హీరో మోటోకార్ప్, యెస్ బ్యాంక్, మారుతి సుజుకీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్ల విలువ 6.43 శాతం వరకు పెరిగింది. హెచ్‌సీఎల్ టెక్ మార్కెట్ విలువ బీఎస్‌ఈలో రూ.8,915.25 కోట్లు ఎగిసి రూ.1,47,567.25 కోట్లకు చేరింది. స్థూలంగా ఇంధనం, ఆటో, ఐటీ, టెక్నాలజీ, చమురు, గ్యాస్, టెలికం, రియల్టీ, బ్యాంకింగ్, విద్యుత్, ఫైనాన్స్, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, యుటిలిటీస్ రంగాల షేర్లు 3.15 శాతం మేర లాభపడ్డాయి. మరోవైపు టాటా స్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌ల షేర్లు 3.77 శాతం మేర నష్టపోయాయి. బీఎస్‌ఈ మిడ్-క్యాప్, స్మాల్-క్యాప్ సూచీలు 0.74 శాతం వరకు పెరిగాయి.

## ఎఫ్‌పీఐలపై సర్‌చార్జ్ ఎత్తివేత!

- ఆ దిశగా ఆలోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్న చందంగా తయారైంది కేంద్ర ప్రభుత్వం చర్యలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు ఉన్న పన్ను కలిగిన ఆదాయంపై సర్‌చార్జ్‌ని 15 శాతం నుంచి 25 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించడంతో విదేశీ పెట్టుబడిదారుల్లో ఆందోళన తీవ్రతరమైంది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి భారీగా నిధులను తరలించుకుపోయారు. ఈ నిధుల ఉపసంహరణకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతో రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం.. ఈ సర్‌చార్జ్‌ని ఎత్తివేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తున్నది. గడిచిన వారం రోజుల్లో ఎఫ్‌పీఐలు..దేశీయ డెబిట్, ఈక్విటీ మార్కెట్ల నుంచి రూ.2,881.10 కోట్ల పెట్టుబడులను వెనక్కితీసుకున్నారు. అలాగే రూ.5 కోట్లకు పైగా వార్షిక ఆదాయం కలిగిన వారిపై సర్‌చార్జ్‌ను 15 శాతం నుంచి 37 శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సర్‌చార్జ్ విధింపుపై త్వరలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లతో సమావేశం కాబోతున్నట్లు, వారి అభిప్రాయాల ఆధారంగా కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు ఇటీవల నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

## శ్రీనివాస ఫార్మ్స్‌లోకి ఐఎఫ్‌సీ 130 కోట్ల పెట్టుబడి

**హైదరాబాద్, ఆగస్టు 8:** ప్రపంచబ్యాంక్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఫైనాన్స్ కార్పొరేషన్(ఐఎఫ్‌సీ)..శ్రీనివాసా ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రూ.130 కోట్లు(18.75 మిలియన్ డాలర్లు) పెట్టుబడులు పెట్టబోతున్నది. దీంతో కంపెనీలో ఐఎఫ్‌సీకి 20 శాతం వాటా లభించనున్నది. ఈ పెట్టుబడుల్లో ఇప్పటికే ఐఎఫ్‌సీ రూ.65 కోట్లు ఇన్వెస్ట్ చేయగా..రెండో విడుత ఈ ఏడాది చివరినాటికి నిధులు రావచ్చునని శ్రీనివాస ఫార్మ్స్ వైస్ చైర్మన్, ఎండీ సురేశ్ చిట్టూరి తెలిపారు. బ్రాయిలర్ వ్యాపారంలో అగ్రగామిగా వెలుగొందుతున్న శ్రీనివాస గ్రూపు..త్వరలో సోయా, ఫీడ్, కాంట్రాక్ట్ ఫార్మింగ్, చికెన్ ప్రాసెసింగ్, రిటైల్ రంగంలోకి అడుగు పెట్టబోతున్నట్లు ఆయన ప్రకటించారు. వచ్చే రెండు నుంచి మూడేండ్లకాలంలో ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపు చేయడానికి రూ.300 కోట్ల నిధులను ఖర్చు చేయనున్నట్లు చెప్పారు.

## క్విక్ రైడ్ విస్తరణ

**హైదరాబాద్, ఆగస్టు 8:** కార్, బైకు పూలింగ్ అప్లికేషన్ సంస్థ క్విక్ రైడ్ దూసుకుపోతున్నది. సేవలు ఆరంభించిన నాలుగేండ్లలో 20 లక్షల మంది వినియోగదారులను ఆకట్టుకున్నట్లు కంపెనీ కో-ఫౌండర్, సీఈవో కేఎన్ఎం రావు తెలిపారు. ప్రస్తుతం సంస్థ హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, పుణె, ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్, కొచి, త్రివేండ్రంలలో సేవలు అందిస్తుండగా ఈ ఏడాది చివరి నాటికి మరో నాలుగు నగరాలకు విస్తరించనున్నట్లు చెప్పారు. ఈ 20 లక్షల మంది కస్టమర్ల ద్వారా 3 వేల టన్నుల వాయుకాలుష్యాన్ని నియంత్రించినట్లు చెప్పారు.

# ఉపాధి కల్పనలో తెలంగాణ టాప్!

- సిడ్బీ డిప్యూటీ ఎండీ మనోజ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉపాధి అవకాశాలు కల్పించడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రభాగాన ఉన్నదని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సిడ్బీ) డిప్యూటీ ఎండీ మనోజ్‌మిట్టల్ పేర్కొన్నారు. నూతన రాష్ట్రం ఏర్పడిన ఐదేండ్లలోనే ఈ ఘనతను సాధించిందని తెలిపారు. ఉపాధి కల్పించడంలో 10.5 శాతం వృద్ధితో తెలంగాణ ముందుందని వివరించారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో ఎంఎస్‌ఎంఈ రంగానికి పెట్టుబడుల అవకాశాలు, సవాళ్లు అనే అంశంపై రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐ సమావేశ మందిరంలో గురువారం సదస్సు నిర్వహించారు. వివిధ అంశాలపై ప్యానల్ చర్చల సందర్భంగా మనోజ్‌మిట్టల్ మాట్లాడుతూ.. కొత్త రాష్ట్రం తెలంగాణ మంచి పురోగతిని సాధిస్తున్నందుకు సంతోషంగా ఉన్నదని, ఎంఎస్‌ఎంఈ రంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని తెలిపారు. రాష్ట్రం నుంచి రూ.40 వేల కోట్ల ఎగుమతులు జరుగుతుండగా.. ఇందులో 60 శాతం ఎంఎస్‌ఎంఈల ద్వారానే వస్తున్నాయని తెలిపారు. సిడ్బీ ఎంఎస్‌ఎంఈలకు రుణాలు ఇవ్వడంలో తెలంగాణ రాష్ట్రంలో నిర్దేశించిన లక్ష్యాలను సాధించామని తెలిపారు. ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలకు నిధుల సమస్య లేదని, సమాచార లోపం ఉన్నదని ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ సుబ్రతాదాస్ పేర్కొన్నారు. ఎఫ్‌టీసీసీఐ సంస్థ సమాచార వ్యాప్తికి కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దేశంలో సాధ్యం కావాలంటే ఎంఎస్‌ఎంఈలు వృద్ధి చెందడం ద్వారానే సాధ్యమని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు కరుణేంద్రజాస్తి పేర్కొన్నారు. సదస్సులో ఎస్బీఐ, ఆంధ్రాబ్యాంకు, సిడ్బీ, హెచ్‌డీఎఫ్‌సీ, సిండికేట్ బ్యాంకు, కెనరాబ్యాంకు, కార్పొరేట్‌బ్యాంకు, యాక్సిస్‌బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి సదస్సుకు హాజరైన వ్యాపారుల సందేహాలను తీర్చాయి. కార్యక్రమంలో ఎఫ్‌టీసీసీఐ బ్యాంకింగ్ ఫైనాన్స్ చైర్మన్ కృష్ణకుమార్ మహేశ్వరి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీనియర్ ఉపాధ్యక్షుడు మధుసూదన్ హెగ్డే, ఎస్బీఐ డిప్యూటీ జీఎం దేబాశిష్ మిశ్రా, ఎఫ్‌టీసీసీఐ సీనియర్ ఉపాధ్యక్షుడు రమాకాంత్ ఇనాని తదితరులు పాల్గొన్నారు.



గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సిడ్బీ డిప్యూటీ ఎండీ మనోజ్ మిట్టల్ . చిత్రంలో ఆర్బీఐ ప్రాంతీయ డైరెక్టర్ సుబ్రతా దాస్, ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్ కరుణేంద్ర జాస్తి, తదితరులు.




## బిగ్ బజార్ మహాబచత్

- రేపటి నుంచి ప్రారంభం
- నేడు దివ్యాంగుల షాపింగ్ కోసం ప్రత్యేక సదుపాయాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** బిగ్ బజార్ మెగా షాపింగ్ వేడుక మళ్లీ వచ్చేసింది. '6 డేస్ మహాబచత్' పేరుతో శనివారం నుంచి పంద్రాగస్టు వరకు ఇది జరుగుతున్నది. ఇందులో భాగంగా అన్ని రకాల వస్తువులు, ఉత్పత్తులపై గొప్ప రాయితీలను అందిస్తున్నామని గురువారం ఓ ప్రకటనలో బిగ్ బజార్ యాజమాన్యం ఫ్యూచర్ గ్రూప్ స్పష్టం చేసింది. ఆహార, పప్పుదినుసులు, ఫ్యాషన్ దుస్తులు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్‌పై ఆకర్షణీయమైన డిస్కౌంట్లుంటాయని తెలిపింది. ఫ్యూచర్ పే వ్యాలెట్, పేటీఎంల ద్వారా చేసే రూ.3 వేల విలువైన షాపింగ్‌పై రూ.1,200 వరకు, రూ.6 వేల షాపింగ్‌పై రూ.2,400 వరకు క్యాష్ బ్యాక్ ఉంటుందని చెప్పింది. రూ.25 వేలు ఆపై కొనుగోళ్లపై రూ.2,100 క్యాష్‌బ్యాక్ ఉంటుందన్నది. అలాగే ఎస్బీఐ క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చేసే కొనుగోళ్లపై 7 శాతం తగ్గింపు ఉంటుందని పేర్కొంది. అంతేగాక బైవన్ గెట్‌వన్ ఆఫర్లు ఉండనున్నాయి. ఈ నెల 10 నుంచి 15 వరకు 6 రోజుల పాటు ఈ ఆఫర్లు లభిస్తాయని ప్రకటించింది. కాగా, శుక్రవారం తమ సభ్యుల కోసం స్పెషల్ ప్రివ్యూను దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బిగ్ బజార్ స్టోర్లలో సంస్థ ఏర్పాటు చేస్తున్నది. వయోధికులు, దివ్యాంగుల కోసమే ఈ ప్రత్యేక షాపింగ్ సదుపాయమన్న బిగ్ బజార్.. ఈ సందర్భంగా వ్యక్తిగత సహాయకులు, వీల్‌చైర్లు, ఇతరత్రా సదుపాయాలు వారికి కల్పిస్తామన్నది.

## సెయిల్ చైర్మన్‌పై దాడి

- ఇద్దరు అరెస్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సెయిల్) చైర్మన్ అనిల్ కుమార్ చౌధరిపై దాడి జరిగింది. దక్షిణ ఢిల్లీలోని హజ్ ఖాస్‌లో బుధవారం రాత్రి కొందరు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. రోడ్డుపై జరిగిన గొడవగా దీన్ని అనుమానిస్తున్న పోలీసులు ఘటనాస్థలి వద్దే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు గురువారం తెలిపారు. ఉత్తమ్ నగర్‌కు చెందిన అమర్‌దీప్, ద్వారక నివాసి లలిత్‌లను అరెస్టు చేశామని, ఆ సమయంలో వీరిరువురు మద్యం సేవించి ఉన్నట్లు చెప్పారు. చౌధరి కారును మరో వాహనం వచ్చి ఢీ కొట్టిందని, దీంతో చౌధరి, కారు డ్రైవర్ దిగిరావడంతో సదరు వాహనంలోని నలుగురు దాడికి దిగినట్లు పోలీసులు వివరించారు. ఒకరు డ్రైవర్ గొంతును పట్టుకోగా, మిగతా ముగ్గురు చౌధరిపై దాడి చేసినట్లు తమ విచారణలో తేలిందని దక్షిణ ఢిల్లీ డిప్యూటీ పోలీస్ కమిషనర్ విజయ్ కుమార్ వెల్లడించారు. రాత్రి సుమారు 10:50 సమయంలో డిఫెన్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బంది పెట్రోలింగ్ చేస్తుండగా, ఇద్దరు-ముగ్గురు వ్యక్తులు కలిసి ఒకరిని పట్టుకుని కొడుతుండటాన్ని గమనించారన్నారు. దీంతో అక్కడికి వెళ్లిన పోలీసులు.. ఇద్దరిని అరెస్టు చేసి, వారు ప్రయాణించిన వాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. ఆ తర్వాత బాధిత వ్యక్తిని సెయిల్ చైర్మన్ చౌధరిగా గుర్తించామని పేర్కొన్నారు. ఎయిమ్స్ ట్రౌమా సెంటర్‌లో చికిత్స పొందిన అనంతరం చౌధరి డిశ్చార్జ్ అయినట్లు తెలిపారు. కాగా, ఆఫీసు నుంచి ఇంటికి వెళ్తుండగా ఈ దురదృష్టకరమైన ఘటన జరిగిందని సెయిల్ ఓ ప్రకటనలో తెలిపింది. 'రాత్రి 10:30 సమయంలో సంభవించిన ఈ ఉదంతంలో చౌధరి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన తల, మెడ, భుజాలు, మోచేతులు, కాళ్లపై ఇనుపరాడ్లతో బలంగా కొట్టారు. డ్రైవర్‌ను మాత్రం క్షేమంగానే విడిచిపెట్టారు. దుండగుల వద్ద కత్తులు కూడా ఉన్నాయి' అని సెయిల్ స్పష్టం చేసింది. మరోవైపు తనను చంపేందుకు జరిగిన దాడిగానే దీన్ని చౌధరి అభివర్ణించారు. 'ఈ ఊహించని పరిణామంతో నేను దిగ్భ్రాంతికి గురయ్యాను. సమయానికి పోలీసులు రావడంతో బతికాను' అని చౌధరి అన్నారు. ఐపీసీ 307, 34 సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల్లో అమర్‌దీప్ ఓ కూలీ అని, లలిత్‌పై కొన్ని దొంగతనాల కేసులున్నాయని చెప్పారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## హైదరాబాద్‌లో గోల్డ్‌మెడల్ ఫ్యాన్ల ప్లాంట్

- రూ.125 కోట్లతో ఏర్పాటు చేస్తున్న సంస్థ

**హైదరాబాద్, ఆగస్టు 8:** ప్రముఖ ఎలక్ట్రికల్ పరికరాల తయారీ సంస్థ గోల్డ్‌మెట్ ఎలక్ట్రికల్స్.. హైదరాబాద్‌లో ఫ్యాన్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించింది. రూ.125 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ యూనిట్ రెండు నుంచి మూడేండ్ల కాలంలో అందుబాటులోకి రానున్నది. ప్రస్తుతానికి ఈ యూనిట్‌లో ఫ్యాన్లను మాత్రమే తయారుచేయబోతున్నట్లు, ఆ తర్వాతికాలంలో గృహోపకరణాలు కూడా ఇక్కడే తయారు చేయాలనుకుంటున్నట్లు కంపెనీ డైరెక్టర్ ప్రవీణ్ జైన్ తెలిపారు. ఈ యూనిట్ వల్ల 150 మందికి ఉపాధి అవకాశాలు లభించనుందన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో 40 శాతం వృద్ధితో రూ.1,400 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిన సంస్థ..ఈ ఏడాది చివరినాటికి ఇది రూ.2 వేల కోట్లకు చేరుకోనున్నదన్నారు. దేశవ్యాప్తంగా అమ్ముడవుతున్న ఎలక్ట్రిక్ పరికరాల కంపెనీ వాటా 15 నుంచి 18 శాతంగా ఉన్నది. ప్రస్తుతం సంస్థకు విజయవాడ, ముంబై, రాజస్థాన్‌లలో ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. నిలకడైన వృద్ధిని సాధించిన తర్వాతనే సంస్థ ఐపీవోకి వచ్చే అవకాశం ఉన్నదన్న ఆయన.. రెండేండ్ల తర్వాత దీనిగురించ ఆలోచిస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

# రూ.లక్ష కోట్లు కావాలి

- జీడీపీ, పెట్టుబడులు పుంజుకోవాలంటే అవసరం
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పరిశ్రమ వర్గాలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 8:** పడకేసిన ప్రగతిని పరుగులు పెట్టించేందుకు రూ.లక్ష కోట్ల ఉద్దీపనాలను ఆశిస్తున్నది పరిశ్రమ. గతి తప్పిన జీడీపీని గాడిలో పెట్టేందుకు ఈ సాయం అవసరమని కేంద్రానికి విన్నవించింది. దేశ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజపు ఛాయలను తరిమికొట్టేందుకు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్.. వ్యాపార, పారిశ్రామిక వర్గాలతో గురువారం నార్త్‌బ్లాక్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రస్తుత పరిస్థితులు, వృద్ధి కోసం చేపట్టాల్సిన చర్యలను సమీక్షించారు. ఈ క్రమంలోనే జీడీపీ తిరిగి పట్టాలెక్కాలంటే రూ.లక్ష కోట్లకుపైగా ఉద్దీపన ప్యాకేజీ అవసరమని పరిశ్రమ వర్గాలు స్పష్టం చేశాయి. అప్పుడే పెట్టుబడులు పుంజుకుంటాయని తెలిపాయి. కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్, ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్, అసోచామ్ అధ్యక్షుడు బీకే గోయెంకా, ఫిక్కీ అధ్యక్షుడు సందీప్ సోమని, సీఐఐ ఉపాధ్యక్షుడు టీవీ నరేంద్రన్‌లతోపాటు జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్, పిరమల్ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ అజయ్ పిరమల్, అపోలో హాస్పిటల్స్ ఎండీ సునీతా రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం దేశ, విదేశీ మార్కెట్లలో చోటుచేసుకున్న మందగమనం నేపథ్యంలో సవాళ్లు, సమస్యల పరిష్కారానికి సత్వర మార్గాలు అవసరమని ఈ సమావేశంలో గోయెంకా అభిప్రాయపడ్డారు. 'దేశ ఆర్థిక వ్యవస్థకు ఇప్పుడు ఉద్దీపనాలు అవసరం. రూ.లక్ష కోట్లకుపైగా ప్యాకేజీని కోరాం' అని గోయెంకా చెప్పారు. దాదాపు మూడు గంటలు జరిగిన ఈ సమావేశంలో పరిశ్రమ ప్రగతికి, వృద్ధిరేటు పునరుద్ధరణకు త్వరలోనే చర్యలు తీసుకుంటామన్న భరోసా మంత్రి సీతారామన్ నుంచి వచ్చినట్లు వ్యాపార, పారిశ్రామికవేత్తలు వెల్లడించారు. 'పరిశ్రమ ఇబ్బందులను మంత్రికి వివరించాం. సాయాన్ని కోరాం. ఇందుకు ఆమె సానుకూలంగా స్పందించారు' అని జిందాల్ చెప్పారు. ఉక్కు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)లు, ఆటోమొబైల్ తదితర రంగాల్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులతో పరిశ్రమ కష్టాలను చవిచూస్తున్నదని మంత్రికి వివరించామన్నారు.

### బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదు

పరిశ్రమలకు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకు లు అనాసక్తిని, అయిష్టతను చూపుతున్నాయని అజయ్ పిరామల్ ఈ సందర్భంగా తెలిపారు. బ్యాంకుల్లో నగదు కొరత లేదన్న ఆయన బ్యాంకులకే రుణాలు ఇవ్వడం ఇష్టం లేదని అన్నారు. ఈ క్రమంలో రుణ లభ్యత కరువైందని, ఎన్‌బీఎఫ్‌సీలు ఆర్థిక సంక్షోభంలో పడటం పరిస్థితిని మరింత దిగజార్చిందని మంత్రికి ఆయన వివరించారు. కాగా, అమ్మకాలు లేక దిగాలుపడిన ఆటో రంగాన్ని ఆదుకోవాలంటూ ఆ పరిశ్రమ వర్గాలు కేంద్ర ప్రభుత్వాన్ని బుధవారం కోరిన విషయం తెలిసిందే. జీఎస్టీ తగ్గింపుసహా ఉద్దీపనాలను అందివ్వాలంటూ సీతారామన్‌కు విజ్ఞప్తి చేశాయి. మునుపెన్నడూ లేని విధంగా వాహన విక్రయాలు క్షీణిస్తున్న నేపథ్యంలో మంత్రితో ఆటో రంగ పెద్దలు సమావేశమయ్యారు. మారుతి సుజుకీ చైర్మన్ ఆర్‌సీ భార్గవ, భారతీయ ఆటోమొబైల్ తయారీదారుల సమాజం (ఎస్ఐఏఎం) అధ్యక్షుడు రాజన్ వధేరా, భారతీయ ఆటోమోటివ్ కంపోనెంట్ తయారీదారుల సంఘం (ఏసీఎంఏఐ) అధ్యక్షుడు రామ్ వెంకట్రమణి, ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య సంఘం (ఎఫ్‌ఏడీఏ) ప్రతినిధులు సీతారామన్‌ను కలిసినవారిలో ఉన్నారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి అర్వింద్ సావంత్ కూడా పాల్గొన్నారు.

### వడ్డీరేట్లను తగ్గించాలి

రుణాలపై బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గించాలని సందీప్ సోమని డిమాండ్ చేశారు. ఆర్బీఐ వరుసగా రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను తగ్గిస్తున్నా.. ఆ ప్రయోజనాలు ఖాతాదారులకు అందడం లేదని, ఇందుకు బ్యాంకుల తీరే కారణమని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటిదాకా కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ 110 బేసిస్ పాయింట్లు తగ్గించగా, బ్యాంకులు మాత్రం మూడో వంతు కూడా తగ్గించలేదు. దీనిపై ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ కూడా బుధవారం ద్రవ్యసమీక్షలో పెదవి విరిచిన సంగతి విదితమే. బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గిస్తే గృహ, వాహన రంగాలకు ఎంతో మేలు జరుగుతుందని, ప్రస్తుతం అవి అమ్మకాలు లేక అల్లాడిపోతున్నాయని గుర్తుచేశారు. ముఖ్యంగా ఆటో రంగంలో పోతున్న ఉద్యోగాలు ఆందోళనకరంగా ఉన్నాయన్నారు.

## సెల్టాస్‌కు 23 వేల బుకింగ్‌లు

- కియా మోటార్స్ వెల్లడి



**అనంతపురం, ఆగస్టు 8:** మధ్యస్థాయి స్పోర్ట్స్ యుటిలిటీ వాహనమైన సెల్టాస్‌కు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. కారు విడుదలకు ముందే 23 వేల ముందస్తు బుకింగ్‌లు వచ్చాయని కొరియాకు చెందిన వాహన సంస్థ కియా మోటార్స్ వర్గాలు వెల్లడించాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం వద్ద కంపెనీ ఏర్పాటు చేసిన ప్లాంట్లో తయారైన ఈ కారును గురువారం దక్షిణ కొరియా అంబాసిడర్ శిన్ బాంగ్-కిల్, కియా మోటార్స్ ఇండియా మేనేజింగ్ గైరెక్టర్, సీఈవో కుఖియున్ షిమ్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ మనోహర్ భట్ మాట్లాడుతూ.. సెల్టాస్ ముందస్తు బుకింగ్‌లు ఆరంభించిన నెలరోజుల్లోనే 23 వేల బుకింగ్‌లు వచ్చాయన్నారు. దేశవ్యాప్తంగా 160 నగరాల్లో ఉన్న 265 టచ్‌పాయింట్ల వద్ద ఈ నెల 22న బుకింగ్ చేసుకున్నవారికి వాహనాన్ని అందచేయడం జరుగుతుందన్నారు. 536 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లో ప్రతియేటా 3 లక్షల కార్లు ఉత్పత్తి కానున్నాయి. ఈ యూనిట్‌లోనే హైబ్రిడ్, విద్యుత్‌తో నడిచే వాహనాలను సైతం తయారు చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. దేశీయ ఆటోమొబైల్ రంగంలో 2 బిలియన్ డాలర్లు(దాదాపు రూ.14 వేల కోట్లు) పెట్టుబడిగా పెట్టిన సంస్థ.. వీటిలో 1.1 బిలియన్ డాలర్లతో ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన ప్రకటించారు.

# జయశంకర్ సార్ కృషి అజరామరం

- లండన్‌లో ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు
- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్‌కు సత్కారం

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ చేసిన కృషి అజరామరమని తెలంగాణ జాగృతి యూకే సభ్యులు కొనియాడారు. 'యూకే తెలంగాణ జాగృతి' ఆధ్వర్యంలో గురువారం లండన్‌లో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న రాష్ట్రాభివృద్ధి పట్ల సంతోషం వ్యక్తంచేశారు. బంగారు తెలంగాణ సాధించడం ఒక్క కేసీఆర్‌తో మాత్రమే సాధ్యమన్నారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్‌ను జాగృతి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో జాగృతి యూకే అధ్యక్షుడు సుమన్‌రావు బలమూరి, రోహిత్ రావు, కిశోర్‌కుమార్ మునగాల, వంశీ తులసి, లండన్ గణేశ్, సునీల్ మెప్రీర్, వెంకట్ బాలగోని, రవి మేడిపల్లి పాల్గొన్నారు.


లండన్‌లో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్‌ను సన్మానిస్తున్న జాగృతి సభ్యుడు

# పక్షవాత బాధితుల కోసం ఆర్మ్ ఏబుల్

- హైదరాబాద్ ఐఐటీయన్ల ఘనత
- సరికొత్త ఉపశమన పరికరం ఆవిష్కరణ

**సంగారెడ్డి చౌరస్తా:** తెలంగాణలోని ప్రతిష్ఠాత్మక సాంకేతిక విద్యాసంస్థల్లో ఒకటైన ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు పక్షవాత (స్ట్రోక్) బాధితులకు ఉపశమనాన్ని కలిగించే 'ఆర్మ్ ఏబుల్' అనే సహాయ పరికరాన్ని రూపొందించి తమ ఘనతను చాటుకొన్నారు. సంగారెడ్డిలోని ఐఐటీ హైదరాబాద్ ఇంక్యుబేటెడ్ స్టార్టప్‌లో గురువారం నిర్వహించిన పిచింగ్ సెషన్‌లో ఈ పరికరాన్ని ఆవిష్కరించారు. సెంటర్ ఫర్ హెల్త్‌కేర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఎఫ్‌హెచ్‌ఈ) ఆధ్వర్యంలో అభివృద్ధిచేసిన ఈ పరికరంతో పక్షవాత బాధితులతోపాటు మెదడు గాయాలతో ఇబ్బందులుపడేవారికి ఉపశమనం లభిస్తుందని సీఎఫ్‌హెచ్‌ఈ పరిశోధకుడు, బయోమెడికల్ ఇంజినీర్, రోబోసిస్ట్ హబీబ్ అలీ స్పష్టంచేశారు. సీఎఫ్‌హెచ్‌ఈ ఫెలోషిప్ మూడో బ్యాచ్ ఈ పరికరాన్ని రూపొందించిందన్నారు. మూడో బ్యాచ్‌లో ఎనిమిది మంది, మొదటి బ్యాచ్‌లో నలుగురు, రెండో బ్యాచ్‌లో నలుగురు చొప్పున ఇక్కడ మొత్తం 16 మంది పరిశోధకులు పట్టభద్రులయ్యారని తెలిపారు. ఐఐటీ హైదరాబాద్ బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి, సీఎఫ్‌హెచ్‌ఈ సహాయ విభాగాధిపతి ప్రొఫెసర్ రేణుజాన్, ఐఐటీ డైరెక్టర్ యూబీ దేశాయి, సీఎఫ్‌హెచ్‌ఈ ఫ్యాకల్టీ అడ్వైజర్ డాక్టర్ కౌశిక్‌సారథిశ్రీధరన్, సహవ్యవస్థాపకుడు కేజీ శ్రీహరి, వివిధ స్టార్టప్‌ల ప్రతినిధులు, పరిశోధకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


పరికరంపై అవగాహన కల్పిస్తున్న హబీబ్ అలీ




గురువారం హైదరాబాద్ సమాచారభవన్‌లో మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణను శాలువాతో సన్మానిస్తున్న అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు, అధికారులు

# అర్హులందరికీ అక్రెడిటేషన్ కార్డులు

- మీడియా అకాడమీ, అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్ అల్లం నారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులను జారీ చేస్తామని రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్, రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్ అల్లం నారాయణ తెలిపారు. గురువారం సమాచార భవన్‌లో అల్లం నారాయణ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి అక్రెడిటేషన్ కమిటీ సమావేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులన్నింటినీ పరిశీలించారు. దాదాపు 80 శాతం మంది జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వడానికి కమిటీ ఆమోదముద్ర వేసింది. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. ఇప్పటిదాకా ఆన్‌లైన్ ప్రక్రి య ద్వారా 17 వేల మంది జర్నలిస్టులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కొత్త అక్రెడిటేషన్ కార్డులు ఈ ఏడాది అక్టోబర్ నుంచి 2021 సెప్టెంబర్ వరకు మనుగడలో ఉంటాయన్నారు. ఈ దఫా మొదటిసారిగా అక్రెడిటేషన్ కార్డులను ఆన్‌లైన్ పక్రియలో చేపట్టినట్టు తెలిపారు. మహిళా జర్నలిస్టులకు అక్రెడిటేషన్‌లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, ఆయాసంస్థల్లో మహిళా జర్నలిస్టులు లేకపో తే, ఆ ఖాళీలను భర్తీచేయబోమని స్పష్టంచేశారు. ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు విరాహత్‌అలీ, బసవపున్నయ్య, కట్టా కవిత, సౌమ్య, వీ సతీశ్, టీ కోటిరెడ్డి, ప్రకాశ్, గంగాధర్, ఆర్టీసీ నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి, సమాచారశాఖ అదనపు సంచాలకుడు నాగయ్య, మీడియా అకాడమీ కార్యదర్శి విజయ్‌గోపాల్, జాయింట్ డైరెక్టర్ డీఎస్ జగన్, అసిస్టెంట్ డైరెక్టర్ హష్మి, సంపత్ పాల్గొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్‌గా అల్లంనారాయణ పదవీకాలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పొడిగించిన సందర్భంగా కమిటీసభ్యులు, అధికారులు ఆయనకు శాలువాకప్పి సన్మానించారు.

# ఎంఎంటీఎస్@16

- భాగ్యనగర్ ప్రజారవాణా వ్యవస్థలో కీలక అడుగు
- రోజూ లక్షా 65వేల మందికిపైగా ప్రయాణం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** భాగ్యనగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా ప్రారంభమైన ఎంఎంటీఎస్ (మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం) గురువారంతో 16 ఏండ్లు పూర్తిచేసుకున్నది. హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల ప్రజల రవాణా అవసరాలను తీర్చేందుకు మొదటిసారిగా రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులతో చేపట్టిన ఎంఎంటీఎస్‌ను 2003 ఆగస్టు 9వ తేదీన నాటి ఉప ప్రధాని ఎల్కే అద్వానీ సికింద్రాబాద్ బోయిగూడలో జెండా ఊపి ప్రారంభించారు. ఎంఎంటీఎస్ సేవల నిర్వహణకు అవసరమైన ఖర్చులో 2/3 వంతు రాష్ట్ర ప్రభుత్వం, 1/3 వంతు రైల్వే భరిస్తున్నాయి. మొదట సికింద్రాబాద్-లింగంపల్లి, హైదరాబాద్- లింగంపల్లి మధ్య 29 కిలోమీటర్ల దూరం ఎంఎంటీఎస్ సేవలు ప్రారంభం కాగా, తర్వాత 15 కిలోమీటర్ల దూరం గల సికింద్రాబాద్, ఫలక్‌నుమా సెక్షన్‌ను 2004 ఫిబ్రవరిలో ప్రారంభించారు. ఫేజ్-1 నిర్మాణానికి అయిన ప్రారంభ వ్యయం రూ.158.83 కోట్లు. ఫేజ్-2లో ఇటీవలనే తెల్లాపూర్-రామచంద్రాపురం మధ్య మూడుస్టేషన్లతో ఆరు కిలోమీటర్ల దూరం విస్తరించారు. మొత్తం 50 కిలోమీటర్ల దూరం, 29 స్టేషన్లకు విస్తరించిన ఎంఎంటీఎస్‌లో సగటున ప్రతిరోజూ ప్రయాణిస్తున్నవారి సంఖ్య 1.65 లక్షలు. ఎంఎంటీఎస్ అత్యంత నమ్మదగిన, భద్రమైన, చౌకైన రవాణా వ్యవస్థగా జంటనగరాల ప్రజల ఆదరణ పొందింది.



**ఎంఎంటీఎస్ విశేషాలు**

- ప్రారంభంలో ఎంఎంటీఎస్ టికెట్ కనీస ధర రూ.5. గరిష్ఠధర రూ.10. ఇప్పటికీ కనీసధరలో మార్పులేదు.

**ప్రజాదరణ పెరిగిందిలా..**

| సంవత్సరం | సగటున రోజువారీ ప్రయాణికుల సంఖ్య |
|---|---|
| 2003-04 | 13,000 |
| 2005-06 | 35,000 |
| 2010-11 | 1,15,000 |
| 2015-16 | 1,48,000 |
| 2018-19 | 1,65,000 |

- ఉద్యోగుల సౌకర్యార్థం సీజన్ టికెట్ ప్రారంభించింది. రూ.880తో జనరల్ బస్‌టికెట్ అందుబాటులోకి తెచ్చింది.
- తొలుత 48 రైలు సర్వీసులతో ప్రారంభం కాగా ఆ సంఖ్య 121కి పెరిగింది.
- తొలుత ఒక్కో రైలులో ఆరు కోచ్‌లు ఉండేవి. ఇప్పుడు ఒక్కో రైలు 12 కోచ్‌లతో సేవలందిస్తున్నది.
- మాతృభూమి లేడీస్‌స్పెషల్‌ను 2010లో ప్రవేశపెట్టారు. ప్రత్యేకరంగులో మహిళా కోచ్‌లను తీర్చిదిద్దారు.
- రైళ్ల సమాచారం కోసం ఆండ్రాయిడ్ ఆధారిత హైలైట్స్ మొబైల్‌యాప్‌ను ఆవిష్కరించారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హై అలర్ట్

- ఐబీ, బీసీఏఎస్ హెచ్చరికలతో నిఘా కట్టుదిట్టం
- విజిటర్స్ పాసలపై రేపట్నుంచి 20 వరకు ఆంక్షలు

**శంషాబాద్:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో హై అలర్ట్ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం, ఐబీ, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) ఆదేశాల మేరకు ఎయిర్‌పోర్టు విజిటర్స్ ప్రవేశ పాసలపై శనివారం నుంచి ఈ నెల 20 వరకు ఆంక్షలు విధించారు. డొమెస్టిక్ ప్రయాణికులు రెండుగంటల ముందు, ఇంటర్నేషనల్ ప్రయాణికులు మూడుగంటల ముందు ఎయిర్‌పోర్టుకు చేరుకొని తనిఖీలు, భద్రతాపరమైన అంశాల్లో సహకరించాలని జీఎమ్మార్ కార్పొరేట్ కమ్యూనికేషన్‌వర్గాలు గురువారం ఒక ప్రకటనలో కోరాయి. కాగా, పంద్రాగస్టు వేడుకల నేపథ్యంలో ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరికలతో ఎయిర్‌పోర్టు పరిసరాల్లో నిఘాతోపాటు భద్రత కట్టుదిట్టం చేశారు. ఎయిర్‌పోర్టు, రైల్వేస్టేషన్, హైవే, ఔటర్ రింగ్ రోడ్డు, ఇతర రద్దీ ప్రదేశాల్లో సీఐఎస్‌ఎఫ్, ఆక్టోపస్, రాష్ట్ర పోలీస్, డాగ్, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. పోలీస్ అధికారుల పర్యవేక్షణలో భద్రతాచర్యలు చేపట్టారు.

## ఓరియంటల్ ఇన్సూరెన్స్ ఉద్యోగులకు జైలుశిక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** క్లెయిం సెటిల్‌మెంట్‌లో కుట్రపూరితంగా వ్యవహరించి, తాము పనిచేసే సంస్థకు రూ.57.07 లక్షల మేర నష్టం కలిగించిన ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీకి చెందిన 18 మంది అధికారులు, ఉద్యోగులను హైదరాబాద్‌లోని సీబీఐ కోర్టు దోషులుగా నిర్ధారించింది. వీరికి మూడు నుంచి రెండేండ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది.

## ప్రణబ్ ముఖర్జీకి రేపు గీతం అవార్డు

- వ్యవస్థాపక దినోత్సవానికి రానున్న మాజీ రాష్ట్రపతి

**హైదరాబాద్:** మాజీ రాష్ట్రపతి, భారత రత్న ప్రణబ్‌ముఖర్జీని గీతం ఫౌండేషన్ అవార్డుతో సత్కరించనున్నారు. గీతంగా పేరొందిన గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ,మేనేజ్‌మెంట్ 39వ వ్యవస్థాపక దినోత్సవాన్ని శనివారం గీతం ప్రాంగణంలోని డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు ఆడిటోరియంలో నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ప్రణబ్‌ముఖర్జీకి గీతం ఫౌండేషన్ అవార్డుతోపాటు ఒక ఫలకాన్ని ప్రదానం చేయనున్నారు.

## కాంగ్రెస్ ఖేల్ ఖతం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఎద్దేవా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి ఖేల్‌ఖతం.. దుకాణం బందలా మారిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఎద్దేవాచేశారు. ఆ పార్టీ నుంచి పోయేవాళ్లు తప్ప, వచ్చేవారు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. జమ్ముకశ్మీర్‌పై లోక్‌సభలో చర్చ సందర్భంగా అమిత్‌షా మాట్లాడిన మాటలు బీజేపీకి తెలంగాణ ఏర్పాటు ఇష్టంలేనట్టుగా ఉన్నాయంటూ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొనడాన్ని లక్ష్మణ్ తప్పుబట్టారు. అమిత్‌షా అనని మాటలను ఉత్తమ్ అన్వయించారని మండిపడ్డారు. మిలిటరీలో పనిచేసిన ఉత్తమ్ దేశభక్తిని చూపకుండా మతిలేకుండామాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. బీజేపీకి తెలంగాణ నుంచి ఒక్క ఎంపీ లేకపోయినా.. రాష్ట్ర విభజనకు మద్దతిచ్చిన విషయాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ సొంత ఎంపీయే పెప్పర్‌స్ప్రే ద్వారా అడ్డుకున్నారని గుర్తుచేశారు.

## బీసీకి పీసీసీ పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ నేత వీహెచ్ డిమాండ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పార్టీలోని నమ్మకస్తుడైన బీసీ నాయకుడికి పీసీసీ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ నేత వీ హనుమంతరావు డిమాండ్‌చేశారు. తనను ఖమ్మం స్థానానికి పోటీచేయకుండా పీసీసీ చీఫ్ ఉత్తమ్, భట్టివిక్రమార్క అడ్డుకున్నారని ఆరోపించారు. అధిష్ఠానం రాష్ట్ర నాయకత్వంపై చర్యలు తీసుకోవడంలేదని, ఇతర పార్టీల నుంచి వచ్చినవారికి పదవులిస్తే పార్టీని వీడేందుకు వెనుకాడనని స్పష్టంచేశారు. పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఎమ్మెల్సీ టికెట్ అడిగితే ఏఐసీసీ కార్యదర్శి డబ్బులు అడిగారని ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్న తీరుపై సోనియాకు ఫిర్యాదుచేసినట్టు తెలిపారు.


## పారాలీగల్ వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పారాలీగల్ వలంటీర్లుగా హైదరాబాద్ జిల్లా పరిధిలో సేవలు అందించేందుకు ఆసక్తి ఉన్న స్థానికులు ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని మెట్రోపాలిటన్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచించింది. వందమంది వాలంటీర్లను ఎంపికచేయనున్నట్టు తెలిపింది.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- ఆగివున్న డీసీఎంను బలంగా ఢీకొట్టిన కారు
- శంషాబాద్‌లోని సాతంరాయి హైవేపై ఘటన
- మిత్రుడి బర్త్‌డే వేడుకకు వెళ్తుండగా ప్రమాదం


అనిల్ (ఫైల్)


హరీశ్ (ఫైల్)


శ్రీకాంత్(ఫైల్)

**శంషాబాద్:** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని సాతంరాయి సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం రాత్రి ఘోర ప్రమాదం జరిగింది. రోడ్డుపై నిలిపి ఉన్న డీసీఎం వాహనాన్ని కారు వెనుకనుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. బండ్లగూడలోని కాళిమందిర్ ప్రాంతానికి చెందిన ఎం అనిల్ కుమార్ (17), శంషాబాద్‌లోని తొండుపల్లికి చెందిన పోలేపల్లి శ్రీకాంత్ (20), సిద్ధాంతికి చెందిన కొప్పుల హరీశ్‌గౌడ్ ( 24), చరణ్, సాయి, ప్రశాంత్‌రెడ్డి స్నేహితులు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వీరంతా ప్రైవేట్ ఉద్యోగులు. ఓ మిత్రుడి జన్మదిన వేడుకల కోసం ఆరుగురు శంషాబాద్ నుంచి నగరంవైపు ప్రశాంత్‌రెడ్డికి చెందిన షిఫ్ట్ డిజైర్ కారులో బుధవారం రాత్రి బయలుదేరారు. మార్గమధ్యంలో సాతంరాయి హైవేపై ఎలాంటి సూచకలు లేకుండా నిలిపిన డీసీఎం వాహనాన్ని వీరి కారు బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో అనిల్, శ్రీకాంత్ అక్కడికక్కడే చనిపోగా హరీశ్ దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. చరణ్‌కు తీవ్ర గాయాలు యశోద దవాఖానకు తరలించారు. సాయి, ప్రశాంత్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. డీసీఎం డ్రైవర్ పరారీలో ఉన్నాడు.


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# రెండు రాష్ట్రాల్లో ఎక్కడైనా రేషన్!

- నేటినుంచి తెలంగాణ, ఏపీలో రేషన్ పోర్టబిలిటీ అమలు
- ఆన్‌లైన్ ద్వారా ప్రారంభించనున్న కేంద్రమంత్రి పాశ్వాన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్ ప్రజలు తెలంగాణలో, తెలంగాణ ప్రజలు ఏపీలో రేషన్ సరుకులు తీసుకునే వెసులుబాటు శుక్రవారం నుంచి అమలులోకి వస్తున్నది. ఈ రెండు రాష్ట్రాలను ఒక క్లస్టర్ కిందకు చేర్చి ఈ పథకాన్ని అమలుచేస్తుండటంతో ఎంతోమంది లబ్ధిపొందనున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పోర్టబిలిటీ ద్వారా రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ తీసుకునే అవకాశం కల్పించింది. దీన్ని విజయవంతంగా అమలు చేసిన తొలిరాష్ట్రంగా ఖ్యాతి సాధించింది. ఈ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం 'ఒకే దేశం- ఒకే కార్డు' విధానానికి శ్రీకారం చుట్టింది. తెలంగాణలో అమలవుతున్న పోర్టబిలిటీ విధానాన్ని అధ్యయనం చేసి దేశంలో ఎక్కడైనా రేషన్ తీసుకునేలా ఏర్పాట్లుచేస్తున్నది. తొలుత నాలుగు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయాలని భావిస్తున్నది. తెలంగాణ- ఏపీలను ఒక క్లస్టర్‌గా, గుజరాత్ - మహారాష్ట్రను మరో క్లస్టర్‌గా ఏర్పాటుచేసి నేషనల్ పోర్టబిలిటీ అమలుకు సన్నాహాలుచేస్తున్నది. ఈ కార్యక్రమాన్ని శుక్రవారం కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ప్రజాపంపిణీ వ్యవస్థ శాఖల మంత్రి రాంవిలాస్‌పాశ్వాన్ ఢిల్లీ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఆదర్శ్‌నగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ సమీపంలో గల రేషన్‌షాప్‌లో ప్రారంభిస్తారు.

**వచ్చే ఏడాదినుంచి దేశవ్యాప్తంగా అమలు**

2020 ఆగస్టునాటికి 'ఒకే దేశం- ఒకే కార్డు' విధానాన్ని దేశవ్యాప్తంగా అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. తొలుత ప్రభుత్వపాలనలో సాంకేతికత వినియోగంలో ముందున్న రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నది. ఈ రాష్ట్రాల్లో విజయవంతమైన తర్వాత దేశవ్యాప్తంగా అమలుచేయాలని యోచిస్తున్నది. ఈ విధానం ప్రకారం రేషన్ పొందాలంటే ఆధార్‌కార్డుతో రేషన్‌కార్డు తప్పనిసరిగా అనుసంధానమై ఉండాలి.









epaper.ntnews.com

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
జిందగీ
శుక్రవారం 9 ఆగస్టు 2019 /nt.zindagi

**కొత్త పెండ్లికూతురు.. ఆషాఢంలో అమ్మ ఇంటికి వచ్చి.. శ్రావణ పట్టు కట్టించాక మెట్టినింటికి చేరుతుంది.. ఇక వరలక్ష్మీ వ్రతానికొక పట్టు చీర కట్టి తీరాల్సిందే! ఇన్ని అకేషన్లలో అందరూ పట్టులా మెరిసిపోవాలంటే.. ఆ పండుగలు ఘనంగా ఉండాలంటే.. గద్వాల్ చీరలు చుట్టాల్సిందే! ఈ వారం ఆ కలెక్షన్‌ని మీ కోసం ప్రత్యేకంగా పట్టుకొచ్చాం..**

# శ్రావణ పట్టు!



**కొ**న్ని కలర్ కాంబినేషన్స్ చూడగానే సూపర్‌గా కనిపిస్తాయి. అదే ఈ కాంబినేషన్. యెల్లో కలర్ గద్వాల్ పట్టుకి పింక్ బార్డర్ జత చేరింది. అయితే పైన, కింద కాస్త డిఫరెంట్ బార్డర్‌లు రావడం ఈ చీర ప్రత్యేకత. చీర మొత్తం ఏనుగు డిజైన్ బుటీస్ వచ్చాయి. పల్లూ రిచ్‌గా కనిపిస్తున్నది. పింక్ కలర్ సింపుల్ బ్లౌజ్‌ని వెనుక వైపు హైనెక్‌గా డిజైన్ చేశాం.



పవులూరి నాగతేజ
ఫ్యాషన్ డిజైనర్, తేజ శారీస్
కూకట్‌పల్లి, హైదరాబాద్
tejasarees@yahoo.com



**బ్లూ** రెడ్ కాంబినేషన్‌లో వచ్చిన గద్వాల్ పట్టు చీర ఇది. చీర మొత్తం పికాక్ డిజైన్‌తో వచ్చిన సిల్వర్ బుటీస్ సూపర్‌గా కనిపిస్తున్నాయి. ఎర్రని పెద్ద బార్డర్ సూపర్ కాంబినేషన్‌గా కుదిరింది. దీనికి మ్యాచింగ్‌గా ఎర్రని పట్టు బ్లౌజ్‌నే ఎంచుకున్నాం. సింపుల్‌గా డిజైన్ చేయడంతో సూపర్‌గా కనిపిస్తున్నది.



**ఆ**రెంజ్ కలర్ గద్వాల్ పట్టు చీరకి చిన్న చెక్స్ ప్యాటర్న్ చీర అందాన్ని పెంచింది. దీనికి డార్క్ బ్లూ కలర్ ఇక్కత్ బార్డర్, దానికి కింద రెండు పట్టీలుగా వచ్చిన జరీ బార్డర్ సూపర్‌గా కనిపిస్తున్నది. ఫుల్ జరీ బుటీతో వచ్చిన పల్లూ చీరకు అదనపు ఆకర్షణ. దీనికి మ్యాచింగ్‌గా డార్క్ బ్లూ చిన్న జరీ బుటీస్ వచ్చిన బ్లౌజ్‌ని మ్యాచ్ చేశాం.

**పిం**క్ కలర్ గద్వాల్ పట్టు ఇది. దీని మీద ఏనుగుల డిజైన్‌తో వచ్చిన జరీ బుటీస్ ముచ్చటగా కనిపిస్తున్నాయి. దీనికి ఒక వైపు పెద్ద బార్డర్, మరో వైపు చిన్న జరీ బార్డర్‌లు వచ్చేసరికి క్లాస్ లుక్ వచ్చింది. హెవీ పల్లూ దీనికి హైలైట్. గ్రీన్ కలర్ పట్టు బ్లౌజ్ మీద పింక్, గోల్డెన్ స్టోన్స్‌తో సింపుల్‌గా వర్క్ చేయడంతో సూపర్‌గా మెరిసిపోతున్నది.

**సీ** గ్రీన్ కలర్ గద్వాల్ పట్టు ఇది. చీర మొత్తం సిల్వర్ పీకాక్ బుటీస్ వచ్చాయి. ఇక నేవీ బ్లూ కలర్ బార్డర్ మీద పెద్ద గోల్డెన్ జరీ బార్డర్ చూడముచ్చటగా కనిపిస్తున్నది. దీనికి పింక్ అంచు మరింత అందంగా ఉంది. ఈ చీరకు మ్యాచింగ్ డార్క్ బ్లూ చిన్న జరీ బుటీస్ వచ్చిన బ్లౌజ్‌ని సింపుల్‌గా డిజైన్ చేశాం.

## క్యాన్సర్‌ను జయించి.. అందాల పోటీకి!

**'అంతా బాగుంది. నేను స్థిరపడ్డాను' అని అనుకున్నప్పుడే ఆమెకు క్యాన్సర్ సోకింది. అయినా భయపడలేదు.. పోరాడింది. జాగ్రత్తలు పాటించి దాన్ని జయించింది. తన అనుభవాల నుంచే మోడలింగ్ మీద ఆసక్తి పెంచుకున్నది. ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న మిసెస్ ఇండియా అందాల పోటీ తుది జాబితాలో నిలిచింది.**

బెంగళూర్‌కు చెందిన తనీషారాయ్ గాథ ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. 2018 అమెకు ఓ విషాదకరమైన ఏడాది. ఆమె క్యాన్సర్‌తో బాధపడుతూ అనేక సవాళ్లను ఎదుర్కొన్నది. వాటితో పోరాడింది. తాను ఓ కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగిగా ఉన్నప్పుడే చెవికి, మెడకు మధ్యలో 'ఫ్లోమోర్ఫిక్ అడేనొమా' కణితి ఏర్పడింది. తర్వాత అది మొదటి స్టేజీ క్యాన్సర్‌కు దారి తీసింది. సర్జరీ తప్పనిసరి అని తెలుసుకున్నది తనీషా. అధైర్యపడకుండా మాక్రో ఓపెన్ సర్జరీ చేయించుకొని కణితిని తొలగించుకున్నది. కానీ, ఈ సర్జరీ చెవికి, మెడకు మధ్య పెద్ద చీలికను మిగిల్చింది. 'ఈ క్యాన్సర్‌ను జయించే ప్రయాణం చాలా బలమైన ఆలోచనతో కూడుకున్నది. అయినా ఇది కష్టమే కానీ, నా లక్ష్యాన్ని నేను చేరుకోవడానికి నన్ను చాలా ప్రేరేపించింది' అని తనీషా చెప్తున్నది. చికిత్స తర్వాత ఆమె ఉద్యోగం నుంచి విశ్రాంతి తీసుకున్నది. ఫిట్‌నెస్ పోటీల్లో పాల్గొనడానికి సిద్ధమైంది. అలాగే మోడలింగ్‌లో చేరింది. కొద్ది రోజులకే షూట్స్, కవరేజ్‌తో ఆమె ప్రతిభను నిరూపించుకున్నది. చివరికి ఆమె ప్రయత్నం ఫలించింది. అక్టోబర్‌లో గ్రీస్‌లో జరగబోయే 'హాత్ మోండే మిసెస్ ఇండియా వరల్డ్ వైడ్' పోటీల్లో పాల్గొననున్నది. 25 దేశాల నుంచి 40 వేల మందికి పైగా పాల్గొనే ఈ పోటీల్లో 172 మంది తుది జాబితాకు తనీషా ఎంపికైంది. ఇలా తనీషా కాన్సర్‌ను జయించి ఆ ప్రయాణం నుంచి ప్రేరణ పొంది, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నది.



## ఆరోగ్య సిరి.. ఉసిరి

- పుల్లపుల్లగా వగరుగా ఉండే ఉసిరిలో అధిక శాతం ప్రొటీన్లు ఉన్నాయి. యాపిల్‌తో పోలిస్తే ఇందులో మూడు రెట్లు ఎక్కువ ప్రొటీన్లు ఉన్నాయి. దానిమ్మ పండుతో పోలిస్తే ఉసిరిలో పోషకాలు దాదాపు 27 రెట్లు ఎక్కువ. ఉసిరిలో యాంటీవైరల్, యాంటీ మైక్రోబియల్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి.
- శరీరంలో అధికంగా పేరుకుపోయిన కొవ్వును కరిగించడమే కాకుండా రక్తప్రసరణను మెరుగుపర్చి, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా కూడా చూస్తుంది ఉసిరి. ఇవి తింటే మధుమేహ వ్యాధి నియంత్రణలో ఉంటుంది. ఆయాసం, అలసట తగ్గుతుంది. ఉసిరి రక్తాన్ని కూడా శుద్ధి చేస్తుంది.
- మెదడు చురుగ్గా పనిచేయడంలో ఉసిరి పాత్ర ఎంతో ఉంది. ఉసిరి తరచూ తినడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుంది. ఉసిరిలో ఉన్న విటమిన్ సి శరీరానికి మేలు చేస్తుంది. మచ్చలను నివారిస్తుంది.
- జుట్టుకు సరైన పోషణ అందించి, చుండ్రుతో సహా అనేక కేశ సంబంధిత సమస్యలను దూరం చేస్తుంది ఉసిరి. చర్మ సౌందర్యానికి కూడా ఇది ఎంతగానో దోహదపడుతుంది. మచ్చలను నివారించడంలోనూ సహాయపడుతుంది.
- ఉసిరికాయను ముద్దగా నూరి కొద్దిగా పసుపు, నువ్వుల నూనె కలిపి ఒంటికి రాసుకోవాలి. కొద్దిసేపటి తర్వాత స్నానం చేస్తే చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. రాత్రి భోజనం చేసిన తర్వాత ఒక స్పూన్ ఉసిరిపొడిలో తేనెను కలిపి తింటే అసిడిటీ, గ్యాస్, కడుపులో మంట తగ్గుతుంది

**ఉసిరికాయతో మనకు అనేక పోషకాలు అందుతాయి. దీనిలో ఔషధ గుణాలు ఎక్కువ ఉండడం వల్ల రోగాల నుంచి ఉపశమనం లభిస్తుంది.**



## పెరుగుతో సహజ సౌందర్యం

**ముఖారవిందం కోసం ఏదో ఒక ప్రయత్నం చేస్తూనే ఉంటారు. అయితే చర్మ కాంతిని పొందేందుకు వంటింట్లో లభించే పదార్థాలు ఉపయోగపడుతాయి. వాటిల్లో పెరుగు చాలా కీలకం.**



- పెరుగులోని లాక్టిక్ యాసిడ్‌లు, విటమిన్స్, మినరల్స్, యాంటీ మైక్రోబయల్ ప్రాపర్టీస్ చర్మ సమస్యలకు రెమెడీగా పనిచేస్తాయి. రోజూ ముఖానికి పెరుగును పట్టించి గంట తర్వాత కడిగితే ముఖం కాంతివంతమవుతుంది.
- దోసకాయ గుజ్జుతో పెరుగుని కలుపుకొని, ముఖానికి రాసి, 20 నిమిషాల తర్వాత కడిగితే మంచి ఫలితం ఉంటుంది. ఇలా వారంలో మూడు రోజులు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.
- ఎగ్‌వైట్‌ను పెరుగులో కలిపి సున్నితంగా ముఖంపై రుద్దాలి. 20 నిమిషాల తర్వాత నీళ్లతో తొలగించాలి. ఆ తరువాత మాయిశ్చరైజర్‌ను అప్లై చేయాలి. ఇలా రోజూ ప్రయత్నిస్తే వారంలో మంచి ఫలితం కనిపిస్తుంది.
- బాగా పండిన రెండు స్ట్రాబెర్రీస్‌ను ముక్కలుగా చేయాలి. అందులో టీ స్పూన్ తేనెను, టీ స్పూన్ పెరుగును కలపాలి. ఆ మిశ్రమాన్ని ముఖంపై రాయాలి. 20 నిమిషాల తరువాత గోరువెచ్చని నీటితో సున్నితంగా తొలగించాలి.
- పెరుగుతో చర్మానికి తేమను అందించి మృతకణాలను తొలగించుకునేందుకు ఈ చిట్కాలు ఉపయోగపతాయి.

### వంటింటి చిట్కాలు

- తురిమిన కొబ్బరి, జీడిపప్పు ఫ్రిజ్‌లో ఉంచితే పురుగు పట్టదు. తేనె శుభ్రంగా నిల్వ ఉండాలంటే మంచి సీసాలో పోసి రెండు, మూడు లవంగాలు దానిలో వేయాలి.
- నాలుగైదు చుక్కల నిమ్మరసం మాత్రమే అవసరమైనప్పుడు కాయను రెండు ముక్కలుగా కోయవద్దు. సూదితో కాయకు రంధ్రం చేసి రసం పిండితే సరిపోతుంది. ఎండు కొబ్బరి సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్లు చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి.
- పసుపు, కారం, కరివేపాకు పొడిలాంటివి నిల్వ చేసేటప్పుడు చిటికెడు ఇంగువ కలిపి పేపరు కవర్లలో భద్రం చేస్తే ఏడాది పాటు నిల్వ ఉంటాయి.
- కారప్పొడిలో కాసిన్ని వేరుశనగ గింజలను వేయించి పొడిగొట్టి కలుపుకుంటే ఇడ్లీలోకి, దోశెలలోకి బాగుంటుంది.
- టీ, కాఫీల రుచి పెరగాలంటే డికాషన్‌లో నిమ్మచెక్క వేసుకోవాలి.

## ఇదొక వింత నిరసన!



**మహిళల వస్త్రధారణపై అప్పుడప్పుడు పురుషులు అభ్యంతరం వ్యక్తం చేస్తూనే ఉంటారు. అది అక్కడా, ఇక్కడా అని తేడా ఏమీ లేదు. అన్ని దేశాల్లోనూ ఇదే పరిస్థితి. అచ్చం ఇలాంటి పరిస్థితినే తన బాయ్‌ఫ్రెండ్ నుంచి ఎదుర్కొన్న ఓ మహిళ.. దాన్ని సవాలుగా తీసుకొని ఏం చేసిందంటే..**

లండన్‌కు చెందిన ఒలివియాకు ఫ్యాషన్ దుస్తులు ధరించడం అలవాటు. జిమ్, స్విమ్మింగ్ కోసం ప్రత్యేకమైన దుస్తులను ధరించేది. వీటిపై ఆమె బాయ్ ఫ్రెండ్ అభ్యంతరం వ్యక్తం చేసేవాడు. ఫ్యాషన్ ఐకానిక్ దుస్తులు వేసుకుంటే వద్దనేవాడు. అతని మాటలకు వెనుకడుగు వేయకుండా ఒలివియా తనదైన శైలిలో స్పందించింది. 'క్లాత్స్ మై బాయ్ ఫ్రెండ్ హేట్స్' అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను తయారు చేసింది. సరిగ్గా ఆమె బాయ్ ఫ్రెండ్ ఏ దుస్తులనైతే వద్దన్నాడో వాటినే ధరించి ఫొటోలను షేర్ చేసింది. ఈ అకౌంట్ ద్వారా ఆమెకు ఇష్టమైన ఫ్యాషన్ దుస్తులను పరిచయం చేయడం ప్రారంభించింది. దీనికంతటికీ భలే స్పందన వస్తున్నది. కొద్ది రోజుల్లోనే ఫొటోలన్నీ ట్రెండ్ అయ్యాయి. ఇప్పుడు అవే ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. విధంగా తన నిరసనను తెలియజేస్తూ.. ఎక్కువమంది మద్దతు కూడగడుతున్నది ఒలివియా.

II.
నమస్తే తెలంగాణ
# చింతన
[ కరీంనగర్ ]
శుక్రవారం 9 ఆగస్టు 2019

## పర్వదినాలు



- వరలక్ష్మీ వ్రతం (నేడు)
- తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం ప్రారంభం, బక్రీద్ : ముస్లిం సోదరుల పర్వదినం (12వ తేది)
- మంగళగౌరీ వ్రతం (రెండవ వారం), తిరుమల శ్రీవారి పవిత్రోత్సవం సమాప్తి (13వ తేది)
- శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు (14వ తేదీ నుంచి మొదలు)
- మన దేశ స్వాతంత్ర్య దినోత్సవం, రాఖీ పండుగ/ రక్షాబంధన్, జంధ్యాల పూర్ణిమ, శ్రీ అరవింద జయంతి (15వ తేది)

## ఇలా చేద్దాం

# ప్రాయశ్చిత్త జపానికి వేళ ఇదే!



వేదపండితులు, సంధ్యావందనోపాసకులు ఏడాదిపాటు గాయత్రీ మంత్రజపాలలో తెలిసీ తెలియక చేసే దోషాలకు సనాతన శాస్త్రాలు ప్రాయశ్చిత్తాన్ని చూపించాయి. శ్రావణ పూర్ణిమనాడు లేదా ఆ మర్నాడు (పాడ్యమి) 'సహస్ర గాయత్రి జపం' దీనికి అద్భుత నివారణగా 'ఆపస్తంభ ధర్మసూత్రం' వెల్లడించినట్లు ఆధ్యాత్మికవేత్తలు అంటున్నారు. ఈ మేరకు 'హైదరాబాద్ (తెలంగాణ) గాయత్రి ఉపాసన సంస్థ' వచ్చే శుక్రవారం (16వ తేదీన) సిద్దిపేట జిల్లా వర్గల్ శ్రీవిద్యా సరస్వతీ శనైశ్వర దేవాలయ ప్రాంగణంలో 'సామూహిక సహస్ర గాయత్రీ జపం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఆ రోజు ఉదయం గం|| 7.30 ని||ల నుంచి 11.30 వరకు ఎందరో వేదపండితులు ఈ జపంలో పాల్గొంటారని నిర్వాహకులు ప్రకటించారు. అయితే, ఇది కేవలం బ్రాహ్మణులకు మాత్రమే కావడంతో మిగిలిన వర్గాలకు చెందిన యజ్ఞోపవీతధారులెవరైనా సహస్ర గాయత్రీ జపాన్ని వ్యక్తిగతంగా ఇండ్లలోకాని, దేవాలయాలలోకానీ లేదా మరే అనుకూల ప్రదేశంలోనైనా ఆచరించుకోవచ్చు. ఏడాది కొకసారి వచ్చే ఈ అరుదైన అవకాశాన్ని గాయత్రి మాత భక్తులంతా సద్వినియోగపరచుకోగలిగితే ఆ అమ్మవారు ప్రసన్నానికి పాత్రులవవచ్చు.

## మంచిమాట



ఆకాశం చీలిపోయినప్పుడు, నక్షత్రాలు చెదిరిపోయినప్పుడు, సముద్రాలను చీల్చి వేసినపుడు, సమాధుల్ని తెరచి వేసినప్పుడు.. అప్పుడు ప్రతి వ్యక్తికీ తాను ముందూ, వెనుకా చేసిన నిర్వాకమేమిటో తెలిసిపోతుంది.


**- అల్ ఇన్ ఫితార్**
**('ఖురాన్ అవగాహన' నుంచి)**

---

మల్లాది వెంకట కృష్ణమూర్తి | తీర్థయాత్ర 16



# నర్మద పరిక్రమ



## ఆదిశంకరుల దీక్షాస్థలి!

(గత సంచిక తరువాయి)

అక్కడ ఓ పాశ్చాత్య జంట కనిపించింది. వాళ్ల అనుమతితో వారి ఫొటోలు తీశాను. అతని పేరు మిఖాయిల్ బ్రెండెల్. ఇద్దరూ జర్మనీనుంచి వచ్చారు. వారు హిందూ సంప్రదాయం ప్రకారం కూర్చొని హోమం చేస్తున్నారు. మాటల్లో నేను వారితో చెప్పాను.

''తూర్పు దేశాల్లో ఆధ్యాత్మిక సంపద అత్యధికం. అద్వైత సిద్ధాంతం ఇక్కడిగని. దాన్ని సాధ్యమైనంత ఎక్కువ పొందాలి.''


నేను తీసిన ఫొటోలు పంపడానికి తమ మెయిల్ ఐడీ ఇచ్చాడతను. తర్వాత వారికి వెంకటేశ్వరరావు వాటిని పంపితే, థ్యాంక్స్ చెపుతూ తను తీసిన ఓంకారేశ్వర్ రాజమహల్ ఫొటోలు మా ఇద్దరికీ పంపాడు మిఖాయిల్.

మధ్యప్రదేశ్‌లో భక్తులు అధికంగా వచ్చే ఆలయం ఓంకారేశ్వర్. గుళ్లోంచి బయటకు రాగానే పక్కనే ఓ చిన్న గుహ ఉంది. మన జగద్గురువు ఆదిశంకరాచార్యకే గురువైన గోవిందతీర్థుల వారు ఈ గుహలోనే ఉండేవారని చెప్తారు. ఆదిశంకరాచార్యుల వారు కొన్ని వందల ఏండ్ల క్రితం గోవిందతీర్థుల వారిని కలుసుకొన్న ప్రదేశమూ ఇదే. ఈ క్షేత్రంలోనే ఆదిశంకరాచార్యుల వారికి ఆయన సన్యాసదీక్ష ఇచ్చారనీ అంటారు.

దర్శనం అయ్యాక పడవరేవుకు తిరిగి వెళ్లేదారిలో అటు ఇటు అనేక దుకాణాలు ఉన్నాయి. శివలింగాలు, దేవుళ్ల ప్రతిమలు, పూజా సామగ్రి, హిందీ భక్తి పుస్తకాలు, అనేక దేవుళ్ల ఫొటోలు అమ్ముతున్నారు. కొన్ని షాపుల్లోంచి భక్తి గీతాలు వినిపిస్తున్నాయి. వెంకటేశ్వరరావు నర్మద పరిక్రమ సీడీల సెట్‌ను డెబ్బయి రూపాయలు ఇచ్చి చెరొకటి కొన్నారు. మళ్లీ మెట్లు దిగి పడవల్లో ఆవలి ఒడ్డుకు చేరుకున్నాం.

★★★

నర్మద నది పరిక్రమకు ముందు దీక్షను తీసుకోవాలి. అందుకు అందరం నదిలో స్నానాలు చేశాం. నర్మదలో స్నానాలు చేసే తీరాలు తక్కువ. హోషంగాపూర్, ఓంకారేశ్వర్, మహేశ్వర్, నాపేశ్వర్, నారేశ్వర్, గరుడేశ్వర్ ప్రదేశాలలో భక్తులు అధికంగా స్నానాలు చేస్తుంటారు. నర్మదానది ఒడ్డునగల ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఎక్కువమంది ప్రజలు సందర్శించేది ఈ ఓంకారేశ్వరుడి ఆలయాన్నే. అధికంగా ఉన్నవి హనుమంతుడి ఆలయాలు, తర్వాత శివాలయాలే. నర్మదీయ బ్రాహ్మణులు నర్మదమాతను పూజిస్తారు. కాబట్టి, నర్మద ఆలయాలు కూడా తీరప్రాంతాలలో చాలానే ఉన్నాయి.



ఓంకారేశ్వర్

**నర్మదానది ఒడ్డునగల పలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఎక్కువమంది భక్తులు సందర్శించేది ఈ ఓంకారేశ్వరుడి ఆలయాన్నే!**

ప్రభు మాట్లాడిన ఓ పురోహితుడు ఓ కలశంలో నర్మద నీటిని నింపి దానికి పావుగంటకు పైగా చేశాడు. అందులోని జలాన్ని అందరిపైనా చిలకరించాడు. అందరి చేతులకు కంకణ దారాన్ని కట్టి, దీక్షను ఇచ్చాడు. పూజ పూర్తయ్యాక బ్రాహ్మణుడికి దక్షిణగా తలో ఇరవై రూపాయలు ఇవ్వమన్నారు దేశాయ్.

### నర్మద పరిక్రమ నియమాలు

**పరిక్రమ వాసులు పాటించవలసిన నియమాలను దేశాయ్ మాకు చెప్పారు. వాటిలో ప్రధానమైవి ఇవీ:**

• దీక్షను పూర్తయ్యేదాకా నదిని ఎక్కడా దాటకూడదు. • కనీస ద్రవ్యం, వస్తువులనే వెంట ఉంచుకోవాలి. (ఉదా||కు ఒంటిమీద ఓ జత- సంచీలో మరొక జత దుస్తులు చాలు). • భోజనం యాచించకుండా, లభించిందే తినాలి. (అక్కడి గ్రామస్థులే పిలిచి భోజనం పెడతారు. గోధుమరొట్టెలో పచ్చిమిర్చి, ఉప్పు కలిపి నూరిన పచ్చడిని నంచుకొని తినాలి. మజ్జిగ తాగాలి. అంతే). • కంది పప్పు, బఠానీలను పరిక్రమవాసులు తినకూడదు. • కాళ్లకు చెప్పులు ధరించకూడదు. • సాయంత్రం హారతి ఇవ్వాలి. • ఓ సీసాలో నర్మదాజలం సేకరించి పరిక్రమ మొదటినుంచి పూర్తయ్యేదాకా నిత్యం నర్మదామాతకు పూజ చేయాలి. • చాతుర్మాస సమయంలో 4 నెలలు ఆగిపోవాలి. (ఆ సమయంలో పరిక్రమ ప్రయాణం చేయకూడదు. అంటే, మూడేండ్ల పరిక్రమలో ఏడాదికి 4 నెలలు చొప్పున 12 నెలలు పరిక్రమను ఆపేయాలన్న మాట.) • పరిక్రమ వాసులు అందరినీ 'ఓం నర్మదే హర' అనే మాటలతో పలకరించాలి.

**-సశేషం**

---

## వరాల లక్ష్మికి స్వాగతం..

శక్తితత్త్వం

# సంపత్కరీ స్వరూపం!



**'రావమ్మా మా ఇంటికీ' అని మనసారా పిలిచే ప్రతీ గృహిణి ఇంట్లోకి వరలక్ష్మీదేవి అత్యంత మంగళకరంగా అష్టలక్ష్మీ సమేతంగా విచ్చేసే శుభసమయమిదే!**

శ్రావణమాసంలో వచ్చే రెండవ శుక్రవారం చాలామంది ముత్తయిదువలు 'వరలక్ష్మీ వ్రతం' తప్పక ఆచరిస్తారు. ఎవరైనా ఉన్నంతలో లోభత్వాన్ని చూపించకుండా ఘనంగానే జరుపుకొంటారు. 'మనసా వాచా కర్మణా' అమ్మవారి సేవలో ధన్యులవుతుంటారు. హైదరాబాద్, జూబ్లీ హిల్స్ పెద్దమ్మగుడి సమీపంలోని రోడ్‌నంబర్ 49లోని ఆ ఒక్క ఇంట్లో జరిగే వరలక్ష్మీ వ్రతవేడుకలను మాత్రం కండ్లనిండా చూడాలని ఆశపడేవారు చాలామందే ఉంటారు. కారణం, అక్కడ అమ్మవారికి లక్షలాది పూలతో జరిగే అద్భుత అలంకరణ! నిజానికి ఇది కాదు, ఇప్పటి వార్త. ఈ పూజా కార్యక్రమ నిర్వాహకురాలు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీమతి విజయలక్ష్మీ రాజం రెండు నెలల ముందునుంచే అమ్మవారి సాహిత్యసేవకు ఉపక్రమించడం విశేషం. ఏడాది కేడాది శ్రీ లలితా సహస్రనామ స్తోత్రంలోని ఒక్కో శ్లోకానికి తాత్పర్య సహిత వ్యాఖ్యానం, అందులోని శక్తితత్వాన్ని ఆమె అత్యంత సరళంగా విడమరిచి అక్షరబద్ధం చేయడం గమనార్హం. అదంతా ఒక చిన్న పుస్తకరూపంలో ప్రతీ సువాసినికీ వాయనంలో భాగంగా ఆమె అందజేస్తారు. 'వరలక్ష్మీ వ్రతం రోజు లక్ష్మీదేవి ఆరాధన కాకుండా లలితా అమ్మవారి ప్రస్తావన ఏమిటా' అని కొందరికి ఆశ్చర్యం కలగవచ్చు. కానీ, ఆ ఒక్కో శ్లోకంలోని పరాశక్తి అంశ, అందులోని మహాలక్ష్మీదేవి తత్వాన్నే ఆమె మనకు ఎరుక పరుస్తారు. ఈ సంవత్సరం లలితా త్రిపురసుందరీ దేవి 'సర్వోన్నత సంపత్కరీ స్వరూపం'గా అవతరిస్తున్నదని, అసలు సంపత్కరీ అంటేనే వరలక్ష్మీ దేవికి ప్రతీక అని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆ జగన్మాత మహావైభవంలోని కొన్ని విశేషాలనే 'నమస్తే తెలంగాణ- చింతన' పాఠకుల కోసం ఆమె మాటలుగానే ప్రత్యేకంగా అందిస్తున్నాం, చదువండి.


**'సంపత్కరీ సమారూఢ సింధుర వ్రజాసేవిత**
**అశ్వారూఢా దిష్ఠితాశ్వ కోటికోటిభిరావృతా'**

అనంతకోటి సూర్యమండలాలను మాలగా ధరించి, సహస్రావంతమైన పాలపుంతల సమీకరణ శక్తిగా 'శ్రీం'కార మంత్ర స్వరూపంగా ఇష్టకామేశ్వరీ రూపంలో అవతరిస్తున్న శ్రీశ్రీశ్రీ లలితా మహాభట్టారికకు సాష్టాంగ నమస్కారం చేద్దాం. సకల సృష్టికి ఆధారమై, జన్మజన్మల పుణ్యఫలంగా ఈ జన్మలో అష్టలక్ష్మీ ప్రదాతయైన సుఖసంపత్కరీ స్వరూపాన్ని ఆవాహన చేసే అరుదైన వేళా విశేషమిది. గజసమూహాల శక్తిగా, రణకోలాహలంపైన అధిష్టించిన సంపత్కరీ దేవి అన్యాయాలపై రాక్షస దుష్టస్వభావ ప్రవర్తన కలవారిపై ధర్మయుద్ధానికి సిద్ధపడడం ఇక్కడ ప్రధానాంశం.

శ్రీదేవి ఆయుధమైన అంకుశం నుండి ఉద్భవించిన దేవత సంపత్కరీ. ఈ అమ్మవారి వైభవం ఊహింపశక్యం కాదు. ఆమె 'రణకోలాహలం' అనే ఏనుగుపై అధిష్టించి వస్తుంది. అన్ని రకాల ఏనుగులనూ చాలా తేలికగా మచ్చిక చేసుకొనే అపార శక్తి సామర్థ్యాలు ఆమె సొంతం. త్రిపుర సుందరీదేవి సంపత్కరీ అనే మంత్రదేవతను సర్వగజసేనకు అధికారిణిగా నియమించింది. సుఖ సంపద్వికారమైన చిత్తవృత్తికీ 'సంపత్కరి' అని పేరు. ఈ చిత్తవృత్తిలో శబ్దాదుల సముదాయాన్ని 'సింధుర వ్రజమ'ని అంటారు. ఇందులోని సుఖప్రవృత్తి, చిత్తవృత్తికి కారణాలైన సుఖవికారాలే గజములు (ఏనుగులు). లౌకికమైన సుఖానుభవాలపై ఇంద్రియ నిగ్రహాల సాధనద్వారా ఉద్ధరింపజేసేదే ఈ జగన్మాత.

ఒక మదపుటేనుగును మావటివాడు అంకుశంతో ఎలా అదుపు చేస్తాడో అలాగే, సుఖవికారాలనే ఏనుగును అధిష్ఠించిన సంపత్కరీ దేవి మనిషి ప్రవర్తనను అదుపులో ఉంచుతుంది. ఇది ఒకరోజులో అయ్యేది కాదు. భక్తి, సత్కర్మలు, ఉపాసనల ద్వారా ఎవరికి వారే సంయమనం పాటిస్తూ, శిక్షణ పొందాల్సి ఉంటుంది. 'సంపత్కరి' అనే పేరులోని 'కరి' అనే శబ్దానికి విద్యా విశేషమని కూడా అర్థం. త్రివర్గ, దశాక్షరీ అనే రెండు మంత్రాలలోని మనోనియమాలను గజవశ్యానికి, గజశిక్షణకు ఉపయోగిస్తారు. మనసును ముఖ్యప్రాణమున లయింపజేసి తురీయస్థితిని పొందడమే ఈ సంపత్కరీ విద్య. నిజానికి ఇదెంతో రహస్యమైంది. దీనిని కేవలం గురుముఖంగానే అభ్యసించాలి. జ్ఞానం (తెలుసుకోవలసిన తెలివి), జ్ఞాత (తెలుసుకొనే వ్యక్తి), జ్ఞేయం (తెలుసుకొని పాటించవలసింది) ఈ మూడు త్రిపుటిలోనివి. ఇవి ఒక దానితో ఒకటి ముడిపడి ఉంటాయి. అయితే, 'ఈ మూడు కూడా బ్రహ్మమే' అన్న జ్ఞానం యోగికి ఉంటుంది.

ఇంద్రియాలతో కలిగే జ్ఞానాలన్నీ కూడా 'నేనే' అని తెలుసుకోవడమే అసలు సంధానం. ఇది చక్కగా జరిగినపుడు తురీయ జ్ఞానం బహిర్గతమవుతుంది.



### అష్టలక్ష్మీదేవి స్థిరనివాసం

సంపత్ స్వరూపిణియైన మహాలక్ష్మి ప్రకృతి సిద్ధంగా అష్టవిధాలుగా అవతరించింది. కేవలం ధనం ఉండగానే 'సంపత్తు' ఉందని అనలేం. అష్టలక్ష్మీ స్వరూపాలు: ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, విద్యాలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్యలక్ష్మి, విజయలక్ష్మి. వీరంతా (ఎనిమిది మంది) కూడినప్పుడే నిజ జీవితంలో 'అష్టలక్ష్మీదేవి' స్థిరనివాసమైనట్టు లెక్క. ఆ గృహం ఇక ఆనంద నిలయమే అవుతుంది. 'శ్రీసూక్తం'లో 'ధనమగ్ని: ధనం వాయు: ధనం సూర్యో: ధనంవసు: ధనమింద్రో: బృహస్పతిం వరుణం ధనమస్నుతే' అని ఉంది. సృష్టిలోని ప్రతీ వస్తువుకూగల ప్రాధాన్యం, విలువ మనకు అర్థం కావు. డబ్బుతో కొనలేనివి ఎన్నో ఉంటాయి. సంపత్తులు ఎన్ని ఉన్నా ప్రేమ, ఆప్యాయతలు, భక్తిశ్రద్ధలు లేని ఇంటి పరిసరాలు నిష్ఫలం. సంపత్కరీ అమ్మవారిని నమ్ముకొని, వేడుకొన్న వారికి ఆమె దీవెనలు తప్పక లభిస్తాయి.

జాగృత్, స్వప్న, సుషుప్తులకంటే ఈ జ్ఞానం భిన్నమైంది. ఇది మనుషులందరికీ సమానంగానే ఉంటుంది. కానీ, యోగులకు మాత్రం త్రిపుటి సంబంధం వల్ల ఏకాగ్రత ఎక్కువగా కలుగుతుంది. యోగి తన చిత్తవృత్తితో తనలోని ఆత్మచైతన్యాన్ని కూడా గుర్తించగలడు. చిత్తవృత్తితోనే యోగులు బ్రహ్మంలో ఐక్యమవుతారు. అప్పుడు బాహ్యంగా ఏం జరుగుతుందన్నదీ వారికి తెలియదు. అంటే, వారి చిత్తవృత్తి ఫలవ్యాప్తి చెందదు. కేవలం వృత్తి (కర్మ) మాత్రమే వ్యాప్తి చెందుతుంది. అది క్రమంగా చైతన్యవంతమై అన్ని స్థితులూ దాటి, సమాధిస్థితి వరకు వ్యాప్తి చెందుతుంది. చిత్తవృత్తి లేకుండా, ఆత్మజ్ఞానం కూడా లేకుండా ఉన్న స్థితిని 'అవిద్యమాయ' అంటారు. ఈ మాయ నశించినప్పుడే జీవికి 'బ్రహ్మైక్యానుభూతి' కలుగుతుంది. ఇదే తురీయ స్థితి. దీనిని పొందడానికి సాధన చేయవలసిన విద్యగురించి 'గురు చరిత్ర'లో దత్తాత్రేయస్వామి కార్తవీర్యునికి ఉపదేశించాడు.

***'మదగజరూప వాహినులు మా మనమందలి చిత్తవృత్తులే. సదయము సంపదుల్లాసిత సాగరవీచి సుఖప్రవాహమై మెదలెడు గాదె, వానినిక మెలుగ నీపై నెల్లవేళలన్ కుదురుగ నుండునట్లుగన్ గూర్మిని గూర్చెడు శక్తినీయవో'.*** ఇలా జ్ఞానాలన్నీ తురీయంలో ఏకమవడాన్నే 'ఐక్య సంపత్కరం'. ఈ విద్య 'సుఖసంపన్మయి, సుఖసంపత్కరి, ఐక్యసంపత్కరీ'గా వ్యవహారంలో ఉన్నది. ఇటువంటి ఐక్యసంపత్కరి జ్ఞానంతో శ్రీ లలితా త్రిపురసుందరి ఆరాధనలు అందుకొంటున్నది. అంతరంగంలోని ఏనుగులు (రాక్షస ప్రవృత్తి) సాధనద్వారా సర్వశక్తి సమీకరణలతో కూడిన సాధుస్వభావం గలవిగా మారిపోతాయి. అమ్మవారి అనుగ్రహంతో రాక్షస ప్రవృత్తికూడా నశించిపోతుంది. వారిని సద్బుద్ధిగల భక్తులుగా మార్చే అద్భుత శక్తి స్వరూపిణి సంపత్కరీదేవి. ఆమె ఇచ్ఛాశక్తి స్వరూపిణి కూడా. ఎప్పుడైతే మన కోర్కెలను అమ్మకు అప్పజెప్పి వేడుకొంటామో అప్పుడు వాటిలోంచి కేవలం ధర్మబద్ధమైన వాటిని మాత్రమే ఆమె నెరవేరుస్తుంది.



**శ్రీమతి సి. విజయలక్ష్మీ రాజం**

---


# అత్యద్భుత శక్తి మంత్రం!

**మానవాళికి విద్య, ఆయురారోగ్యం, ఐశ్వర్యం, సుఖశాంతులను అన్నింటినీ ప్రసాదించే ఏకైక మంత్రరాజం గాయత్రి. త్రికరణ శుద్ధిగా నిత్యం దీనిని స్మరించే వారికి ఆత్మచైతన్యంతోపాటు దివ్యతేజస్సూ సొంతమవుతుందని భారతీయ శాస్త్రాలు చెబుతున్నాయి.**

అసలు గాయత్రీ మాత ఎవరో తెలిస్తే ఆమెలోని అత్యద్భుత శక్తి మనకు అర్థమవుతుంది. సమస్త జగత్ సృష్టికారిణి సాక్షాత్ ఆదిపరాశక్తికి ఆమె ప్రతీకాత్మక దేవత. సర్వదేవతల ఆవిర్భావ మూలస్వరూపమూ ఆమెనే. 24 బీజాక్షరాలతో కూడిన ఆమె ఆరాధనా జపజలానికి ఉన్న శక్తి అనంతం. పవిత్రజలాన్ని ఈ మంత్రంతో ఆవాహన పరిచి పైకి విసిరిన ఫలితంగా ఆ నీళ్లు కాస్తా వజ్రాలుగా మారిన వైనం కృత యుగంలో జరిగినట్టు ఆధ్యాత్మికవేత్తలు చెప్తారు. నేటికీ ఈ మంత్రజలశక్తి మన భౌతిక నేత్రాలకు కనిపించని ఫలాలనిస్తుందని, దీనికి ఎందరో మహానుభావుల జీవితచరిత్రలే నిదర్శనమనీ వారంటారు.

భర్గస్సు (భర్గో దేవస్య) అనే తేజోశక్తి ఆధారనే గాయత్రీ మంత్రజపం. వేగిన, ఉడకబెట్టిన విత్తనాలను సైతం మొలకెత్తింపజేసే అనూహ్య ప్రాణశక్తి ఈమె సొంతం. త్రికాల సంధ్యోపాసకులకు, నాలుగో సంధ్యకాలం (అర్ధరాత్రి)లోనూ జపతపాలు చేసుకొనే యోగులకు గాయత్రీ మంత్రం నిజంగానే ఒక బ్రహ్మాస్త్రం. 'తల్లిని మించిన దైవం లేదన్నది ఎంత నిజమో గాయత్రిని మించిన మంత్రమూ లేదన్నది అంతే సత్యమని' జగద్గురువు ఆదిశంకర భగవత్పాదుల వారే తేల్చేశారు. ఇందులోని రెండు జతల బీజాక్షరాల్లో ఒక్కోటి ఒక్కో దేవతాశక్తికి ప్రతీకలుగా పండితులు చెప్తారు. అందుకే, అంతటి అసాధారణ శక్తి

## వేళా విశేషం



**శ్రీ గాయత్రై నమః**

సంపన్నురాలిగా గాయత్రీ మాతను వారు అభివర్ణిస్తారు.

అయిదు ముఖాలు, పది చేతులతో మహాతేజస్సుతో వెలుగొందే, గాయత్రీమాత ప్రతీ సంవత్సరం శరన్నవరాత్రులలో వరదాభయ హస్తాలతో దీవించే 'కమలాసన'గా దర్శనమిస్తుంది. అలాగే, శుభ శ్రావణమాస పౌర్ణమి వెండివెలుగుల వేళ 'గాయత్రీ ఉపాసన'కు ప్రతిబింబంవంటి యజ్ఞోపవీతాన్ని వేదపండితులంతా విధిగా కొత్తది పునర్ధరిస్తారు. ఉపనయమైన బ్రహ్మచారులంతా ఈరోజు తప్పనిసరిగా ఉపాకర్మ ఆచరిస్తారు. అందుకే, ఇది 'జంధ్యాల పున్నమి'గానూ పేరొందింది. ఈ మంత్రం ఆది వేదమైన ఋగ్వేదంలోనే మొట్టమొదట దర్శనమిచ్చినట్లు వేదపండితులు చెప్తారు.

భారతీయ ధార్మికమంత్రాలేవీ చాలావరకు రహస్యాలుగా లేవు. అందరూ చదువుకోవడానికి వీలుగా అందుబాటులోకి వచ్చాయి. గాయత్రీ మంత్రం సీడీలలోనూ అందుబాటులోకి వచ్చింది. దీనిని విన్నా, స్మరించినా లభించే పుణ్యం అనంతం. ఈ పున్నమి రోజే కాదు, ప్రతిరోజూ ఉదయ- సాయంత్రాలలో ప్రతి ఒక్కరూ శుచి శుభ్రతలతో ఎంత వీలైతే అంతసేపు వ్యక్తిగతంగా మనసులోనే ఈ జపాన్ని చేసుకోవచ్చు. కాకపోతే, ఉచ్చారణ దోషాలు రాకుండా చూసుకోగలిగితే ఎంతో మంచిది. ఏమైనా, ఈ జపప్రభావం ఊరికే పోదని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు.

**కేశవపంతుల వేంకటేశ్వరశర్మ**

## ధర్మ సందేహం

# నాస్తికత్వానికి మూలం

కొందరు 'దేవుడు లేడని, భక్తి, ఆధ్యాత్మికత అంతా వట్టి మూఢత్వమని' విపరీతమైన నాస్తిక భావనలో కొట్టుమిట్టాడుతూ ఉంటారు. అలాంటి వారిలో చాలామంది జీవితంలో అంతా అయిపోయాక, వృద్ధాప్యదశలో ఆధ్యాత్మిక మార్గంలోకి రావడం చూస్తూనే ఉన్నాం. ఇలా ఎందుకు జరుగుతుందనడానికి భగవద్గీతలోనే సరైన కారణం ఉన్నది. 'న మాం దుష్కృతినో మూఢా: ప్రపద్యన్తే నరాధమా:/ మాయయా పహృతజ్ఞానా ఆసురం భావమాశ్రితా:' (15-7). దీని ప్రకారం 'అలాంటి వారంతా అటువంటి దుష్కృతి బారిన పడడం ఎందుకంటే, 'గత జన్మ వాసనల వల్ల అని శ్రీకృష్ణ పరమాత్మ ఆనాడే పేర్కొన్నారు. ఈ సత్యం తెలుసుకోకుండా వారిని మాయ కమ్మి ఉంటుంది. సత్వ, రజ, స్తమోగుణ రూపమైన ఆ మాయ అంత త్వరగా తొలిగేది కాదు కూడా. 'ఫలితంగానే వారిలో నాస్తికత్వం ప్రబలుతుందని' ఆధ్యాత్మిక వేత్తలు అంటారు.

---

## సుడోకు

డైలీ సుడోకు **116** సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 8 | 7 | 3 | 2 | 5 | 1 | 4 | 6 | 9 |
| 6 | 1 | 9 | 3 | 4 | 8 | 5 | 2 | 7 |
| 5 | 2 | 4 | 9 | 6 | 7 | 8 | 3 | 1 |
| 1 | 4 | 8 | 5 | 9 | 6 | 3 | 7 | 2 |
| 9 | 3 | 2 | 7 | 1 | 4 | 6 | 8 | 5 |
| 7 | 6 | 5 | 8 | 3 | 2 | 1 | 9 | 4 |
| 4 | 9 | 7 | 6 | 8 | 5 | 2 | 1 | 3 |
| 2 | 5 | 6 | 1 | 7 | 3 | 9 | 4 | 8 |
| 3 | 8 | 1 | 4 | 2 | 9 | 7 | 5 | 6 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

### డైలీ సుడోకు - 117

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | 4 | | 6 | 2 |
| | | | 9 | 5 | | | 1 | 3 |
| | | | 6 | | | 8 | | 9 |
| | | 3 | 2 | | | | | 8 |
| | 7 | | | | | | 3 | |
| 9 | | | | | 1 | 4 | | |
| 5 | | 6 | | | 2 | | | |
| 3 | 2 | | | 6 | 5 | | | |
| 8 | 1 | | 4 | | | | | |

## ట్వీట్



**మన సాహో సినిమా గురించి దేశం మొత్తం ఎదురుచూస్తున్నది. దాని విజయాన్ని మేమంతా ఎంజాయ్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రభాస్ అన్నా.. సాహో టీమ్ ఆగస్టు 30న బ్లాక్‌బస్టర్‌కి తక్కువ కాకుండా మనం సక్సెస్ కొడుతున్నాం. గ్యాంగ్‌లీడర్ సినిమా తేదీని రేపు ప్రకటిస్తాం.**

**నాని**
@NameisNani



నానిని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్నవారి సంఖ్య
33,63,521


## కామన్‌మ్యాన్ వాయిస్

ప్రతిఫలం ఆశించని చోటే నిజమైన ప్రేమ చిగురిస్తుంది.
– Indravelli Ramesh

అంటే.. తప్పో, ఒప్పో నాకు తెలీదు.
కానీ ఒక్క దెబ్బకి ఉరితీసి నొప్పి తెలియకుండా చంపేసే బదులు..
వాళ్ల అవయవాలు తీసి.. సామాన్యులకి లేదా..
ఆర్మీలో పని చేసి అవయవాలు కోల్పోయిన వాళ్లకి అమర్చితే బాగుండు అనిపిస్తుంది.
అంటే.. తప్పు చేసిన వాడితోనే మంచి పనులు చేయించడం అన్నమాట.
– పాళీ

అన్యాయం వైపు నిలబడాలంటే మూర్ఖత్వం చాలు.
న్యాయం వైపు నిలబడాలంటే ధైర్యం కావాలి.
– Jakkani Raju

## వైరల్ వీడియో




**సంపూర్ణేష్ బాబు త్రిపాత్రాభినయం చేసిన్న సినిమా కొబ్బరిమట్ట. పాపారాయుడు, పెద్దరాయుడు, ఆండ్రాయుడు రోల్స్ పోషించి కడుపుబ్బా నవ్వించేందుకు థియేట్రికల్ ట్రైలర్‌తో వచ్చాడు. ఈ వీడియో ఇప్పుడు యూట్యూబ్‌లో ఉంది. మీరూ చూసి నవ్వుకోండి.**

Kobbari Matta Theatrical Trailer || Sampoornesh Babu || Rupak Ronaldson | Steven Shankar
Total views : 5,56,923+
Published on 7 Aug 2019

epaper.ntnews.com



# రివర్స్ వాటర్ ఫాల్స్

**సమ్‌థింగ్ స్పెషల్**

సాధారణంగా జలపాతాల నీరు పెద్ద పెద్ద కొండల మీద నుంచి కిందకు జల జలా ఉవ్వెత్తున ఎగిసి పడుతూ జారిపోతూ ఉంటుంది. కానీ ఇక్కడ అలా కాదు కొండల మీద నుంచి నీరు పైకి పోతూ ఉంటుంది. నీరు ఎప్పుడూ పల్లానికే కదా ప్రవహించాల్సింది అంటే.. నిజంగానే నీరు కిందకే వెళ్లాలి. కానీ ఇక్కడ మాత్రం రివర్స్ ప్రవహిస్తుంది. నమ్మశక్యంగా లేకున్నా ఇది నిజంగా నిజం. ఇంతకి ఇది ఎక్కడో వేరే దేశంలో కాదు. మన దేశంలో అదీ మన పక్కనన్న మహారాష్ట్రలోని పునెలో. ఇక్కడి సమీపంలోని నానేఘాట్ వద్ద ఉన్నఈ జలపాతం చాలా ప్రత్యేకమైంది. ఇక్కడ భూమికి గురుత్వాకర్షణ శక్తి లేదు. అందుకే జలపాతంలో ప్రవహిస్తున్న నీరు పైకి పోతుందని కొందరు అంటుంటారు. కానీ ఇందులో ఏమాత్రం నిజంలేదు. ఇదంతా గాలి కారణంగానే జరుగుతుంది. పర్వతంపైన మేఘాలు కిందకు దిగుతున్నప్పుడు గాలులు బలంగా వీస్తాయి. దానివల్ల కిందకు ప్రవహించే నీరు రివర్స్‌లో ప్రవహిస్తుంది. అప్పుడు చూడటానికి జలపాతం పైకి పోతున్నట్లు కనిపిస్తుంది. ఇలా నీరు పైకి ప్రవహిస్తూ ఉంటే.. చూడటానికి భలేగా ఉంటుంది. ఈ వింతను చూడడానికి పెద్ద ఎత్తున పర్యాటకులు ఇక్కడికి వ వస్తుంటారు. మనకు దగ్గరల్లోనే ఉందిగా వీలైతే మీరూ ఒక్కసారి వెళ్లిరండి మరి!




III.

నమస్తే తెలంగాణ

# విహారం

[ కరీంనగర్ ]

శుక్రవారం 9 ఆగస్టు 2019


**నిండు ఆకాశమంత** ఎత్తైన కొండలపై నుంచి నేలను ముద్దాడాలన్న ఉబలాటంతో నురుగలు కక్కుతూ జాలువారే నీటిని చూచి తన్మయం చెందని మనసుంటుందా? మంచు బిందువులను తలపించే నీటి తెమ్మెరలు ముఖాన్ని తగులుతూ కశ్మీరు అందాల్ని మరిపిస్తుంటే మురిసిపోని మనిషి ఉంటాడా? వెన్నెల పైటేసుకున్న మేఘాలు ఆకుపచ్చ పావడకట్టిన ఆడవుల్ని స్పృశిస్తూ, కిలకిలమంటూ పలికే పక్షుల్ని పలకరిస్తూ చేసే అల్లరిని ఆస్వాదించాలనుకోనివారు ఎవరు ఉంటారు. తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో ఎత్తైన కొండప్రాంతాల పైనుంచి జాలువారుతున్న జలపాతాలు మన రాష్ట్రానికి మరింత అందాన్ని అద్దుతున్నాయి. ఈ నిండైన అందాల్ని పొదివి పట్టుకుని తెలంగాణకు మకుటాయమానంగా నిలుస్తున్న కొత్త, పాత జలతరంగాలను సందర్శిద్దాం రండి.

# వర్షాల జోరు
# జలపాతాల హోరు



బొగత జలపాతం

### కుంటాల

ఇవి ఆదిలాబాదు జిల్లాలోని సహ్యాద్రి పర్వత పంక్తుల్లో కడెం నదిపై కుంటాల గ్రామానికి సమీపంలోని అభయారణ్యంలో ఉంది. 45 మీటర్ల ఎత్తు నుంచి జలజల పారే నీళ్ళు, ఆ చప్పుడు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. దట్టమైన అడవులలో, సహ్యాద్రి పర్వత శ్రేణిలో గోదావరికి ఉపనది అయిన కడెం నది పై ఈ జలపాతం ఉంది.

### బొగత

ఇది కొత్తగా ఏర్పడిన ములుగు జిల్లా, వాజేడు మండలంలోని బొగత గ్రామంలో ఉంది. బొగతను చీకులపల్లి ఫాల్స్ అనికూడా అంటారు. దట్టమైన పచ్చని అడవుల మధ్య, కొండకోనల నుంచి హోరెత్తే నీటి హొయలతో నిండిన జలపాతమిది.

### గాయత్రి

గాయత్రి జలపాతాలు నిర్మల్ జిల్లాలో ఉన్న అనేక జలపాతాల్లోనివి. ఇవి జిల్లాలోని నేరడిగొండ మండలంలో ఉన్నాయి. సుమారు 70 మీటర్ల ఎత్తునున్న రాతికొండ నుంచి కిందకు జాలువారుతున్న ఈ జలపాత అందాలు చూసినవారిని మైమరపిస్తుంటాయి.

### కనకాయ్

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం బలన్‌పూర్ గ్రామ సమీపంలో ఈ జలపాతం ఉంది. దీన్ని కనకదుర్గ జలపాతం అని కూడా అంటారు. కుంతాలకు 35 కి.మీటర్ల దూరంలో గిర్నూర్ సమీపంలో ఈ జలపాతం ఉంది. ఇది కనకాయ్, బండ్రేవు, చీకటిగుండం అనే మూడు జలపాతాల సముదాయం.

### పారేఖాతి అందాలు

పారేఖాతి జలపాతాలు ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని మాన్కాపూర్ గ్రామ సమీపంలో ఉన్నాయి. పచ్చనిచెట్లు, పెద్దపెద్ద రాళ్లు, గుట్టల మధ్యన జలపాతం 10 మీటర్ల ఎత్తు నుంచి జాలువారుతూ ఆహ్లాదాన్ని పంచుతున్నది.

### పొచ్చెర

పొచ్చెర జలపాతం ఆదిలాబాదు జిల్లాలో బోథ్ మండలానికి వెళ్లే మార్గంలో జాతీయ రహదారికి 6 కి.మీ దూరంలో పొచ్చెర గ్రామ సమీపంలో ఉంది. ఇది దట్టమైన అరణ్యం ఉండి పర్యాటకులను ఆకర్షిస్తున్నది.

### అజలాపురం

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని అజలాపురంలో ఈ జలపాతం ఉంది. మొగలిపూల పరిమళం వెదజల్లుతున్నట్టుండే ఈ జలపాతం అందాలు చూడచక్కగా ఉంటాయి. సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన కొండల మధ్య జలధారలు ప్రవహిస్తున్న తీరు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది.

### గుండాల

గుండాల జలపాతం మహబూబ్ నగర్ జిల్లా, ఆత్మకూరు మండలంలోని గుండాల గ్రామ సమీపంలో ఉంది. ఇక్కడ ఎత్తైన బండరాళ్ళపై నుండి కృష్ణానది ప్రవహించడం వల్ల జలపాతం ఏర్పడింది. కృష్ణానది పడమటి దిశ నుండి తూర్పువైపు ప్రవహిస్తూ జలపాతాన్ని సృష్టిస్తుంది. ఈ జలపాతం కేవలం వేసవి కాలంలో మాత్రమే కనిపిస్తుంది.



'సముతుల' గుండం జలపాతం

### గౌరీగుండాలు (సబ్బితం)

పెద్దపల్లి జిల్లాలో గుండారం-సబ్బితం సరిహద్దుల్లోని గుట్టపై గౌరీగుండం ఉంది. ఇది 40 అడుగుల ఎత్తునుండి కిందికి జాలువారుతూ ఉంటుంది. దీనికి రెండు దిక్కుల్లో వున్న ఆకుపచ్చనిచెట్ల పచ్చదనం, జేగురురంగు రాతిబండలు, తెల్లని నీరు త్రివర్ణాలు అద్భుతదృశ్యాన్ని ఆవిష్కరిస్తుంటాయి.

### సిర్నాపల్లి

సిర్నాపల్లి జలపాతం నిజామాబాదు జిల్లాలోని ధర్పల్లి మండలం సిర్నాపల్లి గ్రామంలో ఉంది. సిర్నాపల్లి సంస్థానానికి చెందిన 'సీలం జానకి బాయి' ఒక తటాకాన్ని నిర్మించారు. ఆ సరస్సు నుండి ప్రవహించే నీరు రామడుగు ప్రాజెక్టుకు ప్రవహిస్తుంది. ఆ క్రమంలో ఏర్పడిందే ఈ జలపాతం.

### భీముని పాదం

ఈ జలపాతం సహజసిద్ధంగా ఏర్పడింది. ఇది మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని కొమ్ములవంచ పరిధి అటవీప్రాంతంలో పచ్చని ప్రకృతి మధ్యన నిరంతర జలధారలతో అలరిస్తున్నది. 70 అడుగుల ఎత్తు నుంచి దూకే జలధార పర్యాటకుల్ని ఉల్లాసపరుస్తుంది.

### మల్లెలతీర్థం

మల్లెలతీర్థం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలంలో విస్తరించి ఉన్న దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో కనిపించే ఒక సుందర సహజ జలపాతం. 500 అడుగుల ఎత్తులో నుండి కిందికి దూకే ఈ జలపాతం చూపరులకు కనువిందు చేస్తూ అలరిస్తున్నది.

### రాయికల్

ఇది కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని రాయికల్ గ్రామానికి 3కిలోమీటర్ల దూరంలో ఉంది. వరంగల్ అర్బన్, కరీంనగర్ జిల్లాల సరిహద్దుల్లో దట్టమైన పచ్చని అటవీ ప్రాంతంలో ఉందీ జలపాతం.

### సప్తగుండాల జలపాతం

సప్తగుండాల జలపాతం తెలంగాణ రాష్ట్రం, కొమరంభీం జిల్లా లింగాపూర్ మండలంలోని పిట్టగూడకు రెండు కిలో మీటర్ల దూరంలో అడవిలో ఉంది.



పారేఖాతి జలపాతం

### రాముని గుండాలు

పెద్దపల్లి జిల్లా రామగుండం మండలకేంద్రంలో ఈ జలపాతాలున్నాయి. త్రేతాయుగంలో శ్రీరాముడు వనవాస కాలంలో ఈ కొండపై దాహర్తి తీర్చుకోవడం కోసం ఈ గుండాలు ఏర్పరిచినట్లు చెబుతారు. అందులో కొన్ని పాలగుండం, నేతిగుండం, భైరవ గుండం, జీడిగుండం, ధర్మగుండం ఇలా 108 గుండాలను ఏర్పాటు చేసినట్లు కథనం ఉంది.

### గద్దల సరి

ఈ జలపాతం భూపాలపల్లి జిల్లాలోని చెర్ల-వెంకటాపురం డివిజన్‌లో ఉంది. గద్దల సరి జలపాతంలో దాదాపు ఏడువందల అడుగుల నుండి నీళ్లు కిందికి దుముకుతాయి. గద్దలు ఎగిరేంత ఎత్తులో ఉండటంతో దీన్ని గద్దల సరి గుండంగా పిలుస్తారు.

### కొర్టికల్

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో ఈ జలపాతం ఉంది. ఇది సహజ సిద్ధంగా ఏర్పడింది. మండలంలోని రాజురా గుట్టల నుండి వచ్చే నీరు వాంకిడి వాగు గుండా ప్రవహించి కొరటికల్ జలపాతంలో కలుస్తుంది.

### బోడకొండ

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధి మంచాల మండల కేంద్రంలోని బోడకొండ గుట్టల్లో ఈ జలపాతం ఉంది. ఎత్తయిన కొండలపై నుంచి నీరు పరవళ్లు తొక్కుతూ కిందకు పారుతుంటుంది.

### జాడి మల్కాపూర్

ఇవి జహీరాబాద్ సమీపంలోని మొగుడంపల్లి మండలం, జాడి మల్కాపూర్‌లో ఈ జలపాతం ఉన్న ది. తెలంగాణ, కర్ణాటకల సరిహద్దు ప్రాంతంలో ఉన్న ఈ జలపాతాన్ని చూడడానికి పక్క రాష్ట్రం ప్రజలు కూడా వస్తుంటారు.

### 'సముతుల' గుండం

ఆసిఫాబాద్ జిల్లా, మండలం నుంచి 26 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ జలపాతం పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. జిల్లాలోని బలంపూర్ నుంచి అటవీ మార్గంలో 5 కిలో మీటర్లు కాలి నడకన వెళ్తే ఈ జలపాతానికి చేరుకోవచ్చు.



పొచ్చెర జలపాతం

### కట్టిపడేస్తున్న 'మిట్టె'

ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్‌లో మిట్టె జలపాతం పర్యాటకులను కట్టిపడేస్తున్నది. జిల్లా కేంద్రం నుంచి 75 కిలో మీటర్ల దూరంలో ఈ జలపాతం ఉంది. జైనూర్ నుంచి లింగాపూర్‌కు చేరుకుని అక్కడి నుంచి 3 కిలో మీటర్లు కాలినడకన వెళ్లాల్సి ఉంటుంది.



కనకాయ్ జలపాతం

### మాదర

ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని చింతలమాదర మందగుడ గ్రామ సమీపంలో ఈ జలపాతముంది. 30అడుగుల ఎత్తు నుంచి చింతలమాదర, అలాగే సుమారు 60 అడుగుల ఎత్తు నుంచి గుండాల నీరు జాలువారుతున్నది.

### జాలువారుతున్న 'బాబేఝరి'

ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలోని బాబేఝరి గ్రామసమీపంలో ఉన్న జలపాతం కనువిందు చేస్తున్నది. జోడేఘాట్ వెళ్లే రహదారి పక్కన పచ్చని అడవి మధ్య లోయలో కనిపించే ఈ దృశ్యం పర్యాటకులను ఆకర్షిస్తున్నది.

### పెద్దగుండం

ఆదిలాబాద్ జిల్లా బోథ్ సమీపంలోని ఇచ్చోడ మండలంలో ఓ సరికొత్త జలపాతం ప్రకృతి ప్రేమికులను ఆహ్వానిస్తుంది. ఈ మండలంలోని కోకస్ మన్నూర్ గ్రామ శివార్లలో అద్భుతమైన ఈ జలపాతం ఉంది.

### ముక్తిగుండం

నిర్మల్ జిల్లా గోదావరి నది ఉపనది అయిన కడెం పరిసరాల్లో ఈ జలపాతం ప్రవహిస్తున్నది. దీనికే గాడిద గుండం అని కూడా పేరు. దట్టమైన అటవీమార్గం గుండా ప్రయాణిస్తే ఈ జలపాతానికి చేరుకోవచ్చు.

### రథం గుట్ట

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని రథం గుట్ట వద్ద జలపాతాలు ఉన్నాయి. రథం గుట్ట పైనుంచి 30 అడుగుల ఎత్తు నుండి నీరు జాలు వారుతున్నది. ఇది మణుగూరుకు కిలోమీటర్ దూరంలో ఉంటుంది.

### పాండవ లొంక

పెద్దపల్లి జిల్లా కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని జాఫర్‌ఖాన్‌పేట గ్రామంలో ఉన్న పాండవలొంక జలపాతం పర్యాటక కేంద్రంగా ఆహ్లాదాన్ని పంచుతుంది. గ్రామానికి సుమారు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాండవలొంక సమీపంలో ఎత్తైన కొండ నుండి, పెద్దలోయలోకి నీళ్ళు దూకే దృశ్యం అందంగా ఉంటుంది.


... మధుకర్ వైద్యుల





గౌరీగుండాలు (సబ్బితం)

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## ఎల్ఐసీలో 300 ఖాళీలు

**లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (హెచ్ఎఫ్ఎల్) వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న మేనేజర్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **మొత్తం పోస్టులు:** 300 (అసిస్టెంట్-125, అసోసియేట్-75, అసిస్టెంట్ మేనేజర్-100)
- ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ ఇండియాలో అతిపెద్ద హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ. అసిస్టెంట్/అసోసియేట్ పోస్టులను రాష్ట్రాలవారీగా, మేనేజర్ పోస్టులను దేశవ్యాప్తంగా భర్తీచేస్తారు.
- **అర్హత: అసిస్టెంట్ పోస్టులకు** ఏదైనా యూనివర్సిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో ఏదైనా డిగ్రీ, **అసోసియేట్ పోస్టులకు** సీఏ ఇంటర్‌తో పాటు బ్యాచిలర్ డిగ్రీలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. **అసిస్టెంట్ మేనేజర్‌లకు** ఏదైనా డిగ్రీలో 60 శాతం మార్కులతోపాటు ఎంబీఏ/ఎంఎంఎస్ లేదా పీజీడీబీఏ/పీజీడీబీఎం, పీజీపీఎం/పీజీడీఎంలో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత. కంప్యూటర్ స్కిల్స్ ఉండాలి.
- **వయస్సు:** 2019 జనవరి 1 నాటికి 21 నుంచి 28 ఏండ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్:** ప్రదేశాన్ని బట్టి సుమారుగా అసిస్టెంట్‌కు రూ. 23,870/- అసోసియేట్‌కు రూ. 35,960/-, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ. 56,000/-
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, వైజాగ్‌తోపాటు దేశవ్యాప్తంగా 50 కేంద్రాల్లో
- **ప్రొబేషనరీ పీరియడ్:** మేనేజర్‌కు ఏడాది. మిగతా పోస్టులకు 6 నెలలు
- **ఎంపిక:** ఆన్‌లైన్ ఎగ్జామ్, పర్సనల్ ఇంటర్వ్యూ
- రాతపరీక్షలో ఇంగ్లిష్ లాంగ్వేజ్, లాజికల్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, న్యూమరికల్ ఎబిలిటీ/క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున నాలుగు విభాగాలలో మొత్తం 4X50=200 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 200.
- నెగెటివ్ మార్కింగ్ విధానం ఉంది. ప్రతి తప్పు సమాధానికి 1/4 మార్కులను తగ్గిస్తారు.
- 120 నిమిషాల్లో పరీక్ష పూర్తిచేయాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 500/-
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 26
- **హాల్ టికెట్ల డౌన్‌లోడింగ్:** సెప్టెంబర్ 9 నుంచి
- **ఆన్‌లైన్ ఎగ్జామ్‌తేదీ:** అక్టోబర్ 9,10
- **వెబ్‌సైట్:** www.lichousing.com

## సెయిల్‌లో

**స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్)లో మేనేజర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- డిప్యూటీ మేనేజర్ (ఎలక్ట్రికల్)-6 పోస్టులు
- **అర్హతలు:** ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత.
- డిప్యూటీ మేనేజర్ (మెకానికల్)-2 పోస్టులు
- **అర్హతలు:** మెకానికల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత.

**నోట్:** అభ్యర్థులు కనీసం 65 శాతం మార్కులతో ఇంజినీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

- **వయస్సు:** పై అన్ని పోస్టులకు 35 ఏండ్లకు మించరాదు.
- **దరఖాస్తు:** వెబ్‌సైట్‌లో
- **వెబ్‌సైట్:** www.sail.co.in

## ఎంపీహెచ్ కోర్సు

**వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ 2019-2020 విద్యా సంవత్సారానికిగాను ఎంపీహెచ్ కోర్సులో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.**




- మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (ఎంపీహెచ్)- రెండేండ్లు
- **మొత్తం సీట్ల సంఖ్య:** 40
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి కనీసం 50 శాతం మార్కులతో ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ (10+2+3 విధానంలో) ఉత్తీర్ణత.
- **వయస్సు:** గరిష్ట వయోపరిమితి లేదు. ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్/బీసీలకు రూ. 4000/- (ఎస్సీ/ఎస్టీలకు రూ. 3000/-)
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ టెస్ట్
- ఎంట్రెన్స్ పరీక్షలో జనరల్/బీసీలకు కనీస అర్హత మార్కులు 40 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో

**చిరునామా:** The Convener,
PG Admissions Committee,
Kalojji Narayana Rao University of Health Sciences, Warangal-506007

- **చివరితేదీ:** ఆగస్టు 21 (5 PM వరకు మాత్రమే)
- **హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడింగ్:** ఆగస్టు 27 నుంచి
- **పరీక్ష:** సెప్టెంబర్ 1 (3 PM-4.30 PM వరకు)
- **వెబ్‌సైట్:** www.knruhs.in

## ప్రొఫెసర్ పోస్టులు



**వడోదరలోని మహారాజ సయాజీరావు యూనివర్సిటీ ఆఫ్ బరోడాలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **పోస్టులు-ఖాళీలు:** ప్రొఫెసర్-56, అసోసియేట్ ప్రొఫెసర్- 63, అసిస్టెంట్ ప్రొఫెసర్-60.
- **విభాగాలు:** ఆర్ట్స్, కామర్స్, ఎడ్యుకేషన్&సైకాలజీ, ఫైన్ ఆర్ట్స్, జర్నలిజం అండ్ కమ్యూనికేషన్, లా, మేనేజ్‌మెంట్ స్టడీస్, పెర్ఫామింగ్ ఆర్ట్స్, ఫార్మసీ, సైన్స్, సోషల్ వర్క్, టెక్నాలజీ &ఇంజినీరింగ్ మొదలైనవి ఉన్నాయి.
- పై ఫ్యాకల్టీలతోపాటు డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్, యూనివర్సిటీ లైబ్రేరియన్, రెసిడెంట్ ఆఫీసర్, యూనివర్సిటీ డిప్యూటీ/అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టులు ఉన్నాయి.
- **అర్హతలు:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీతోపాటు పీహెచ్‌డీ, పీజీ/డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.

**గమనిక:** యూజీసీ నిబంధనల ప్రకారం పోస్టులను భర్తీ చేస్తారు.

- **వెబ్‌సైట్:** www.msubaroda.ac.in

## యంగ్ ప్రొఫెషనల్స్

**పంజాబ్‌లోని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ హార్వెస్ట్ ఇంజినీరింగ్ & టెక్నాలజీ ఖాళీగా ఉన్న యంగ్ ప్రొఫెషనల్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం పోస్టులు:** 7 (గ్రేడ్ 2 యంగ్ ప్రొఫెషనల్ -3, గ్రేడ్ 1 యంగ్ ప్రొఫెషనల్ -4)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత మాస్టర్స్ డిగ్రీ/ బీఎస్సీ/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణత.
- **పే స్కేల్:** గ్రేడ్-2 యంగ్ ప్రొఫెషనల్‌కు రూ. 25,000/-, గ్రేడ్-1 యంగ్ ప్రొఫెషనల్‌కు రూ. 15,000/-
- **ఎంపిక:** రాతపరీక్ష/ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 22,23
- **వెబ్‌సైట్:** www.ciphet.in

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
శుక్రవారం 9 ఆగస్టు 2019

# 'రంగస్థలం' తర్వాత ధోరణి మారింది!

**'ఎంబీఏ పూర్తిచేసి వీఎఫ్‌ఎక్స్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో అనుకోకుండా ఈ రంగం వైపు అడుగులు పడ్డాయి. నేను ఏదీ ప్లాన్ చేసుకుని రాలేదు. హీరోయిన్ అవుతానని, నేను ప్రధాన పాత్రలో సినిమా చేస్తానని అస్సలు ఊహించలేదు' అన్నారు అనసూయ. ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'కథనం'. రాజేష్ నాదెండ్ల దర్శకుడు. బి. నరేంద్రరెడ్డి, శర్మ చుక్కా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం నేడు రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో అనసూయ పాత్రికేయులతో ముచ్చటించారు.**

'క్షణం' తరువాత పదమూడు కథలు విన్నాను. అందులో ఏ ఒక్క స్క్రిప్ట్ నాకు సంతృప్తినివ్వలేదు. ఆ సమయంలో 'కథనం' నాకెంతగానో నచ్చింది. నటిగా నన్ను నేను నిరూపించుకునే సినిమా అవుతుందనే నమ్మకం కలిగింది. అందుకే అంగీకరించాను. దర్శకురాలు కావాలనుకునే ఓ యువతి కథ నేపథ్యంలో సాగుతుంది. తను చెప్పిన కథ నచ్చి ఓ నిర్మాత అవకాశం ఇస్తాడు. ఆ తరువాత ఆ కథలో జరుగుతున్నట్టు నిజ జీవితంలో వరుస హత్యలు జరుగుతుంటాయి. ఆ విషయాన్ని ఆ యువతి పోలీసులకు వివరిస్తుంది. ఆ తరువాత ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి అన్నదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. తొలిసారి ఈ చిత్రంలో కథానాయికగా నటించాను. క్యారెక్టర్ ఆర్టిస్ట్ అంటే ఎలాంటి బాధ్యతలు వుండవు. కానీ హీరోయిన్ విషయం అలా కాదు. ఎంతో బాధ్యత వుంటుంది.

**'రంగస్థలం' తరువాత..**

'రంగస్థలం' విజయం తరువాత నా చుట్టూ వుండేవాళ్లు నన్ను చూసే ధోరణి మారింది. నా స్నేహితులు కొత్తగా చూడటం మొదలుపెట్టారు. దాంతో వాళ్లని పట్టించుకోవడం మానేశాను. సోషల్ మీడియా విషయంలో నా పంథాను మార్చుకున్నాను. గతంలో ప్రతి చిన్న విషయానికి స్పందించే దాన్ని కానీ ఇప్పుడు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఆ విషయంలో చాలా ఓపికతో వ్యవహరిస్తున్నాను.

**కొత్త టేకింగ్‌ని పరిచయం చేస్తుంది...**

'రంగస్థలం'లో నా పాత్రకు పేరొస్తుందని ఊహించలేదు. అయితే ఆ సినిమా తరువాత నేను ఊహించిన స్థాయిలో నాకు అవకాశాలు రాలేదనడం కంటే నచ్చిన కథలు రాలేదు అనడం కరెక్టేమో. నా దగ్గరికి వచ్చిన కథలు బాగున్నా కథనం బాగా లేకపోవడంతో ఆ కథల్ని తిరస్కరించాను. తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో అవకాశాలు వచ్చాయి. అయితే ఇంకా ఏదీ అంగీకరించలేదు. తరుణ్‌భాస్కర్‌తో ఓ సినిమా చేస్తున్నాను. తెలుగు సినిమాకు సరికొత్త టేకింగ్‌ని, మేకింగ్‌ని పరిచయం చేస్తుందని గట్టి నమ్మకం వుంది.



అనసూయ

# శ్రీనివాస్ సక్సెస్ చూసి ఆనందపడుతున్నా!

'బెల్లంకొండ శ్రీనివాస్ తొలి సినిమాలోనే ఉత్తమ నటనను కనబరిచాడు. ఇక 'రాక్షసుడు'లో ఆద్యంతం కథలో లీనమై నటించాడు. తాను ఎలాంటి పాత్రనైనా చేయగలనని నిరూపించుకున్నాడు. అతను భవిష్యత్తులో మరిన్ని మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను' అన్నారు వి.వి.వినాయక్. బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా రమేష్‌వర్మ దర్శకత్వంలో రూపొందించిన 'రాక్షసుడు' చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. కోనేరు సత్యనారాయణ నిర్మాత. గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వి.వి.వినాయక్ 'రాక్షసుడు' సినిమా గురించి తన మనోభావాల్ని పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'నేను పరిచయం చేసిన సాయిశ్రీనివాస్ ఈ స్థాయికి ఎదగడం సంతోషంగా ఉంది. ఈ విజయాన్ని చూసి అతని కన్నా ఎక్కువగా నేను ఆనందపడుతున్నా. చిత్ర నిర్మాత కోనేరు సత్యనారాయణ నాకు మంచి మిత్రుడు. సహృదయుడు. వాళ్ల బ్బాయి కథానాయకుడిగా ఉన్నా...ఈ కథకు సాయి కరెక్ట్ అని భావించి సినిమా నిర్మించడం గొప్ప విషయం. ఖర్చు విషయంలో ఎక్కడా రాజీపడకుండా మంచి నిర్మాణ విలువలతో తెరకెక్కించారు. రీమేక్ చేయడం సులభమని భావిస్తారు. కానీ చాలా కష్టం. ఈ సినిమా తమిళ వెర్షన్ చూశాను. అందులోని టెంపో మిస్ అవకుండా రమేష్‌వర్మ సమర్థవంతంగా రూపొందించాడు. 'అసలు దర్శకత్వం వైపు ఎందుకు వచ్చావు' అని ఓ సందర్భంలో రమేష్‌వర్మను అడిగాను. '800 సినిమాలకు డిజైనర్‌గా పనిచేసి బోర్‌కొట్టి దర్శకుడినయ్యాను సార్' అని చెప్పాడు. కొంతకాలానికి ఏపనినైనా బోర్‌కొడుతుంది. కానీ దర్శకత్వం బోర్ కొట్టదు. ఈ బ్యానర్‌లో రమేష్‌వర్మ మరిన్ని సినిమాలు తీయాలి. ఆయన పెద్ద దర్శకుడిగా ఎదగాలని కోరుకుంటున్నాను. నేను డైరెక్ట్ చేసిన'అల్లుడు శీను' చిత్రంలో సాయిశ్రీనివాస్‌లోని అన్ని కమర్షియల్ కోణాల్ని ఆవిష్కరించే ప్రయత్నం చేశాను. అది ఒక మ్యాజిక్‌లా వర్కవుట్ అయింది. సాయిని అన్ని సినిమాల్లో మంచి ఆర్టిస్టుగా గుర్తించారు. లేకపోతే ఇన్ని చిత్రాలు చేయలేడు. తొలినుంచి కెరీర్ విషయంలో అతను పరిణితితో ఆలోచిస్తున్నాడు. ప్రతి సినిమాకు తనని తాను వృద్ధి చేసుకుంటున్నాడు. కథానుగుణంగా నటిస్తూ ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నాడు. అవకాశం వస్తే భవిష్యత్తులో సాయిశ్రీనివాస్‌తో పెద్ద సినిమా చేయాలనుకుంటున్నాను. అందుకు మంచి కథ కుదరాలి' అన్నారు.



సురేష్‌వర్మ, వి.వి.వినాయక్

# టిక్కెట్లు అమ్ముకునే టైప్ కాదు!



రాహుల్ రవీంద్రన్

**"'మన్మథుడు' చిత్రానికి ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానం వుంది. ఒక ప్రేక్షకుడిగా నాకు నచ్చిన సినిమా అది. ఎప్పుడైనా ఒత్తిడికి గురైనప్పుడు ఆ సినిమానే చూస్తుంటాను. ఆ సినిమా తరహాలోనే థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకుడిని 'మన్మథుడు-2' ఆకట్టుకుంటుందన్న నమ్మకముంది' అన్నారు రాహుల్ రవీంద్రన్. ఆయన తెరకెక్కించిన తాజా చిత్రం 'మన్మథుడు-2'. నాగార్జున కథానాయకుడిగా నటించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా రాహుల్ రవీంద్రన్ గురువారం పాత్రికేయులతో ముచ్చటించారు.**

**రీమేక్ అనగానే భయపడ్డారట ఎందుకని?**

రీమేక్ అని నాగార్జునగారు చెప్పినప్పుడు ఇది అధికారిక రీమేకేనా? అని అడిగాను. సినిమా రీమేక్ హక్కులు తీసుకున్నాం. ఆ విషయంలో భయపడాల్సిన పనిలేదని నాగార్జున చెప్పడంతో నేను మరో ఆలోచన లేకుండా అంగీకరించాను.

**'మన్మథుడు' టైటిల్‌నే ఈ చిత్రానికీ పెట్టడానికి ప్రత్యేకమైన కారణం ఏదైనా వుందా? ఈ టైటిల్ ఐడియా ఎవరిది?**

ఈ ఐడియా మా టీమ్ నుంచి వచ్చిందే. అయితే అది ఎవరిచ్చారనేది మాత్రం కరెక్ట్‌గా గుర్తులేదు. ఈ కథకు 'మన్మథుడు-2'ని మించిన టైటిల్ సెట్టవదు అని చెప్పారు. దీనికితోడు 'మన్మథుడు' టైటిల్‌కు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు వుంది. ఆ టైటిల్ అయితే సినిమాకు ప్లస్ అవుతుందని బలంగా నమ్మాం.

**'మన్మథుడు' చిత్రాన్ని దృష్టిలో పెట్టుకుని వస్తే ఇబ్బంది కదా?**

ఖచ్చితంగా థియేటర్‌కు వచ్చే ప్రేక్షకులు గతంలో వచ్చిన 'మన్మథుడు'తో పోల్చిచూస్తారు. అయితే కథలో దమ్ముంటే ఖచ్చితంగా చూస్తారు. అలా అని 'మన్మథుడు' చిత్రాన్ని మించి ఈ సినిమా వుంటుందని మాత్రం చెప్పను.

**సమంతతో అతిథి పాత్ర చేయించడానికి కారణం?**

ఓ కీలకమైన సన్నివేశంలో సమంత చిన్న అతిథి పాత్రలో కనిపిస్తుంది. ఆ పాత్ర అనుకున్నప్పుడు నాగార్జునకు చెప్పాను. ఆయన కూడా సమంత చేస్తే బాగుంటుంది కానీ చేస్తుందా? అని అడిగారు. వెంటనే ఆ విషయాన్ని సమంతకు చెప్పడం ఆమె ఓకే అనడం చకచకా జరిగిపోయాయి.

**నాగార్జున చిత్రాల్లో వినిపించని డబుల్ మీనింగ్ డైలాగ్స్ ఈ చిత్రంలో వినిపిస్తున్నాయి?**

కావాలని డబుల్ మీనింగ్ డైలాగ్‌లు రాయలేదు. సింగిల్ మీనింగ్‌తోనే రాశాం. కానీ అవి బయటికి వచ్చాక తెలిసింది. అవి డబుల్ మీనింగ్ డైలాగ్స్ అని. 'పిల్లలకు కోచింగ్ ఇవ్వాల్సిన వయసులో బ్యాటింగ్‌కి దిగుతావేంట్రా' అంటూ సినిమాలో రావు రమేష్ చెప్పే డైలాగ్ వుంది. దానికి బయట వేరే అర్థాలు వున్నాయని నాకు తెలియదు. అయినా హాట్ సన్నివేశాలు చూపించి టిక్కెట్లు అమ్ముకునే టైప్ కాదు నేను.

**డైరెక్టర్ అయ్యారు. నటుడిగా కొనసాగుతారా?**

తప్పకుండా కొనసాగుతాను. నాకు నటన అంటే చాలా ఇష్టం. అయితే రెగ్యులర్ చిత్రాలకు భిన్నంగా వుండే కథల్లో మాత్రమే నటించాలనుకుంటున్నాను.

**చిన్మయికి సోషల్ మీడియాలో సపోర్ట్‌గా నిలుస్తుంటారా?**

కొన్ని విషయాలు నేను స్పందిస్తే కానీ ఎదుటివారు అర్థం చేసుకోలేరని నాకు అనిపించినప్పుడు మాత్రమే స్పందిస్తుంటాను. చిన్మయి స్వతంత్ర భావాలుగల అమ్మాయి. తనకు ఏం కావాలో తెలుసు. నేను ఎప్పుడైనా ఒత్తిడిగా ఫీలైనా ఇంటికి వెళ్లగానే చిన్మయి పాటతో అంతా మర్చిపోతుంటాను.











